V6 NEWS
ప్రతి దృశ్యం... ప్రజల పక్షం...

ప్రభాత
వెలుగు
15.01.2019
www.v6velugu.com
మంగళవారం | హైదరాబాద్
సంపుటి: 4 సంచిక: 330 పేజీలు: 12+12+12 | ₹5
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | WARANGAL | JAGTIAL



పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు, శ్రేయోభిలాషులకు 'వెలుగు' సంక్రాంతి శుభాకాంక్షలు

సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం వెలుగు ఆఫీసుకు సెలవు. కనుక బుధవారం సంచిక వెలువడదు. గురువారం సంచికతో మళ్లీ కలుద్దాం



సేంద్రియ సాగుతో మస్తు బర్కత్

తక్కువ ఖర్చు.. ఎక్కువ లాభం ● మార్కెట్‌లో మంచి గిరాకీ

- రాష్ట్రంలో 34,500 ఎకరాల్లో ఆర్గానిక్ సాగు
- సేంద్రియం వైపు రైతుల చూపు
- ప్రోత్సహిస్తున్న సర్కారు
- సాగుపై ప్రత్యేక శిక్షణ
- ఉత్పత్తుల నిర్ధారణకు సర్టిఫికేషన్

హైదరాబాద్, వెలుగు:

'మా తాతలు, ముత్తాతల కాలంల గట్క తిన్నా గట్టిగున్నరు బిడ్డ. పది మంది వచ్చి మీదపడ్డా లేచి ఉరికెటోళ్లు. ఇప్పుడేమో మీరు సన్న బియ్యం, ఫ్రెష్ ఫ్రెష్ పండ్లు, ఫ్రెష్ ఫ్రెష్ కూరగాయలు తింటున్న మంటున్నరు. ఏం ఫాయిదా? తాకతే లేకపాయె. నెలల పదిసార్లు దవాఖాన్ల చుట్టే తిరుగుతున్నరు' పట్నం నుంచి పల్లెకు వెళ్లేవారికి పెద్దమనుషుల నుంచి వినిపించే మాట ఇది. నిజమే..! అప్పట్లో గట్క తిన్నా గట్టిగానే ఉన్నారు. మక్క గట్కలో పెరుగుపోసుకొని తింటే ఆ మజానే వేరు. అప్పటి బియ్యం, అప్పటి పప్పులు, అప్పటి పండ్లు, అప్పటి కూరగాయలు.. నిండునూరేళ్లు సంపూర్ణ ఆరోగ్యంగా బతికే బలాన్నిచ్చాయి. ఇప్పుడు మనం కూడా బియ్యం, పప్పులు, పండ్లు, కూరగాయలు తింటున్నా.. ఆ బలం ఎక్కడుంది? ఆ ఆరోగ్యం ఎక్కడుంది?! దీనికి కారణం.. పండే పంటల్లో రసాయనాలు మోతాదుకు మించి ఉండటమే. మరి పరిష్కారం.. తాతలు, ముత్తాతల కాలంలో చేపట్టిన సేంద్రియ సాగు విధానమే. రసాయన ఎరువులు ఏ మాత్రం ఉపయోగించని ఆ విధానం వైపు ప్రస్తుతం రైతులు మొగ్గుచూపుతున్నారు. ఇలాంటి పంటలకు పెట్టుబడి తక్కువగా ఉండటం, మార్కెట్‌లో మంచి రేటు కూడా లభిస్తుండటంతో ఉత్సాహం చూపుతున్నారు. యువ రైతులు ఎక్కువగా ఇలాంటి విధానంలోనే సాగు చేపట్టి.. మంచి లాభాలు గడిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా మంచి ప్రోత్సాహం లభిస్తోంది. వినియోగదారులు సైతం సేంద్రియ ఉత్పత్తులకే జై కొడుతున్నారు. ఆర్గానిక్ ఉత్పత్తులని తెలిస్తే చాలు.. నాలుగు పైసలు ఎక్కువ ఇచ్చయినా సరే కొనుగోలు చేస్తున్నారు.

మిగతా 4లో

పల్లె నిండా సంబురం



పచ్చని వరి పంటలు.. వెచ్చని భోగి మంటలు
రంగురంగుల ముంగిళ్లు.. ముద్దుగొలిపే గొబ్బిళ్లు
కొత్త బట్టలతో చిన్నోళ్ల కేరింత
పాత ముచ్చట్లతో పెద్దోళ్ల పులకింత
ఒక్కమాటలో ఊళ్ల నిండా సంబురమే!

పండుగ శోభతో పల్లెలన్నీ కళకళలాడుతున్నయి. బతుకుదెరువు కోసం పట్నంపోయినోళ్లంతా రెక్కలు కట్టుకొని పల్లె వాకిట్లో వాలిపోయినరు. హైదరాబాద్, వేరే రాష్ట్రాల నుంచే కాదు.. దూరదేశాలు పోయినోళ్లు కూడా వచ్చింర్రు. 'ఏం బిడ్డా.. మంచిగున్నవా?' 'తాతా.. పాణం ఎట్లుందే?' 'పెద్నాయిన.. ఎవుసం ఎట్లుందే?' అని ఒకళ్లనొకళ్లు ప్రేమతో మందలించుకుంటున్నరు. చిన్నాపెద్దా అంతా కలిసి పతంగులు, ఆట పాటలు, టోర్నమెంట్లు, ముగ్గుల పోటీలతో ఎంజాయ్ చేస్తున్నరు.

02




ప్లే

ఇవాళ రెండో వన్డే

ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌లో 0–1తో వెనుకబడిన కోహ్లీసేన అడిలైడ్ వేదికగా కీలక పోరుకు రెడీ అయింది.

11



బిజినెస్

ఫ్లిప్‌కార్ట్, అమెజాన్‌పై పోరాటం

ట్రిబ్యునల్‌కు వెళ్లనున్న చిన్న ఆన్‌లైన్ కంపెనీలు.. అందరినీ ఒకలా చూడటం లేదని ఆరోపణలు.

10

నా సర్కార్.. మీ రేటింగ్

'నమో యాప్'ద్వారా మోడీ సర్వే

- ప్రజల నుంచి నేరుగా అభిప్రాయ సేకరణ
- ప్రభుత్వ తీరు, మహాకూటమిపై ప్రశ్నలు
- లోక్‌సభ ఎన్నికల వేళ సరికొత్త వ్యూహం
- బీజేపీ అభ్యర్థుల ఎంపికలో కీలకం కానున్న సర్వే

" కేంద్ర ప్రభుత్వ పనితీరుపై మీ ఫీడ్‌బ్యాక్‌ను నేరుగా నాకే పంపండి. నమో యాప్‌లోని సర్వేకు ప్రతి ఒక్కరూ స్పందిస్తారని ఆశిస్తున్నాను. ప్రభుత్వం తీసుకోబోయే కీలక నిర్ణయాలకు మీ ఫీడ్‌బ్యాక్, రేటింగ్ ఎంతగానో తోడ్పడుతుంది.

– ట్విటర్, ఫేస్‌బుక్‌లో ప్రధాని మోడీ వీడియో సందేశం

03

మళ్లీ కన్నడ డ్రామా

ఎమ్మెల్యేల కొనుగోళ్లపై ఆరోపణలు, ప్రత్యారోపణలు

- సర్కార్‌ను పడగొట్టడానికి బీజేపీ కుట్ర చేస్తోందన్న కాంగ్రెస్
- అధికార పార్టీ ఆరోపణలను తిప్పికొట్టిన యడ్యూరప్ప
- సంకీర్ణ ప్రభుత్వానికి ముప్పేమీలేదన్న కుమారస్వామి

05

కన్నడనాట మళ్లీ రాజకీయ హైడ్రామా మొదలైంది. ఎమ్మెల్యేల కొనుగోళ్లకు సంబంధించి అధికార కాంగ్రెస్-జేడీఎస్ కూటమి, ప్రతిపక్ష బీజేపీ ఆరోపణలు, ప్రత్యారోపణలకు దిగాయి. బీజేపీ ఎమ్మెల్యేలు తమ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని కాంగ్రెస్ పార్టీ చెబుతుంటే.. 13 మంది కాంగ్రెస్-జేడీఎస్ శాసనసభ్యులు జంప్ చేయడాకి రెడీగా ఉన్నారని బీజేపీ అంటోంది. తాజా పరిణామాల నేపథ్యంలో బీజేపీ తమ పార్టీ ఎమ్మెల్యేలను హర్యానాలోని గురుగావ్ రిసార్ట్స్‌కు తరలించింది. అయితే కుమారస్వామి సర్కార్‌ను పడగొట్టడానికి బీజేపీ పక్కాగా ప్లాన్ చేసిందన్న కథనాలు జోరందుకున్నాయి.

నిమ్స్ టవర్ల డిజైన్లు రెడీ



250 కోట్లతో ప్రత్యేక టవర్లు

- త్వరలోనే శంకుస్థాపన
- ఓపీ, నెఫ్రాలజీ, యూరాలజీ విభాగాలకు ప్రత్యేక భవనాలు
- మదర్ అండ్ చైల్డ్ కేర్ ఆస్పత్రి ఏర్పాటుకు నిర్ణయం

02

వెన్‌కాబ్ (ఫారం గేట్ ధర)

హైదరాబాద్	వరంగల్	మహబూబ్‌నగర్
87.00	87.00	87.00
కరీంనగర్	**నిజామాబాద్**	**ఖమ్మం**
88.00	87.00	86.00

ప్రభాత వెలుగు
Follow: v6velugu
మంగళవారం | హైదరాబాద్
15.01.2019
www.v6velugu.com

ఏపీలో జోరుగా కోడిపందేలు

కృష్ణా జిల్లాలో పొట్టేలు పందేలు కూడా..

విజయవాడ, వెలుగు: సంక్రాంతి పండుగ సందర్భంగా ఏపీలోని కృష్ణా, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో కోడిపందేలు జోరుగా సాగాయి. కృష్ణా జిల్లా గుడివాడ, కైకలూరు నియోజకవర్గంలోని కైకలూరు, కలిదిండి, ముదినేపల్లి, మండపల్లిలో కోడి పందేలు జరిగాయి. కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ కోళ్లకు కత్తులు కట్టి బరుల్లోకి దింపారు. కృష్ణా జిల్లా బాపులపాడు మండలం అంపాపురంలో పొట్టేళ్ల పందేలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి 120కిపైగా పొట్టేళ్లు పోటీలో పాల్గొన్నాయి. కోడిపందేలు, పొట్టేళ్ల పోటీల్లో కోట్ల రూపాయలు చేతులు మారినట్లు తెలుస్తోంది.





జల్లికట్టులో ఏడుగురికి గాయాలు

చెన్నై: పొంగల్ వేడుకల్లో భాగంగా నిర్వహించే సంప్రదాయ క్రీడ జల్లికట్టుకు తమిళనాడులో భారీగా ఏర్పాట్లు చేశారు. పుదుకొట్టై జిల్లా తసంగుర్చిలో తొలి జల్లికట్టు పోటీలను తమిళనాడు మంత్రి విజయభాస్కర్ సోమవారం ప్రారంభించారు. 300 ఎద్దులను అదుపు చేయడానికి 400 మంది యువకులు ప్రయత్నించారు. ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జల్లికట్టు పోటీలను చూసేందుకు పలు ప్రాంతాల నుంచి జనం భారీగా తరలివచ్చారు.

చిత్తూరు జిల్లాలోనూ జల్లికట్టు

సంక్రాంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాలో కూడా జల్లికట్టు పోటీలు నిర్వహించారు. యువకులు ఉత్సాహంగా ఈ క్రీడలో పాల్గొన్నారు. తమిళనాడు సరిహద్దులోని పలు గ్రామాల్లో జలికట్టుకు భారీగా జనం తరలివచ్చారు.



పుదుకొట్టై జిల్లా తసంగుర్చిలో జల్లికట్టు పోటీలు



సోమవారం వరంగల్‌లో భోగి మంటల చుట్టూ తిరుగుతూ యువతుల ఆనందం



ఎప్పుడూ బిజీగా ఉండే హైటెక్ సిటీ ఫ్లై ఓవర్ ఇలా బోసిపోయింది

పల్లె నిండా సంబురం

ఊళ్లల్లో సంక్రాంతి సందడి | అనుబంధాలు, ఆత్మీయ పలకరింపులు | హైదరాబాద్, పొరుగు రాష్ట్రాల నుంచి సొంతూళ్లకు జనం | ఆట పాటలు, భోగి మంటలు, పిండి వంటలతో ఎంజాయ్

హైదరాబాద్, వెలుగు:

"ఓరి ఎంకటిగా ఎప్పుడొచ్చినవ్‌రా.. ఏడుంటున్నవ్.. ఏం కొలువుజేస్తున్నవ్.. చాన్నాళ్లకొచ్చినవ్ ఏం సంగతులు.. ఉజ్జోగం మంచిగుందా.. పైసల్ బానే ఎన్కేస్తున్నవారా.. మీ అయ్య కష్టపడి సద్వించినందుకు పైకొచ్చి పెద్ద పేరే తెచ్చుకున్నవ్. మంచిగ బతుకు కొడకా.. తొందరగ పప్పన్నం పెట్టియ్ వస్త.."

"ఏం పెద్నాయన బాగున్నావే. పోయిన సారొచ్చినప్పుడు బానే ఉంటివి.. మొత్తం ఇట్ల గుంజకపోయినవేందే.. పెద్దమ్మ బువ్వ సక్కగ పెడ్తలేదానే.. పాణం మంచిగ సూస్కో.. ఎవుసం ఎట్లుందే.. ఈ సారి పంట మంచిగొచ్చిందా.."

..ఇప్పుడు పల్లెల్లో ఎక్కడ చూసినా ఇలాంటి ఆప్యాయత, ఆత్మీయత, ప్రేమతో కూడిన పలకరింపులే కనిపిస్తున్నయి. సంక్రాంతి సంబురంతో ఊళ్లన్నీ మురిసిపోతున్నయి. బతుకుదెరువు కోసం పట్నాలకు పోయినోళ్లంతా వచ్చి పల్లె ఒడిలో వాలిపోయారు. చాన్నాళ్ల తర్వాత కలవడంతో ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుంటుకున్నారు. ఆటాపాటలతో చిన్నాపెద్దా సంతోషంగా గడుపుతున్నారు. ముగ్గులు, ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

పట్నం ఖాళీ.. పల్లె ఫుల్లు

సంక్రాంతి అనగానే హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు, భోగి మంటలు, పిండి వంటల ఘుమఘుమలు, ఇంటి ముందు రంగవల్లులు, పతంగుల ఆటలే గుర్తొస్తాయి. ఈ మధురమైన జ్ఞాపకాల కోసమే జనం ఎంత దూరంగా ఉన్నా పల్లెలకు వచ్చి చేరారు. హైదరాబాద్‌తోపాటు ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగాలు చేస్తున్నవారు కూడా సెలవులు పెట్టి వచ్చి పల్లె గాలిని ఆస్వాదిస్తున్నారు. కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాలకు చెందిన కొందరు కార్మికులు అరబ్ దేశాల నుంచి కూడా వచ్చారు. ఊరికి రానోళ్లంతా వీడియో కాల్స్ ద్వారా తమ కుటుంబీకులతో ముచ్చటిస్తున్నరు. జనమంతా ఊళ్లకు తరలివెళ్లడంతో హైదరాబాద్ ఖాళీ అయింది. ట్రాఫిక్ జామ్, వాహనాలతో నిండిపోయే రోడ్లన్నీ ఖాళీగా కన్పిస్తున్నాయి.

సందడే.. సందడి

ఊళ్లల్లో ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. క్రికెట్ టోర్నమెంట్లు, వాలీబాల్, కబడ్డీ, ముగ్గుల పోటీలు పెట్టి ప్రైజ్‌లు ఇస్తున్నారు. చిన్ననాటి క్లాస్‌మేట్లంతా పూర్వవిద్యార్థుల సమ్మేళనాలు చేసుకుంటున్నారు. తమ చిన్నప్పటి విషయాలను గుర్తుతెచ్చుకుంటున్నారు. భోగి మంటలు, ముగ్గులు, ఆటలు, పంట పొలాలు.. ఎటుచూసినా యూత్ సెల్ఫీల సందడే కన్పిస్తోంది.



మహబూబ్‌నగర్‌లో గంగిరెద్దు విన్యాసం

ఎన్నికలు మచ్చికలు

ఇప్పుడే పంచాయతీ ఎన్నికలు రావడంతో పోటీ చేసేవాళ్లంతా పట్నం నుంచి వచ్చినోళ్లను మచ్చిక చేసుకుంటున్నారు. ఎన్నడూ మందలియ్యనోళ్లను కూడా ఆప్యాయంగా, ప్రేమతో పలకరిస్తున్నారు. "అన్నా ఎన్నికల్ల నిల్సుంటున్న. ఓటు నాకే ఎయ్యాలె. ఓట్లప్పుడు తప్పక రావాలె. బస్ కిరాయిలు నేనే పెట్టుకుంటా" అని బతిమాలుతున్నారు. రహస్య మంతనాలు, పార్టీలు కూడా జోరుగా నడుస్తున్నాయి.

బెంగళూరు నుంచొచ్చిన

మాది నల్లగొండ జిల్లా యడవల్లి. బెంగళూరులోని ఓ ప్రైవేట్ కంపెనీల జాబ్ చేస్తున్న. సంక్రాంతి పండుగ అంటే ఎంతో ఇష్టం. మా ఊరంటే ఇంకా ఇష్టం. ఇక్కడి చెరువు, పంటపొలాలు ఎంతో బాగుంటాయి. ఊరంతా ప్రజలతో నిండుగా కళకళలాడుతోంది. దోస్తులతో ఎంజాయ్ చేస్తున్నం.

- చెరిపెల్లి వెంకటేశ్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, బెంగళూరు

అందరు కలుస్తున్నరు

నేను హైదరాబాద్‌లో ఉంటా. పండుగకు ఫ్యామిలీతో కలిసి సొంతూరు పోయిన. చిన్నప్పటి దోస్తులందరం జమైనమ్. బాగా ఎంజాయ్ చేస్తున్నం. సిటీలో కాలుష్యం, ట్రాఫిక్ మర్చిపోయి ప్రశాంతంగా ఉన్నం.

- స్నేహ మాధురి, హైదరాబాద్



తగ్గుతున్న చలి తీవ్రత

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలో చలి తీవ్రత మరింత తగ్గుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు చెప్పారు. మంగళవారం, బుధవారం పలుచోట్ల పొగమంచు కురుస్తుందన్నారు. ఆదిలాబాద్, భద్రాచలం, హకీంపేట, హన్మకొండ, హైదరాబాద్, నిజామాబాద్, రామగుండం ప్రాంతాల్లో ఉదయం, రాత్రి పొగమంచు తీవ్రత ఉంటుందని చెప్పారు. తూర్పు, ఈశాన్య దిశల నుంచి గాలులు వీస్తున్నాయన్నారు. సోమవారం అత్యల్పంగా మెదక్, హకీంపేటలో 15 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఆదిలాబాద్, హైదరాబాద్, రామగుండంలో 16 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాల్లో 32 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

'6,044 అదనపు బస్సులు నడిపాం'

హైదరాబాద్, వెలుగు: సంక్రాంతి రద్దీ దృష్ట్యా ఈ నెల 10 నుంచి 14 వరకు 3,500 రోజువారీ బస్సులకు అదనంగా 6,044 బస్సులు నడిపామని ఆర్టీసీ రంగారెడ్డి రీజినల్ మేనేజర్ యాదగిరి తెలిపారు. ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడులకూ బస్సులు తిప్పినట్లు సోమవారం చెప్పారు. ఎంజీబీఎస్ బస్‌స్టేషన్, ఓల్డ్ సీబీఎస్, జేబీఎస్, కాచిగూడ, ఉప్పల్ క్రాస్‌రోడ్, ఎల్బీనగర్, లింగంపల్లి, చందానగర్, ఈసీఐఎల్, జీడిమెట్ల, కేపీహెచ్‌బీ, దిల్‌సుఖ్‌నగర్, శివారు ప్రాంతాల నుంచి బస్సులు నడిపామని చెప్పారు.

17న బీజేవైఎం లైవ్ ఇంటరాక్షన్

హైదరాబాద్, వెలుగు: భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) ఆధ్వర్యంలో ఈనెల 17న హైదరాబాద్ లోని చార్మినార్ దగ్గర లైవ్ ఇంటరాక్షన్ కార్యక్రమం జరగనుంది. దేశవ్యాప్తంగా 18 ప్రాంతాల్లోని శ్రేణులతో బీజేవైఎం జాతీయ అధ్యక్షురాలు పూనం మహాజన్ ముఖాముఖి మాట్లాడనున్నారు.

సంస్కృతికి ప్రతీక సంక్రాంతి

తెలంగాణ, ఏపీ ప్రజలకు గవర్నర్ పండుగ శుభాకాంక్షలు



హైదరాబాద్, వెలుగు:

సంక్రాంతి పండుగ సంస్కృతికి ప్రతీక అని గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సోమవారం ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాలు ఒకరినొకరు గౌరవించుకునే పండుగ సంక్రాంతి అని పేర్కొన్నారు. అందరికీ ఉన్నతమైన, స్ఫూర్తివంతమైన ఆలోచనలు, ప్రేమ, సోదరభావం, సాన్నిహిత్యాన్ని ఈ పండుగ తీసుకురావాలని ఆకాంక్షించారు.

గవర్నర్‌ను కలిసిన కేంద్ర మంత్రి జశ్వంత్

కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జశ్వంత్ సిన్హ్ బాబుర్ సోమవారం గవర్నర్ నరసింహన్‌ను కలిశారు. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ గేమ్స్ ప్రారంభోత్సవానికి వచ్చిన ఆయన రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.

హోం మంత్రి శుభాకాంక్షలు

తెలుగు ప్రజలకు హోం మంత్రి మహమూద్ అలీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఆకాశంలో పతంగులు ఎంత ఎత్తులో ఎగురుతున్నాయో ఈ పండుగ కూడా ప్రజల్లో అంత ఎత్తున సంతోషాన్ని తీసుకురావాలని ఆకాంక్షించారు. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎంపీ కవిత, మాజీ మంత్రి టి. హరీశ్‌రావు రాష్ట్ర ప్రజలకు భోగి, సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



సోమవారం శబరిమలలో మకరజ్యోతిని దర్శించుకుంటున్న అయ్యప్ప భక్తులు

శబరిమలలో మకరజ్యోతి దర్శనం

పోటెత్తిన భక్తులు

శబరిమల : శరణుఘోషతో శబరిగిరులు మార్మోగాయి. అయ్యప్ప నామస్మరణతో పంబా తీరం పులకించిపోయింది. కేరళలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శబరిమలలో లక్షలాదిమంది అయ్యప్పలు సోమవారం మకరజ్యోతిని దర్శించుకున్నారు. జ్యోతి రూపంలో అయ్యప్ప స్వామి దర్శనం ఇవ్వడంతో భక్తులు పరవశించారు. పంబా నది, సన్నిధానం, హిల్ టాప్, టోల్ ప్లాజా దగ్గర మకరజ్యోతి దర్శనం కోసం ట్రావెన్ కోర్ దేవస్థానం ఏర్పాట్లు చేసింది. స్వామి వారి తిరువాభరణాలను సాయంత్రం ఆరు గంటలకు సన్నిధానం తరలించారు. ఆరున్నరకు దీపారాధనతో తిరువాభరణ ఘట్టం పూర్తయింది. తర్వాత పొన్నాంబలమేడు నుంచి భక్తులకు అయ్యప్ప దర్శనం ఇచ్చారు.

రేపు శ్రీవారి పార్వేట ఉత్సవం

ఆర్జిత సేవలు, అంగప్రదక్షిణ రద్దు

తిరుమల, వెలుగు: తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 16న గోదాపరిణయం, శ్రీవారి పార్వేట ఉత్సవాలు జరగనున్నాయి. గోదా పరిణయోత్సవం సందర్భంగా ఉదయం 9 గంటలకు ఆండాళ్ అమ్మవారి మాలలను పెద్ద జీయర్ స్వామి మఠం నుంచి ఆలయ మాడ వీధుల్లో ఊరేగింపుగా తీసుకొచ్చి శ్రీవారికి సమర్పిస్తారు. మధ్యాహ్నం ఒంటిగంటకు మలయప్పస్వామి, శ్రీకృష్ణస్వామిని పార్వేట మండపానికి తీసుకొస్తారు. అక్కడ ఆస్థానం, పార్వేట కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాల కారణంగా 16న శ్రీవారి ఆలయంలో తోమాలసేవ, అర్చన, సహస్ర కళశాభిషేకం, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, బ్రహ్మోత్సవం, వసంతోత్సవం, సహస్రదీపాలంకార సేవలు, తెల్లవారుజామున భక్తులకు కల్పించే అంగప్రదక్షిణను టీటీడీ రద్దు చేసింది.

తిరుమలలో భోగి సంబరాలు

తిరుమలలో సోమవారం భోగి సంబరాలు ఘనంగా జరిగాయి. శ్రీవారి ఆలయం ముందు అర్చకులు, అధికారులు, భక్తులు భోగి మంటలు వేశారు. అఖిలాండం, బాలాజీనగర్ ప్రాంతాల్లోనూ భోగి మంటలు వేసి భక్తులు సంబరాలు జరుపుకున్నారు.

సజ్జన్ పిటిషన్‌పై సీబీఐకి 'సుప్రీం' నోటీసులు

న్యూఢిల్లీ : 1984నాటి సిక్కు వ్యతిరేక అల్లర్ల కు సంబంధించి జీవితఖైదు పడ్డ కాంగ్రెస్ మాజీ నేత సజ్జన్ కుమార్ కేసులో సుప్రీం కోర్టు సీబీఐకి నోటీసులు ఇచ్చింది. ఈ కేసులో తనను దోషిగా నిర్ధారిస్తూ గత డిసెంబర్ 17న ఢిల్లీ హై కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సజ్జన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్, జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ ఎస్ కే కౌల్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది.



నిమ్స్‌లో టవర్ల డిజైన్లు రెడీ

- రూ.-250 కోట్లతో ప్రత్యేక టవర్లు.. త్వరలోనే శంకుస్థాపన
- ఓపీ, నెఫ్రాలజీ, యూరాలజీ విభాగాలకు ప్రత్యేక భవనాలు
- మదర్ అండ్ చైల్డ్ కేర్ ఆస్పత్రి ఏర్పాటుకు నిర్ణయం

హైదరాబాద్, వెలుగు:

రాష్ట్ర రాజధానిలోని ప్రతిష్టాత్మకమైన నిమ్స్ ఆస్పత్రిలో ప్రత్యేక టవర్ల నిర్మాణానికి రంగం సిద్ధమైంది. దాదాపు రూ. 250 కోట్ల వ్యయ అంచనాతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ప్లానింగ్, డిజైనింగ్‌ను నిమ్స్ అధికారులు పూర్తి చేశారు. వీలైనంత త్వరలో శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. రెండు నెలల్లోగా టవర్ల నిర్మాణానికి పునాది రాయి పడనుంది. ముఖ్యంగా ఔట్ పేషెంట్ విభాగం, నెఫ్రాలజీ, యూరాలజీతో పాటు లివర్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ కోసం ప్రత్యేక వసతులు కల్పించనున్నారు. అన్ని ప్రత్యేక విభాగాలకు సంబంధించిన ఓపీ (ఔట్ పేషెంట్) నమోదు అంతా ఒకే చోట ఉండేలా ఇంటిగ్రేటేడ్ విధానాన్ని తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఏయే బ్లాక్ లలో ఏ విభాగం ఉండాలన్న దానిపై కసరత్తు పూర్తైంది. చెన్నైలో మద్రాస్ మెడికల్ కాలేజీలో అనుసరిస్తున్న విధానం తరహాలో కొన్ని విభాగాలకు ప్రత్యేకంగా ఒక్కో టవర్‌ను ఏర్పాటు చేయనున్నారు.

ప్రత్యేక భవనాలతో..

కొన్ని విభాగాలకు ప్రత్యేకంగా ఒక్కో టవర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ముఖ్యంగా ఔట్ పేషెంట్ విభాగం కోసం పూర్తిగా ఒక భవనం, నెఫ్రాలజీ, యూరాలజీ విభాగాల కోసం ప్రత్యేక భవనాలు సిద్ధం చేయనున్నారు. కిడ్నీ, లివర్ సమస్యలతో వచ్చే వారి సంఖ్య భారీగా పెరుగుతుండటం, భవిష్యత్ అవసరాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇక ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరుగుతుండటంతో ప్రత్యేకంగా ఓ భవనంలో మదర్ అండ్ చైల్డ్ కేర్ విభాగాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే పీజీ హాస్టల్, క్యాంటీన్ కూడా సిద్ధం చేయనున్నారు.

ప్రత్యేక ఓపీతో ప్రయోజనం

నిమ్స్‌లో టవర్లకు ప్రతిపాదనలు, డిజైన్లు పూర్తయ్యాయి. త్వరగా నిర్మాణమైతే రోగులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ముఖ్యంగా ఔట్‌పేషెంట్స్ విభాగంతో పాటు నెఫ్రాలజీ, యూరాలజీ, మదర్ అండ్ చైల్డ్ ఆస్పత్రి కోసం ప్రత్యేక భవనాలు ఉండటం అవసరం. గాంధీ ఆస్పత్రిలో ఓపీ కోసం ప్రత్యేక భవనం ఉండటం వల్ల రోగులకు ప్రయోజనకరంగా ఉంది. నిమ్స్‌లోనూ ఆ తరహా ఏర్పాట్లు చేస్తున్నాం.

– డా. మనోహర్ రెడ్డి, నిమ్స్ డైరెక్టర్

నిమ్స్‌లో ప్రత్యేక టవర్లు ఏర్పాటైతే ఓపీ వద్ద రోగుల కష్టాలు తీరనున్నాయి. రోజు మూడు వేల మందికిపైగా నిమ్స్ ఓపీ విభాగానికి వస్తారు. గంటల తరబడి ఓపీ నమోదుకోసం ఎదురుచూడాల్సి వస్తోంది.

ఆర్డీలో పనిచేస్తున్నా పోటీకి అనర్హులే

కలెక్టర్లకు తెలిపిన ఎన్నికల సంఘం

హైదరాబాద్, వెలుగు: రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖలో పనిచేసే మొబిలైజర్స్, ఫెసిలిటేటర్స్‌తో పాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా గౌరవ వేతనం పొందే వ్యక్తులు పంచాయతీ ఎన్నికల్లో పోటీకి అనర్హులని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టంచేసింది. ఈ మేరకు సోమవారం కలెక్టర్లు, జిల్లా ఎన్నికల యంత్రాంగానికి సర్క్యులర్ జారీ చేసింది. తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ సేన జనరల్ సెక్రెటరీ కె. రామకృష్ణ లేఖపై కలెక్టర్లకు ఎన్నికల సంఘం స్పష్టత ఇచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న వారు కూడా పోటీకి అనర్హులని సర్క్యులర్‌లో పేర్కొంది.

జనరల్ సీట్లలో బీసీలను గెలిపించాలి: జాజుల

హైదరాబాద్, వెలుగు: పంచాయతీ ఎన్నికల్లో జనరల్‌కు కేటాయించిన స్థానాల్లో బీసీ అభ్యర్థులను సర్పంచులుగా గెలిపించాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. సోమవారం ఆయన బీసీలకు బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో బీసీ జనాభా 56 శాతం ఉండగా, ప్రభుత్వం పంచాయతీ రిజర్వేషన్లను 34శాతం నుంచి 23శాతానికి కుదించిందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయ అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు బీసీ అభ్యర్థులకు పార్టీలకతీతంగా ఓటు వేయాలని కోరారు.



నా సర్కార్.. మీ రేటింగ్

'నమో యాప్' ద్వారా ప్రధాని మోడీ సర్వే

- నేరుగా అభిప్రాయసేకరణ
- బీజేపీ అభ్యర్థుల ఎంపికలో కీలకం కానున్న సర్వే

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ సరికొత్త ఆలోచనకు తెరతీశారు. ప్రజల నుంచి నేరుగా తనకే ఫీడ్‌బ్యాక్ అందేలా 'నమో యాప్' ద్వారా సర్వేను ప్రారంభించారు. నాలుగున్నరేళ్ల ప్రభుత్వ పనితీరుతోపాటు తాజా రాజకీయ పరిణామాలపై జనం నుంచి అభిప్రాయాలు తెలుసుకునేందుకు సిద్ధమయ్యారు. 'నమో యాప్'లో సర్వేను ప్రారంభిస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. 'కేంద్ర ప్రభుత్వ పనితీరుపై మీ ఫీడ్‌బ్యాక్‌ను నేరుగా నాకే పంపండి. నమో యాప్‌లోని సర్వేకు ప్రతి ఒక్కరు స్పందిస్తారని ఆశిస్తున్నాను. ప్రభుత్వం తీసుకోబోయే కీలక నిర్ణయాలకు మీ ఫీడ్‌బ్యాక్, రేటింగ్ ఎంతగానో తోడ్పడుతుంది' అంటూ ఓ వీడియో సందేశాన్ని ప్రధాని మోడీ ట్విటర్, ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. 'మహాకూటమి గురించి మీరేమనుకుంటున్నారు? మీ ప్రాంతాల్లో మహాకూటమి విజయవంతం అయ్యే అవకాశముందా?' అనే ప్రశ్న కూడా సర్వేలో ఉండటం గమనార్హం. దీన్నిబట్టి చూస్తే నాలుగున్నరేళ్ల తన ప్రభుత్వ పనితీరుతోపాటు వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఎలా ముందుకు వెళ్లాలన్న దానికి సర్వే ఉపయోగపడుతుందని బీజేపీ నేతలు అంటున్నారు. పార్టీ అభ్యర్థుల ఎంపికలోనూ ఇది కీలకంగా మారుతుందని, పనిచేయని నేతలకు చెక్‌పెట్టేందుకు తోడ్పడుతుందని ఆశిస్తున్నారు. ఆయుష్మాన్ భారత్, రైతులు, ఉద్యోగ కల్పన, విద్య, శాంతిభద్రతలు, ధరలు, అవినీతి రహిత పాలన, స్వచ్ఛ్ భారత్, ఆర్థిక వ్యవస్థ, భద్రత వంటి పలు అంశాలను కూడా నమో యాప్ సర్వేలో పొందుపరిచారు. కేంద్రంలో ఎన్డీయే సర్కార్ ఏర్పడి నాలుగేళ్లయిన సందర్భంగా గత ఏడాది మేలో కూడా మోడీ ఇలాంటి సర్వేను 'నమో యాప్'లో ప్రారంభించారు. అయితే.. తాజా సర్వే మాత్రం లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా బీజేపీకి ఎంతగానో తోడ్పాటునందిస్తుందని ఆ పార్టీ వర్గాలు బలంగా నమ్ముతున్నాయి.



పతంగి ఎగరేసిన బీజేపీ బాస్

రోజూ రాజకీయాలతో బిజీబిజీగా ఉండే బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా సంక్రాంతి వేడుకల్లో సందడి చేశారు. సోమవారం అహ్మదాబాద్‌లో డాబాపైన గాలిపటం ఎగరేశారు.

అసెంబ్లీ సమావేశాలపై సమీక్ష

హైదరాబాద్, వెలుగు: ఈనెల 17 నుంచి 20వ తేదీ వరకు శాసనసభ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో భద్రతపై శాసన మండలి చైర్మన్ కె. స్వామిగౌడ్ సమీక్ష జరిపారు. అసెంబ్లీ కార్యదర్శి వి. నరసింహాచార్యులు, డీజీపీ మహేందర్‌రెడ్డి, హైదరా



బాద్ సీపీ అంజనీకుమార్‌లతో సోమవారం సమావేశమై ఏర్పాట్లపై ఆరా తీశారు. అనంతరం అంజనీకుమార్ మీడియాతో మాట్లాడతూ.. అసెంబ్లీ, శాసన మండలి భద్రతపై అన్ని శాఖల అధికారులకు స్వామిగౌడ్ సూచనలు చేశారన్నారు.


769 మంది సర్పంచులు ఏకగ్రీవం

తొలిదశ పంచాయతీలు, సర్పంచ్ ఏకగ్రీవాలు, నామినేషన్ల తీరు..

జిల్లా	పంచాయతీలు	ఏకగ్రీవం	పోలింగ్ జరిగేవి	పోటీలో ఉన్న అభ్యర్థులు
ఆదిలాబాద్	153	50	103	318
ఆసిఫాబాద్	113	18	95	294
మంచిర్యాల	111	8	101	363
నిర్మల్	134	57	77	284
జగిత్యాల	131	10	121	483
కరీంనగర్	97	4	93	464
పెద్దపల్లి	106	4	102	475
రాజన్న సిరిసిల్ల	80	13	67	279
భద్రాద్రి కొత్తగూడెం	174	22	150	450
ఖమ్మం	188	21	167	446
గద్వాల	106	30	76	203
మహబూబ్‌నగర్	249	44	205	593
నాగర్‌కర్నూల్	160	37	118	296
వనపర్తి	80	18	62	205
మెదక్	154	32	122	319
సంగారెడ్డి	258	23	235	764
సిద్దిపేట	186	21	165	697
నల్లగొండ	304	52	252	666
సూర్యాపేట	161	16	145	426
యాదాద్రి భువనగిరి	124	22	102	298
కామారెడ్డి	164	31	133	688
నిజామాబాద్	177	36	141	545
మేడ్చల్ మల్కాజ్‌గిరి	33	4	29	111
రంగారెడ్డి	179	20	159	471
వికారాబాద్	249	34	215	581
జనగామ	100	18	82	285
భూపాలపల్లి	158	33	125	407
మహబూబాబాద్	156	36	120	387
వరంగల్ రూరల్	145	45	100	274
వరంగల్ అర్బన్	49	10	39	130
మొత్తం	4,479	769	3,701	12,202

హైదరాబాద్, వెలుగు: తొలిదశ ఎన్నికలు జరుగుతున్న 4, 479 గ్రామ పంచాయతీల్లో 769 మంది సర్పంచులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తొమ్మిది గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు సరిగా నామినేషన్లు దాఖలు కాకపోవడంతో వాటి ఎన్నికలు వాయిదా వేశారు. ఇందులో నాగర్‌కర్నూల్‌లో 5 , భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాలలో 2 చొప్పున పంచాయతీలు ఉన్నాయి. దీంతో 3,701 సర్పంచ్ పదవులకు పోలింగ్ జరగనుంది. ఇక మొత్తంగా 39,822 వార్డులకుగాను 10,654 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. వీటితోపాటు 192 వార్డులకు నామినేషన్లు సరిగా రాలేదు. మిగతా 28,976 వార్డుల్లో 70,094 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఇక మొదటి దశ ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో ఇప్పటివరకు 30 ఎన్నికల కేసులు నమోదయ్యాయి.


- 10,654 మంది వార్డు సభ్యులు కూడా..
- రెండోదశ సర్పంచ్ పదవులకు 25,419, వార్డు మెంబర్ పదవులకు 91,458 నామినేషన్లు



రెండో విడత పరిశీలన దశలో..

రెండోదశలో ఎన్నికలు జరుగుతున్న 4,135 పంచాయతీల్లో 25,419 సర్పంచ్ నామినేషన్లు, 36,602 వార్డుల్లో 91,458 నామినేషన్లు దాఖలయ్యాయి. అత్యధికంగా నల్లగొండ జిల్లాలోని 276 పంచాయతీలకు 2,298 సర్పంచ్ నామినేషన్లు, మహబూబ్‌నగర్ జిల్లాలోని 243 పంచాయతీల్లో 2,068 సర్పంచ్ నామినేషన్లు వచ్చాయి. అతి తక్కువగా వరంగల్ అర్బన్ జిల్లాలో 22 పంచాయతీలకు 208 సర్పంచ్ నామినేషన్లు, మేడ్చల్ జిల్లాలో 28 పంచాయతీలకు 214 సర్పంచ్ నామినేషన్లు అందాయి.

నాకే చాన్స్.. నేనే మంత్రి!



- కేబినెట్ బెర్త్‌లపై ఎవరి ధీమా వారిదే
- తనను అందుబాటులో ఉండాలన్నారని సన్నిహితులతో చెప్పిన ఓ ఎమ్మెల్యే
- 18వ తేదీనే తన ప్రమాణం అంటూ మరొకరి ఆశ
- అధినేత మదిలో ఏముందో తెలియక ముఖ్య నేతల మల్లగుల్లాలు
- ఇంతకీ కేబినెట్ విస్తరణ ఎప్పుడంటూ అధికార పార్టీలోనే చర్చ

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలో మంత్రివర్గం విస్తరణపై అధికార పార్టీ నేతలు ఆశనిరాశల్లో ఊగిసలాడుతున్నారు. 'నాకే అవకాశం వస్తుంది, నేను మంత్రిని అవడం ఖాయం'అంటూ కొందరు నేతలు భరోసాగా ఉండగా.. మరికొందరు మాత్రం అధినేత మదిలో ఏముందో తెలియడం లేదంటున్నారు. కేబినెట్ విస్తరణ ఎప్పుడు చేపడతారా అని ఆశగా చూస్తున్నారు. కేబినెట్‌లో ఎంత మందికి అవకాశం వస్తుంది, ఎవరెవరికి చోటు దక్కుతుంది, అవకాశం వస్తే ఏ శాఖ వస్తుందనే అంశాలపై టీఆర్ఎస్‌లో విస్తృతంగా చర్చలు జరుగుతున్నాయి.

ఎవరికి వారే..

- రెండోసారి శాసనసభకు ఎన్నికైన దక్షిణ తెలంగాణ ఎమ్మెల్యే ఒకరు తనకు మంత్రి పదవి ఖాయమని సన్నిహితులతో చెబుతున్నారు. అదే జిల్లాకు చెందిన మరో సీనియర్ నేత సైతం కేబినెట్ స్థాయి పదవి వస్తుందని చెప్పుకొంటున్నట్టు తెలిసింది. ఈ మేరకు సీఎం ఆయనకు హామీ ఇచ్చినట్టుగా అనుచరులు స్థానికంగా ప్రచారం చేస్తున్నారు.
- ఈనెల 18న కేబినెట్ విస్తరణ ఉంటుందని, తనను అందుబాటులో ఉండుమన్నారని మాజీ మంత్రి ఒకరు తన సహచరులకు చెప్పుకుంటున్నట్టు తెలిసింది.
- 'సార్ మనసులో ఏముందో ఎవరికి తెలుస్తుంది, పేపర్లల్లో ఏదేదో రాస్తున్నారు. అది మాత్రం నిజం కావాలని ఏముంది'అని కీలక శాఖ బాధ్యతలు చూసిన మాజీ మంత్రి ఒకరు పేర్కొన్నారు. కేబినెట్ విస్తరణ తేదీపైనా ఎవరికి వారే ఏదేదో చెప్తున్నారన్నారు. సార్ ఏదంటే అదేనని, ఆయన ఏ పదవి ఇచ్చినా తీసుకోక తప్పదు కదాని వ్యాఖ్యానించారు.
- మినీ కేబినెట్‌లో తాను ఉండకపోవచ్చని, లోక్‌సభ ఎన్నికల తర్వాతే అవకాశం వస్తుందని ఉత్తర తెలంగాణకు చెందిన ఓ నేత తన కార్యకర్తలకు చెప్పుకొన్నారు. సీఎంతో సన్నిహితంగా ఉండే ఆయన.. తనకు మంత్రి పదవి కచ్చితంగా వస్తుందన్న నమ్మకం ఉందంటున్నారు.
- ముఖ్యమంత్రి కుటుంబానికి చెందిన కీలక నేత ప్రజాప్రతినిధిగా ఉన్న జిల్లాలో ఒకే సామాజిక వర్గానికి చెందిన ముగ్గురు మంత్రి పదవి ఆశిస్తున్నారు. వారిలో ఇద్దరికి పదవులు ఖాయమైనట్టు ప్రచారం జరుగుతోంది. రేసులో తానూ ఉన్నానని చెప్పుకుంటున్న మరో ఎమ్మెల్యే మంత్రి పదవి కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నారు.
- గ్రేటర్ హైదరాబాద్ నుంచీ ఆశావహుల సంఖ్య భారీగానే ఉంది. గత కేబినెట్‌లో గ్రేటర్ నుంచి నలుగురికి అవకాశం దక్కింది. ఈసారి ఇప్పటికే మహమూద్ అలీ ప్రమాణ స్వీకారం చేశారు. ఓ మాజీ మంత్రి తాను కేబినెట్‌లో ఉండితీరుతానని ధీమాగా చెప్తుండగా, మరో బెర్త్ కోసం ఒకే సామాజికవర్గానికి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు పోటీ పడుతున్నారు.

విస్తరణ ఎప్పుడో?

మంత్రివర్గ విస్తరణ ఎప్పుడుంటుందన్న విషయంలో అధికార పార్టీ నేతల్లో స్పష్టత లేదు. 18న కేబినెట్ విస్తరణ ఉంటుందని కొందరు అంటుండగా, సీఎం యాగం తర్వాతే ఉంటుందని మరి కొందరు చెబుతున్నారు. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం కేబినెట్ విస్తరణ తేదీపై స్పష్టత ఇవ్వలేదు. ఇటీవల మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన ఆయన 15 రోజుల తర్వాత ఉండొచ్చని మాత్రమే అన్నారు. కేసీఆర్ ఎవరికీ కేబినెట్ బెర్త్‌లపై హామీ ఇవ్వలేదని నిత్యం ప్రగతిభవన్‌తో టచ్‌లో ఉండే ఓ కీలక నేత చెప్పారు. మీడియాలో వస్తున్న వార్తలన్నీ ఊహించుకొని రాస్తున్నవేనన్నారు. మొత్తంగా అధికార పార్టీకి చెందిన ఏ ఇద్దరు నేతలు కలుసుకున్నా కేబినెట్ విస్తరణపైనే చర్చలు నడుస్తున్నాయి.



పండుగ రైళ్లన్నీ ఆంధ్రాకేనా?

- రాష్ట్రంపై దక్షిణ మధ్య రైల్వే వివక్ష
- తిరుగు ప్రయాణంలోనైనా దయ చూపేనా?

వరంగల్, వెలుగు: పండుగైనా.. పబ్బమైన దక్షిణ మధ్య రైల్వే దృష్టంతా ఆంధ్రప్రదేశ్ మీదే ఉంటున్నది. ప్రత్యేక రైళ్లన్నీ అటు వైపే పరుగులు పెడుతున్నాయి. తెలంగాణ ముఖం చూడటం లేదు. దీంతో ఇక్కడి ప్రజలు కిక్కిరిసిన రైళ్లలో ఒంటికాలుపై నిల్చుని ఊళ్లకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఉపాధికి ప్రధాన వనరుగా ఉన్న హైదరాబాద్‌కు అన్ని ప్రాంతాల ప్రజలు వెళ్తుంటారు. ఇలా వెళ్లిన వారు పండుగ వేళల్లో సొంతూళ్లకు బయలుదేరుతారు. బస్సులు, ప్రైవేటు వాహనాల్లో చార్జీలు ఎక్కువగా ఉండటంతో తక్కువ ఖర్చు కలిగిన రైళ్లనే జనం ఆశ్రయిస్తుంటారు. అయితే.. ఇక్కడి ప్రజల అవసరాలను గుర్తించడంలో మాత్రం రైల్వే శాఖ నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తోందని కొన్నాళ్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. దసరా, దీపావళి, సంక్రాంతి.. ఇలా పండుగ ఏదైనా సరే రైల్వే శాఖ ప్రకటించే ప్రత్యేక రైళ్లన్నీ హైదరాబాద్ టు ఆంధ్రప్రదేశ్ అన్నట్టుగా ఉంటున్నాయి.

ఈసారీ అదే తీరు

తక్కువ చార్జ్ వసూలు చేసే 31 స్పెషల్ జన్ సాధారణ్ రైళ్లను సంక్రాంతి కోసం దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఇవి జనవరి 11 నుంచి 20 వరకు నడుస్తాయి. సికింద్రాబాద్ నుంచి విజయవాడ, సికింద్రాబాద్ నుంచి కాకినాడ, సికింద్రాబాద్ నుంచి తిరుపతి, విజయవాడ నుంచి విజయనగరం మధ్యనే ఈ రైళ్లన్నీ తిరుగుతున్నాయి. ఇవి నల్లగొండ, మిర్యాలగూడ వంటి కొన్ని స్టాపుల్లో ఆగుతున్నప్పటికీ ఇక్కడివారికి పెద్దగా ప్రయోజనం ఉండటం లేదు. కేవలం ఆంధ్రాకు వెళ్లే రూట్లలోనే ఇవి నడుస్తున్నాయి తప్ప తెలంగాణలోని నిజామాబాద్, కాగజ్‌నగర్, వరంగల్, భద్రాచలం లాంటి ప్రాంతాలకు స్పెషల్ రైళ్ల ముచ్చటే లేదు.

తిరుగు ప్రయాణంలోనైనా..?

ప్రతి పండుగకు తెలంగాణలోని వివిధ జిల్లాలకు ప్రయాణించేవారి రద్దీ భారీగా ఉంటుంది. ముఖ్యంగా సికింద్రాబాద్ నుంచి వరంగల్, కాజీపేట నుంచి డోర్నకల్, మణుగూరు నుంచి కాజీపేట, కాగజ్‌నగర్ నుంచి కాజీపేట, కాచిగూడ నుంచి మహబూబ్‌నగర్, నిజామాబాద్ నుంచి సికింద్రాబాద్, కాగజ్‌నగర్ నుంచి సికింద్రాబాద్ వంటి రూట్లు కిక్కిరిసిపోతుంటాయి. ఈ రూట్లలో పండుగ వేళ ఒక్క స్పెషల్ రైలు కూడా తిరగడం లేదు. ఉన్న రైళ్లలోనే ప్రయాణికులు పిల్లాపాపలతో అతికష్టంగా ప్రయాణించాల్సి వస్తోంది. గోల్కొండ, శాతవాహన, కాగజ్‌నగర్ ఇంటర్ సిటీ రైళ్లలో ఒంటి కాలిపై నిలబడి, డోర్ల దగ్గర వేలాడుతూ సొంతూళ్లకు చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కనీసం ఈ సారి తిరుగుప్రయాణంలోనైనా తమ కష్టాలు పట్టించుకోవాలని ఇక్కడి ప్రయాణికులు దక్షిణ మధ్య రైల్వేను కోరుతున్నారు.

ఆర్గానిక్‌తో మస్తు బర్కత్

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక.. సేంద్రియ సాగుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. 50 ఎకరాల చొప్పున ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం మొత్తం 690 క్లస్టర్లు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 34,500 ఎకరాల్లో సేంద్రియ సాగు కొనసాగుతోంది. ఈ విధానంపై ఆసక్తి చూపే రైతులకు వ్యవసాయ శాఖ ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. గ్రూపులుగా రైతులను ఏర్పాటు చేసుకొని.. వారికి సాగు విధానాలపై అవగాహన కల్పిస్తోంది. పైగా బోగస్ ఆర్గానిక్ ఉత్పత్తులకు చెక్ పెట్టేందుకు గట్టి చర్యలు తీసుకుంది. 2018 ఆగస్టు నుంచి సేంద్రియ ధ్రువీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. సేంద్రియ వ్యవసాయం చేసినా పంటను విక్రయించడానికి మార్కెట్‌లో అనుమానాలు, ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో 'ఇది ఆర్గానిక్ ఉత్పత్తి' అని సర్టిఫికెట్లు జారీ చేస్తోంది. రైతు సేంద్రియ వ్యవసాయం చేస్తున్నాడా లేదా అనేది వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనలు జరిపి.. వివిధ రకాల పరీక్షలు నిర్వహిస్తారు. సేంద్రియ సాగే అని నిర్ధారణకు వచ్చాక సర్టిఫికెట్ జారీ చేస్తారు. సర్టిఫికేషన్ కోసం రైతులు నామమాత్రం ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. ఈ సర్టిఫికెట్‌తో దేశంలో ఎక్కడైనా సేంద్రియ ఉత్పత్తులను రైతులు ఈజీగా అమ్ముకోవచ్చని, వినియోగదారులకు నమ్మకం ఏర్పడుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంటున్నారు. సాగును మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తోంది. ప్రోత్సాహకాలు, రాయితీలు అందించాలని ఆలోచిస్తోంది.

సర్టిఫికేషన్ ఇలా..

సేంద్రియ వ్యవసాయం ధ్రువీకరణకు రైతు ముందుగా రాష్ట్ర సేంద్రియ ధ్రువీకరణ అథారిటీకి దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకోసం సంస్థ పేర్కొన్న విధంగా ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. పండించే పంట, భూమి తదితర పూర్తి వివరాలను దరఖాస్తులో పొందుపర్చాలి. దాన్ని అధికారులు పరిశీలించి.. పంటను ఏ విధంగా పండించాలి? ఎలాంటి నాణ్యతా ప్రమాణాలు పాటించాలి వంటి అంశాలపై రైతుకు అవగాహన కల్పిస్తారు. పంటను పెరుగదల దశలో ఒకసారి, కోత దశలో మరోసారి అధికారులు పరిశీలిస్తారు. ఏదైనా అనుమానం వస్తే.. ఆకస్మిక తనిఖీలు జరుపుతారు. పంట, మట్టి శాంపిళ్లను సేకరించి పలు పరీక్షలు నిర్వహిస్తారు. వాటి ఆధారంగా సర్టిఫికెట్ జారీ ఉంటుంది. అయితే.. అప్పటికే రసాయన ఎరువులతో పంటలు పండించిన నేల కావడంతో ధ్రువీకరణ కాస్త సమస్యగా మారుతుంది. దీనికోసం వ్యవసాయ అధికారులు ముందుగానే రైతులు పలు సూచనలు చేస్తుంటారు.

స్వచ్ఛమైన ఉత్పత్తులు

వర్మీ కంపోస్టు, పశువుల పేడ, గో మూత్రం, బెల్లం, వేపాకు, వేప పండ్లు, బీడీల ఆకు.. ఇలా సహజ సిద్ధంగా లభ్యమయ్యే వాటిని సేంద్రియ ఎరువులుగా వాడుతుంటారు. వీటిలో ఎలాంటి రసాయనాలకు ఆస్కారం ఉండదు. దేశవ్యాప్తంగా 10 లక్షల హెక్టార్లలో ఈ విధానం అమలవుతోంది. ఒక్క సిక్కిం రాష్ట్రంలోనే రెండున్నర లక్షల హెక్టార్లలో సేంద్రియ వ్యవసాయం సాగుతోంది. మన రాష్ట్రంలో ఈ పద్ధతిలో వరి, కందులు, మొక్కజొన్న, జొన్న, సజ్జలు, కొర్రలు, రాగులు, సామలు, మామిడి, జామ, టమాటా, వంకాయ, బెండకాయలు, మిరప, పలు రకాల ఆకుకూరలను పండించేందుకు రైతులు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. తినే ఆహారంలోని రసాయనాలే సర్వ రోగాలకు కారణమని ఎన్నో అధ్యయనాలు తేల్చాయి. సేంద్రియ ఉత్పత్తుల వల్ల ఆ సమస్య ఉండదని, ఆరోగ్యం మెరుగుపడుతుందని నిపుణులు అంటున్నారు. పైగా పంటలకు రసాయన ఎరువుల వాడకం తగ్గిపోవడంతో భూమి సాంద్రత పెరుగుతుందని, బయోడైవర్సిటీని కాపాడినట్లవుతుందని పేర్కొంటున్నారు.



భళా.. లావణ్య

20 ఎకరాల సొంతభూమి.. అదనంగా 10 ఎకరాలు కౌలుకు తీసుకొని సేంద్రియ వ్యవసాయం చేస్తున్నారు లావణ్య. నాగర్‌కర్నూల్ జిల్లా తెల్కపల్లి మండలం కారువంగ గ్రామానికి చెందిన ఆమె.. 16 ఏళ్లుగా ఈ విధానంలో సాగిపోతున్నారు. గతంలో రసాయన ఎరువులు వాడటంతో పంట దిగుబడి మాట అటుంచి మార్కెట్‌లో సరైన ధర పలికేది కాదని ఆమె అంటున్నారు. ఫలితంగా నాడు అప్పుల పాలై.. పొలాన్ని అమ్ముకోవాల్సి వచ్చిందని గుర్తుచేసుకుంటున్నారు. ప్రస్తుతం సేంద్రియ సాగు వల్ల కొత్తగా పొలాన్ని కూడా కొనుగోలు చేసుకోగలిగామని, నిశ్చింతగా బతుకుతున్నామని చెప్తున్నారు. పండించిన పంటను తామే ప్యాక్ చేసి హైదరాబాద్‌లో మార్కెట్ చేసుకుంటున్నామని ఆమె అన్నారు. తొమ్మిది రకాల వరి, ఎనిమిది రకాల మిరప, అంతర పంటగా దనియాలు, ఆవాలు, గోదుమలు, కందిని సేంద్రియ పద్ధతిలో లావణ్య సాగు చేస్తున్నారు. చిట్టి ముత్యాలు రకం వరిని అర ఎకరం వేస్తే రూ.80 వేలు గిట్టుబాటైందని ఆమె గుర్తుచేసుకున్నారు.

ప్రోత్సహిస్తున్నాం

రసాయన ఎరువుల వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. జీవన ప్రమాణాలు పడిపోతున్నాయి. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి సర్టిఫికేషన్ కార్యక్రమాన్ని చేపట్టాం. దశలవారీగా ఈ వ్యవసాయాన్ని పెంపొందించే ప్రయత్నిస్తున్నాం. వ్యవసాయ ఉత్పత్తులకు విదేశీ మార్కెట్‌ల్లో విక్రయించడానికి రసాయన అవశేషాలు ఉంటుండడంతో ఇబ్బందులొస్తున్నాయి. మిర్చిపంటకు, కూరగాయలకు ఈ సమస్య వస్తోంది. ఆర్గానిక్ ఫార్మింగ్‌పై రైతులను ప్రోత్సహిస్తున్నాం. బ్యాచ్‌ల వారీగా శిక్షణ కల్పిస్తున్నాం.

- వెంకట్రామ్‌రెడ్డి, ఉద్యనవన శాఖ డైరెక్టర్

ఉద్యోగం వదిలి..!

పులి సంపత్‌కుమార్. వరంగల్ జిల్లా రాపాకపల్లికి చెందిన ఆదర్శ రైతు. ఎంబీఏ చదవి.. పలు కంపెనీల్లో పనిచేశారు. అక్కడ ఎంత పనిచేసిన ఏదో వెలితి. సేంద్రియ వ్యవసాయ నిపుణుడు సుభాష్ పాలేకర్ ప్రసంగాలు ఆయనను పల్లె బాట పట్టించాయి. 2014లో ఉద్యోగాన్ని వదిలి తన సొంతూరులో వ్యవసాయం ప్రారంభించారు. సేంద్రియ విధానంలో సాగును మొదలుపెట్టారు. నాలుగు ఎకరాల్లో సంపత్‌కుమార్ వరి, మామిడితో పాటు అంతర పంటలుగా పప్పులు, కూరగాయలు, ఎల్లిగడ్డ, కొబ్బరి సాగు చేస్తున్నారు. ప్రత్యేకంగా ఆవులను పెంచుతూ.. వాటి పేడ, మూత్రాన్ని, సహజ సిద్ధమైన వేప, వర్మీ కాంపోస్టును పంటలకు ఎరువుగా ఉపయోగిస్తూ చేతినిండా సంపాదిస్తున్నారు. సేంద్రియ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందని, ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లభిస్తోందని తెలిపారు. గత జూన్‌లో ఆయనను ప్రభుత్వం ఆదర్శ రైతుగా గుర్తించి రూ.51,116 అవార్డు ప్రకటించింది. 'మార్కెట్‌లో ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేసుకొని కూరగాయలు అమ్ముతున్నా. ఏటా రూ. లక్ష వరకు వస్తోంది. కాకర, బీర, బెండకాయలు, టమాట పండిస్తున్నా. సాధారణ కూరగాయల కంటే అదనంగా కిలోకు రూ. పది నుంచి రూ.20 ఎక్కువగా వస్తోంది. వరి ధాన్యం సన్నరకం పండిస్తున్నా. ధాన్యాన్ని మిల్లింగ్ చేసి క్వింటాల్‌కు రూ. 6 వేల చొప్పున అమ్ముతున్నా. వరితో ఏటా రూ.1.40 లక్షలు సంపాదిస్తున్నా. ప్రభుత్వం ఎగ్జిబిషన్‌లు, సెమినార్లకు స్పాన్సర్ చేస్తోంది. ఉద్యోగం కంటే.. వ్యవసాయంతోనే జీవితం హాయిగా సాగుతోంది' అని సంపత్ చెప్పారు.



సీబీఐకి రెగ్యులర్ డైరెక్టర్ కావాలి

ఎమ్మెన్నార్ నియామకాన్ని సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో పిటిషన్



న్యూఢిల్లీ : సీబీఐ తాత్కాలిక డైరెక్టర్ గా ఎం. నాగేశ్వరరావు నియామకాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో సోమవారం పిటిషన్ దాఖలైంది. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని హై పవర్ కమిటీ ఈమధ్య అలోక్ వర్మను పదవి నుంచి తొలగించిన నేపథ్యంలో తాత్కాలిక డైరెక్టర్ గా నాగేశ్వరరావును కేంద్రం నియమించింది. ఎమ్మెన్నార్ నియామకాన్ని సవాల్ చేస్తూ ' కామన్ కాజ్ ' అనే స్వచ్ఛంద సంస్థ తరపున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. సీబీఐ తాత్కాలిక డైరెక్టర్ గా నాగేశ్వరరావును నియమిస్తూ ఈనెల 10న ఇచ్చిన ఉత్తర్వును కొట్టివేయాలని సుప్రీంకోర్టును ' కామన్ కాజ్ ' స్వచ్ఛంద సంస్థ కోరింది. ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్ మెంట్ చట్టం 1946ను 2013లో లోక్ పాల్, లోకాయుక్త చట్టం సవరించిందని పిటిషన్ పేర్కొంది. ఈ సవరణ మేరకు సీబీఐకు రెగ్యులర్ డైరెక్టర్ ను నియమించడానికి వీలుగా కేంద్రానికి తగిన ఆదేశాలివ్వాలంటూ సుప్రీం కోర్టును పిటిషనర్ తరపు లాయర్ కోరారు.

ఈసీతో కలసి పనిచేస్తాం

ఇంటర్నెట్ అండ్ మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వెల్లడి

న్యూఢిల్లీ:

దేశంలో ఎన్నికలు పారదర్శకంగా జరిగేందుకు తమ వంతు సహకారం అందిస్తామని, కేంద్ర ఎన్నికల కమిషన్‌తో కలసి పని చేస్తామని ఇంటర్నెట్ అండ్ మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐఏఎంఏఐ) వెల్లడించింది. ఎన్నికల కోడ్ నిబంధనలు ఉల్లంఘిస్తూ ఆన్‌లైన్ ఫ్లాట్‌ఫాంలలో వార్తలు, సమాచారం వ్యాప్తి చేస్తున్నట్టు తెలిస్తే వెంటనే స్పందిస్తామంది. ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 126 (పోలింగ్‌కు 48 గంటల ముందు ప్రచారం) నిబంధనల్లో మార్పులపై తమ సలహాలు అడిగినందుకు ఈసీకి కృతజ్ఞతలు తెలిపింది. కోడ్‌ను ఉల్లంఘించే సమాచారాన్ని ప్రధాన సమస్యగా ఐఏఎంఏఐ పరిగణించిందని.. ప్రజాస్వామ్య ప్రక్రియ సమగ్రత, పవిత్రతను ఏ ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం కూడా అపహాస్యం చేయొద్దని పేర్కొంది. ఈ మధ్య డిజిటల్ మీడియా ప్రభావం ఎక్కువవడంతో పోలింగ్‌కు 48 గంటల ముందు ప్రచారం ఆపడం సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో సెక్షన్ 126 నిబంధనల్లో మార్పుల కోసం ఈసీ కమిటీ ఏర్పాటు చేసింది. గతవారమే ఆ కమిటీ ఈసీకి నివేదికిచ్చింది. సోషల్ మీడియా కంపెనీలు, ఈసీకి మధ్య సరైన అవగాహన ఉంటే ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించే సమాచార వ్యాప్తిని ముందే గుర్తించి తొలగించొచ్చని సూచించింది. కాగా ఐఏఎంఏఐలో గూగుల్, ఫేస్‌బుక్, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, వన్97 కమ్యూనికేషన్స్ సహా 300 మంది కంపెనీలున్నాయి.


'వెలివాడ కూల్చివేత' సరికాదు

ప్రజాసంఘాల నేతలు

హైదరాబాద్, వెలుగు: వివక్షకు వ్యతిరేకంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల ఉద్యమానికి 'వెలివాడ' ప్రతీక అని, దాన్ని కూల్చివేయడం సరికాదని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రోహిత్ వేముల న్యాయపోరాట సంఘీభావ కమిటీ ఆధ్వర్యంలో 'వెలివాడ కూల్చివేత'పై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. హెచ్‌సీయూ వీసీ అప్పారావును పదవి నుంచి తొలగించాలని నేతలు డిమాండ్ చేశారు. 'వెలివాడ కూల్చివేత' కారణమైనవారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. 17న రోహిత్ వేముల మూడో వర్ధంతి ఉన్నందున 'వెలివాడ' నిర్మాణాన్ని ధ్వంసం చేశారని ఆరోపించారు. విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలన్నారు.

యూపీలో గెలిచేది మేమే

కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్



న్యూఢిల్లీ : యూపీలో ఎవరెన్ని కూటములు ఏర్పాటు చేసినా లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకే విజయం దక్కుతుందని ఆ పార్టీ సీనియర్ నేత, కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ధీమా జోస్యం చెప్పారు. 2014 లోక్ సభ ఎన్నికల్లో వచ్చిన 71 సీట్లను ఈసారి సునాయాసంగా దక్కించుకుంటామన్నారు. అలాగే కిందటేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో యూపీ ప్రజలు బీజేపీకే అధికారం కట్టబెట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నాలుగున్నరేళ్ల కాలంలో మోడీ సర్కార్ పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. ఈ సందర్భంగా ఆయుష్మాన్ భారత్ లాంటి పథకాలను గుర్తు చేశారు. ఎన్డీయే సర్కార్ పై ప్రతిపక్షాలు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రతిపక్షాలకు ఒక అజెండా అంటూ లేకుండా పోయిందన్నారు. ప్రధాని మోడీని అధికారం నుంచి దించేయడమే ప్రతిపక్షాల ఏకైక అజెండా అని రాజ్ నాథ్ సింగ్ ఆరోపించారు.

'మా ఊళ్లో కాలచక్ర పూజ జరిపించండి'

ధర్మశాల: 'దేశంలోని వివిధ నగరాల్లో కాలచక్ర పూజ జరిపిస్తున్నారు. బిహార్, సిక్కిం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో చేయించినట్లే హిమాచల్ ప్రదేశ్‌లోనూ జరిపించండి' అంటూ ధర్మశాలకు చెందిన హోటలీయర్లు దలైలామాకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయనకు లేఖ రాశారు. కాలచక్ర పూజ వల్ల టూరిస్టుల తాకిడి పెరుగుతుందని, తద్వారా తమతో పాటు రాష్ట్రానికి చాలా మేలు కలుగుతుందని ఆ లేఖలో పేర్కొన్నారు.

శ్రీవారి టికెట్ల పేరుతో రూ.20 లక్షల మోసం

నిందితుడు అరెస్టు

హైదరాబాద్, వెలుగు: తిరుమల శ్రీవారి సేవల టికెట్ల పేరుతో హైదరాబాద్ లో ఘరానా మోసం జరిగింది. శ్రీవారి వస్త్రాలు, అభిషేకం, టిక్కెట్లు ఇప్పిస్తానని పలువురి నుంచి 20 లక్షల రూపాయలు వసూలు చేసిన నిందితుడిని ఎస్సార్ నగర్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. శివబాగ్ కాలనీ వాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు రాజ్ కుమార్ రెడ్డిపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు.



దుష్ప్రచారం చేస్తున్నారు.. చర్యలు తీసుకోండి

- హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు షర్మిల ఫిర్యాదు
- రంగంలోకి సైబర్ క్రైం పోలీసులు

హైదరాబాద్, వెలుగు: సోషల్ మీడియాలో తనపై, తన కుటుంబసభ్యులపై దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ అంజనీకుమార్‌కు వైఎస్సార్ సీపీ నాయకురాలు షర్మిల ఫిర్యాదు చేశారు. సోమవారం తన భర్త అనిల్‌కుమార్, మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, పార్టీ నేతలు సజ్జల రామకృష్ణారెడ్డి, వాసిరెడ్డి పద్మతోపాటు ఆమె సీపీని కలిశారు. అనంతరం షర్మిల మీడియాతో మాట్లాడుతూ.. సినీ హీరో ప్రభాస్ గురించి, తన గురించి సోషల్ మీడియాలో ఓ వర్గం కావాలనే దుష్ప్రచారం చేస్తోందన్నారు. '2014లో ఎన్నికలకు ముందు ఈ విషయంపై నేను పోలీసులకు ఫిర్యాదు చేశాను. మళ్లీ ఎన్నికలు వస్తున్నందున పుకార్లు సృష్టిస్తున్నారు. తప్పుడు ప్రచారం చేస్తున్న వారిని ఇలాగే వదిలేస్తే మరింత చెలరేగే అవకాశముంది. అందుకే ఫిర్యాదు చేశాను. అలాంటి వారిమీద, వారి వెనుక ఉన్న వారిమీద చర్యలు తీసుకోవాలి. కేవలం నా మీదే కాకుండా నా కుటుంబసభ్యులు, నా అన్న వైఎస్సార్సీపీ అధినేత జగన్ మీద కూడా విషప్రచారం చేస్తున్నారు' అన్నారు. తనపై జరుగుతున్న దుష్ప్రచారం వెనుక టీడీపీ హస్తం ఉన్నట్టు షర్మిల అనుమానం వ్యక్తం చేశారు. తన తండ్రి వైఎస్సార్ మీద గతంలో టీడీపీ లేనిపోనివి సృష్టించి ప్రచారం చేసిందని, జగన్ మీదా అలాగే చేస్తోందని ఆరోపించారు. 'నాపై కొందరు టీడీపీ నేతలు చేసిన ఆరోపణలను ఏపీ సీఎం చంద్రబాబు ఒక్కసారి కూడా ఖండించలేదు. కాబట్టి బాబే వీటిని ప్రోత్సహిస్తున్నారన్న అనుమానం వస్తోంది. ఆయన కుటుంబంలో, టీడీపీలో మహిళలు లేరా?' అని ప్రశ్నించారు. తనపై దుష్ప్రచారం చేస్తున్నవారు వాటిని నిరూపించగలరా అని నిలదీశారు. షర్మిల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, సైబర్ క్రైం అదనపు డీసీపీ రఘువీర్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీం విచారణ చేపట్టింది.

ఇరాన్‌లో కూలిన సైనిక విమానం

15 మంది మృతి

టెహ్రాన్ : ఇరాన్ రాజధాని టెహ్రాన్ లో ఆర్మీకి చెందిన ఓ కార్గో విమానం కూలిపోయింది. ఈ ప్రమాదంలో 15 మంది చనిపోయారు. ఇరాన్ ఏవియేషన్ ఆర్గనైజేషన్ ప్రతినిధి రీజా జాఫర్జాదేహ్ ఈ విషయాన్ని వెల్లడించారు. కిర్గిస్థాన్ రాజధాని బిషెక్ నుంచి మాంసం ఎగుమతి చేయడానికి కార్గో విమానం బయల్దేరింది. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో వేరే రన్ వే పై దించడానికి పైలెట్ ప్రయత్నిస్తుండగా బిల్డింగ్ ను ఢీకొట్టి విమానం కూలిపోయింది. ఏవియేషన్ సిబ్బంది వెంటనే విమానం కూలిపోయిన ప్రాంతానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన సమయంలో విమానంలో మొత్తం 16 మంది ప్రయాణిస్తున్నారు. వీరిలో ఒక్క విమాన ఇంజనీర్ మాత్రమే ప్రాణాలతో బయటపడినట్లు తెలిసింది. ప్రమాదం పై అధికారులు విచారణ చేపట్టారు.



మరో చిరుత బలి

మంచిర్యాలలో ఉచ్చు బిగుసుకుని మృతి ■ పది రోజుల్లో రెండో ఘటన

మంచిర్యాల,వెలుగు: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పది రోజుల వ్యవధిలో మరో చిరుతపులి వేటగాళ్లకు బలైంది. మంచిర్యాల దగ్గరున్న ర్యాలీ గడ్‌పూర్ గుట్టల్లో రెండురోజుల కింద చనిపోయిన చిరుతపులి శవాన్ని అధికారులు గుర్తించారు. సమాచారం రాగానే అటవీ అధికారులు అక్కడి వెళ్లి వివరాలు సేకరించారు. లక్సెట్టిపేట రేంజ్ పరిధిలోని ర్యాలీ గడ్‌పూర్ ప్రాంతంలో మెడకు వైరు తీగ బిగుసుకుని చనిపోయిన చిరుతపులి శవం ఉందని స్థానికులు తమకు సమాచారం అందించారని మంచిర్యాల ఫారెస్టు డివిజనల్ అధికారి వెంకటేశ్వర్‌రావు చెప్పారు. మూడు రోజుల కిందట వేటగాళ్ల ఉచ్చులో పడిన చిరుత తప్పించుకొని ఉంటుందని, చెట్టు దగ్గర ఆగిన పులి మెడకున్న వైరు చెట్టు కొమ్మకు చిక్కుకుని పెనుగులాడడంతో చనిపోయి ఉంటుందని భావిస్తున్నామన్నారు. పులి వయస్సు నాలుగైదు సంవత్సరాలు ఉంటుందని చెప్పారు. ఉచ్చుపెట్టిన వేటగాళ్లను గుర్తించి, శిక్షిస్తామన్నారు. ఆయనతో పాటు అటవీ అధికారులు నాగవత్ స్వామి, చంద్రమోహన్, సంతోష్ ఉన్నారు.

ఏపీలో ఇంకో చిరుత

వాహనం ఢీకొని మృతి

కడప: ఆంధ్రప్రదేశ్‌లోనూ గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ చిరుత మృతిచెందింది. కడప జిల్లా బద్వేలు దగ్గర ఈ ఘటన జరిగింది. నెల్లూరు జిల్లా ఉదయగిరి కొండల్లోని అడవి నుంచి వచ్చిన చిరుత ఆదివారం రాత్రి జాతీయ రహదారి దాటుతుండగా వాహనం ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడటంతో కాసేపు ప్రాణాలతో కొట్టుమిట్టాడి చనిపోయింది.



కర్ణాటకలో హైడ్రామా!



బ్లాక్ బాక్స్ దొరికింది

వీడనున్న ఇండోనేసియా విమాన ప్రమాద మిస్టరీ

జకర్తా: గతేడాది ప్రమాదానికి గురైన ఇండోనేసియా లయన్ ఎయిర్ బోయింగ్ విమానం బ్లాక్‌బాక్స్ఎట్టకేలకు దొరికింది. దీంతో నెలల తరబడి సాగిస్తున్న వెతుకులాటకు ముగింపు పలికినట్లైంది. ఫ్లైట్‌డాటా రికార్డర్ దొరికిన ప్రాంతానికి పది మీటర్ల దూరంలో ఈ బాక్స్ దొరికిందని, సోమవారం ఉదయం డైవర్లు దీనిని వెలికితీశారని ఇండోనేసియా అధికారులు ప్రకటించారు. లయన్ఎయిర్ కు చెందిన సరికొత్త విమానం బోయింగ్ 737 గతేడాది అక్టోబర్‌లో సముద్రంలో కుప్పకూలింది. గాల్లోకి ఎగిరిన నిమిషాల వ్యవధిలోనే ఈ ఫ్లైట్‌క్రాష్‌ల్యాండయింది. ఇందులో ప్రయాణిస్తున్న 189 మంది ప్రయాణికులు, సిబ్బంది గల్లంతయ్యారు. జకర్తా ఎయిర్‌పోర్ట్‌నుంచి టేకాఫ్ అయిన తర్వాత పదమూడు నిమిషాలకు ఈ ఫ్లైట్ సిగ్నల్స్ అందకుండా పోవడంతో గందరగోళం రేగింది. వెంటనే స్పందించిన అధికారులు గాలింపు చర్యలు చేపట్టి, ఫ్లైట్ జావా సముద్రంలో కూలిపోయిందని తేల్చారు. మృతదేహాలు, విమాన శకలాల కోసం సముద్రంలో గాలింపు చర్యలు చేపట్టారు. తాజాగా ఫ్లైట్ బ్లాక్ బాక్స్‌దొరకడంతో ప్రమాదానికి కారణమేంటనే విషయం తెలుసుకోవచ్చని అధికారులు భావిస్తున్నారు. యాంటీస్టేలింగ్‌సిస్టమ్‌పైలట్ ను ఇబ్బంది పెట్టిందని, అంతకు ముందు కూడా తరచుగా ఈ సమస్య తలెత్తినా లయన్‌ఎయిర్‌పట్టించుకోలేదని ప్రాథమిక విచారణలో వెల్లడైంది. అయితే, ప్రమాదానికి అసలు కారణమేంటనే విషయం మాత్రం నిర్ధారణ కాలేదు. దీంతో బ్లాక్ బాక్స్‌దొరికితే కానీ ఈ చిక్కుముడి వీడదని విచారణ అధికారులు తేల్చారు.

డాటా రికార్డర్

ప్రమాదం జరిగిన సమయంలో విమానం ఏ దిశగా, ఎంత ఎత్తులో, ఎంత వేగంతో ప్రయాణిస్తుందనే వివరాలను డాటా రికార్డర్‌ద్వారా తెలుసుకోవచ్చు.



బ్లాక్ బాక్స్ అంటే..

పేరుకు బ్లాక్‌బాక్స్ గా చెప్పుకున్నా ఇది ఆరెంజ్ కలర్ లో ఉంటుంది. అత్యధిక ఉష్ణోగ్రతలను తట్టుకునేలా, నీటి లోపల ఎంతకాలం ఉన్నా పాడవకుండా దీనిని తయారుచేస్తారు. ఇందులో అమర్చే బీకన్ నెల రోజుల దాకా సిగ్నల్స్ పంపుతుంటుంది. కాక్ పిట్ లో అమర్చే ఈ బాక్స్‌లో పైలట్ మాట్లాడేది ఎప్పటికప్పుడు రికార్డవుతుంది. ప్రమాదం జరిగినపుడు కాక్ పిట్ లో ఏం జరిగిందనే వివరాలను దీంతో తెలుసుకోవచ్చు. ఇప్పటి వరకు జరిగిన విమాన ప్రమాదాల్లో 90 శాతం ప్రమాదాలకు కారణమేంటనే విషయం దీంతోనే బయటపడింది.

బెంగళూరు :

కర్ణాటక రాజకీయాల్లో హైడ్రామా నడుస్తోంది. కుమారస్వామి సర్కార్ ను పడగొట్టడానికి ఎమ్మెల్యేల కొనుగోళ్లకు బీజేపీ ప్రయత్నాలు మొదలెట్టిందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. దీనికి బీజేపీ పక్కా ప్లాన్ తయారు చేసిందన్న కథనాలు జోరందుకున్నాయి. లోక్ సభ ఎన్నికల వ్యూహంలో భాగంగానే జేడీ(ఎస్) - కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోయాలని బీజేపీ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అనుకున్నట్లు అన్నీ జరిగితే సంక్రాంతి తర్వాత కర్ణాటకలో కొత్త ప్రభుత్వం ఏర్పడుతుందని భావిస్తున్నారు.

ముంబైకు ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కనిపించడం లేదని, వారిని బీజేపీ నాయకులు ముంబైకు తరలించారని కర్ణాటక కాంగ్రెస్ లో ట్రబుల్ షూటర్ గా పేరున్న మంత్రి డీకే శివకుమార్ చేసిన ఆరోపణతో ఎమ్మెల్యేల కొనుగోళ్ల అంశం తెరపైకి వచ్చింది. కుమారస్వామి నాయకత్వంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత దాదాపు అరడజనుసార్లు ఇలాంటి ప్రయత్నాలు జరిగాయని ఆయన చెప్పారు. అయితే బీజేపీ కుట్రలను తాము అడ్డుకున్నామన్నారు. ఈమధ్య కేబినెట్ నుంచి తొలగించిన రమేష్ ఝరకోలిని ఉపయోగించుకుని కాంగ్రెస్ ఎమ్మెల్యేల మద్దతు కూడగట్టడానికి బీజేపీ ప్రయత్నాలు చేస్తోందని శివకుమార్ ఆరోపించారు. పదిమంది వరకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీజేపీ వైపు తిప్పుకోవడానికి రమేష్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటివరకు ఇద్దరు ఎమ్మెల్యేల విషయంలోనే ఆయన సక్సెస్ అయ్యారని శివకుమార్ చెప్పారు.

- ఎమ్మెల్యేల కొనుగోళ్లపై ఆరోపణలు, ప్రత్యారోపణలు
- బీజేపీ కుట్ర చేస్తోందన్న కాంగ్రెస్
- ఆరోపణలను తిప్పికొట్టిన యడ్యూరప్ప

ఒక్కో ఎమ్మెల్యేకు రూ. 30 కోట్ల ఆఫర్ ?

పార్టీ మారడానికి ఒక్కో కాంగ్రెస్ ఎమ్మెల్యేకు రూ. 30 కోట్లు బీజేపీ ఆఫర్ చేస్తోందని వారం కిందట కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ సీఎం సిద్దరామయ్య ఆరోపించారు. జేడీ(ఎస్) కు చెందిన ఎమ్మెల్యేల్లో చీలిక తీసుకురావడం కష్టమని భావించిన బీజేపీ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను టార్గెట్ చేయాలని డిసైడ్ అయిందన్నారు.

సర్కార్‌పై అవిశ్వాసం యోచనలో బీజేపీ

కాంగ్రెస్‌కు చెందిన పది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, జేడీ(ఎస్)కు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలతో కాంటాక్ట్‌లో ఉన్నట్టు బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. కొత్తగా కొంతమంది ఎమ్మెల్యేలను పార్టీలోకి తీసుకోవడం, మరికొంతమంది కాంగ్రెస్, జేడీ (ఎస్) ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయంచడం ద్వారా వచ్చే వారం కుమారస్వామి ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశట్టాలని బీజేపీ భావిస్తున్నట్టు తెలుస్తోంది.

అసెంబ్లీలో బలాబలాలు

మొత్తం 224 మంది సభ్యులున్న కర్ణాటక అసెంబ్లీలో కాంగ్రెస్ కు 80 మంది ఎమ్మెల్యేలున్నారు. జేడీ(ఎస్) కు 37 మంది,బీఎస్పీకి ఒక్కరు, ఇద్దరు ఇండిపెండెంట్లు ఉన్నారు. కాంగ్రెస్ తో కలిసి జేడీ (ఎస్) సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. బీజేపీకి 104 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు.

"బీజేపీ ఎమ్మెల్యేలు సంతోషంగా లేకపోతే మాతో చేరొచ్చు. ముంబైలో ఉన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నాతో టచ్‌లో ఉన్నారు. ఒకట్రెండు రోజుల్లో వారు బెంగళూరు వస్తారు".


\- రాష్ట్ర హోం మంత్రి ఎంబీ పాటిల్





సర్కార్‌కు ప్రమాదం లేదు

ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా తమ ప్రభుత్వానికి వచ్చిన ముప్పేమీ లేదని కర్ణాటక ముఖ్యమంత్రి హెచ్ డీ కుమారస్వామి ధీమా వ్యక్తం చేశారు. సంకీర్ణ ప్రభుత్వాన్ని కూలదోయడానికి బీజేపీ చేసిన ప్రయత్నాలను కాంగ్రెస్,జేడీ(ఎస్) అడ్డుకుంటారని చెప్పారు. బీజేపీ మాయలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పడరని ఆయన అన్నారు. ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ముంబైలోని ఓ హోటల్లో ఉన్నారన్న విషయాన్ని ప్రస్తావిస్తూ 'వారు నాతో టచ్ లోనే ఉన్నారు' అన్నారు. దీనికి రాజకీయ రంగు పులమడం సరికాదని ఆయన చెప్పారు.



ఆరోపణలు నిజం కాదు

కాంగ్రెస్ ఎమ్మెల్యేల కొనుగోలుకు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలను బీజేపీ ఖండించింది. కుమారస్వామి సర్కార్ ను కూలదోయాలన్న ఆలోచన తమకు లేదని బీజేపీ సీనియర్ నేత బీఎస్ యడ్యూరప్ప చెప్పారు. బీజేపీ కి చెందిన నలుగురైదుగురు ఎమ్మెల్యేలు తమతో టచ్ లో ఉన్నట్లు గుండూరావు చేసిన ప్రకటన దుమారం రేపింది. కాంగ్రెస్ ఆరోపణలకు యడ్యూరప్ప కౌంటర్ ఇచ్చారు. తమ ఎమ్మెల్యేలను ప్రలోభ పెట్టడానికి జేడీ(ఎస్) ప్రయత్నిస్తోందని యడ్యూరప్ప ఎదురుదాడి చేశారు.

పొత్తు బాగుంది భయ్యా!

ఎస్పీ, బీఎస్పీ కూటమిపై ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్

లక్నో : ఎస్పీ, బీఎస్పీ ఆధ్వర్యంలో ఏర్పడ్డ కూటమికి 'రాష్ట్రీయ జనతాదళ్'(ఆర్జేడీ) మద్దతు పలికింది. కూటమి ఇప్పటికే ఏర్పడాల్సి ఉందని ఆర్జేడీ ఉపాధ్యక్షుడు తేజస్వి యాదవ్ చెప్పారు. కూటమి ఏర్పాటు దేశ రాజకీయ చరిత్రలో కీలక ఘట్టంగా నిలిచిపోతుందన్నారు.

'' యూపీ, బీహార్ నుంచి బీజేపీ తుడిచిపెట్టుకుపోతుందన్న గట్టి నమ్మకం మాకుంది. ఎస్పీబీఎస్పీ కూటమి ఏర్పాటు దేశవ్యాప్తంగా బీజేపీ వ్యతిరేక శక్తులకు బలమైన సంకేతాన్ని ఇచ్చిందని'' అని తేజస్వి అన్నారు. సోమవారం ఇక్కడ సమాజ్ వాది పార్టీ (ఎస్పీ) చీఫ్ అఖిలేశ్ యాదవ్ తో కలిసి ఆర్జేడీ నేత మీడియా మాట్లాడారు. బీజేపీ ని ఎదుర్కోవడానికి రెండు ప్రాంతీయ పార్టీలు ఒక వేదిక మీదకు రావడాన్ని ఒక మంచి పరిణామంగా ఆయన పేర్కొన్నారు. మోడీ సర్కార్, రాజ్యాంగాన్ని ఖాతరు చేయడం లేదని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి, ఆరెస్సెస్ సిద్ధాంతాల ఆధారంగా పరిపాలన చేయాలని కేంద్రం భావిస్తోందని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా సెక్యులర్ పార్టీలు కూటమిగా ఏర్పడటం ఒక చారిత్రక అవసరం అని ఆర్జేడీ నాయకుడు చెప్పారు. లోక్ సభ ఎన్నికల తర్వాత కేంద్రంలో ఏ ప్రభుత్వం ఏర్పడాలో నిర్ణయించేది యూపీ, బీహార్ రాష్ట్రాలేనన్నారు.

రాజ్యాంగ వ్యవస్థలను దెబ్బ తీస్తున్న కేంద్రం

మోడీ సర్కార్ హయాంలో సీబీఐ,ఆర్బీఐ, ఎన్నికల సంఘం లాంటి రాజ్యాంగ వ్యవస్థలు తమ అస్థిత్వాన్ని కోల్పోతున్నాయని తేజస్వి యాదవ్ అన్నారు. అఖిలేశ్ యాదవ్ పై ఈమధ్య జరిగిన సీబీఐ దాడులను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. 2014 ఎన్నికలకు ముందు ప్రజలకు బోలెడన్ని హామీలు ఇచ్చిన బీజేపీ అధికారానికి వచ్చిన తర్వాత అన్నిటినీ మరచిపోయిందని ఆరోపించారు.

అన్ని వర్గాలను మోసం చేసిన బీజేపీ: అఖిలేశ్

అధికారంలోకి వస్తే పెద్ద సంఖ్యలో ఉద్యోగాల కల్పిస్తామని హామీ ఇచ్చిన బీజేపీ, నిరుద్యోగుల విషయంలో చేసిందేమీ లేదని ఎస్పీ నేత అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. దీంతో ఉద్యోగాల కోసం నిరుద్యోగులు రోడ్ల మీదకు వచ్చి ఆందోళనలు చేయాల్సి వచ్చిందన్నారు. పెద్ద నోట్ల రద్దు నిర్ణయంతో చిన్నా చితకా వ్యాపారులు దెబ్బతిన్నారన్నారు. బీజేపీ, అన్ని వర్గాలను మోసం చేసిందన్నారు.



లక్నోలో ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్‌తో ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ షేక్‌హ్యాండ్

45 సీట్లలో కాంగ్రెస్‌తో కలిసి పోటీ

ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్

ముంబై: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ), కాంగ్రెస్ మధ్య సీట్ల ఒప్పందం కుదిరింది. మహారాష్ట్రలోని మొత్తం 48 సెగ్మెంట్లలో 45 సీట్లలో కలిసి పోటీ చేయడానికి రెండు పార్టీల మధ్య అంగీకారం కుదిరినట్లు ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్ సోమవారం చెప్పారు. ఎన్సీపీ కోటాలో ఒక నియోజకవర్గాన్ని రాజు శెట్టికి చెందిన ' స్వాభిమాన్ షేత్కారీ సంఘటన్ (ఎస్‌ఎస్ఎస్) కు ఇస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ తన కోటాలోంచి కొన్ని సీట్లను లెఫ్ట్ పార్టీలకు ఇస్తుందన్నారు . కాంగ్రెస్ చీఫ్ రాహుల్ తో తాజాగా జరిపిన చర్చల తర్వాత 45 సీట్లలో కలిసి పోటీ చేయాలన్న ఒప్పందానికి సూత్రప్రాయంగా అంగీకారానికి వచ్చినట్లు పవార్ చెప్పారు. ఎన్సీపీ, కాంగ్రెస్ ఎవరెన్ని సీట్లలో పోటీ చేస్తారో ఆయన స్పష్టంచేయలేదు. మిగిలిన 3 సీట్లపై మరోసారి సమావేశమై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు.



'జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌తో పొత్తుల్లేవ్'

కోల్ కత: జాతీయస్థాయిలో కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకోవడం సాధ్యం కాదని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు సీతారాం ఏచూరి అన్నారు. అన్ని రాష్ట్రాల్లోనూ ఒకేరకమైన పరిస్థితులు లేవన్నారు. దీంతో ఆయా రాష్ట్రాల పరిస్థితుల ఆధారంగా కాంగ్రెస్ తో జత కట్టే విషయమై నిర్ణయాలు తీసుకుంటామన్నారు. పశ్చిమ బెంగాల్లో తృణమూల్ కాంగ్రెస్ ను ఓడించడానికి కాంగ్రెస్ తో కలిసి పనిచేయాలని సీపీఎం రాష్ట్ర శాఖ నుంచి ఒత్తిడి వస్తున్న నేపథ్యంలో ఆయన పొత్తులపై మాట్లాడారు. లోక్ సభ ఎన్నికల తర్వాత దేశంలో బీజేపీ వ్యతిరేక సెక్యులర్ ఫ్రంట్ ఏర్పడాలని తాము కోరుకుంటున్నట్లు చెప్పారు.

57 సిట్టింగ్ ఎంపీలకు నో చాన్స్?

గెలుపుకోసం యూపీలో బీజేపీ వ్యూహం

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గెలవడానికి బీజేపీ కొత్త వ్యూహాలను రచిస్తోంది. దీంట్లో భాగంగా సిట్టింగ్ ఎంపీల్లో 57 మందికి టికెట్లు ఇవ్వకూడదని ఆ పార్టీ యోచిస్తున్నట్టు తెలుస్తోంది. వీరి స్థానాల్లో కొత్తవారిని బరిలోకి దింపాలని భావిస్తోంది. బీజేపీ సర్కార్‌పై తీవ్ర వ్యతిరేకత ఉండడం, కొత్తగా ఎస్పీ, బీఎస్పీ కూటమి ఏర్పాటు లాంటి ఘటనలతో బీజేపీ ఈనిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. పార్టీ అంతర్గత సర్వేలో 57 మంది సిట్టింగ్ ఎంపీలకు వ్యతిరేకంగా రిపోర్టులు వచ్చినట్టు సమా చారం. కేంద్రం అమలుచేస్తున్న పథకాలపై కిందిస్థాయిలో అవగాహన కల్గించాలన్న బీజేపీ చీఫ్ అమిత్ షా టార్గెట్‌ను చేరుకోవడంలో ఈ సిట్టింగ్ ఎంపీలు విఫలమైనట్టు చెబుతున్నారు. ఈ నెల 9న జరిగిన సమావేశంలో ఈ ఎంపీలకు వచ్చే ఎన్నికల్లో టికెట్లు ఇవ్వడంలేదని అమిత్‌షా స్వయంగా చెప్పారని మీడియా కథనాలు వచ్చాయి. ఎస్పీ బీఎస్పీ కూటమిలో సామాజికంగా అన్నివర్గాల వారికి టికెట్లు ఇచ్చే అవకాశముంటుందని భావించిన బీజేపీ..ఆదిశగా ఈసారి ప్రభుత్వ వ్యతిరేకత నుంచి బయటపడేందుకు కొత్తవారిని బరిలోకి దింపాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. అమెరికాలోని ఓ రిసెర్చ్ సంస్థతో నిర్వహించిన సర్వే ఆధారంగానే సిట్టింగ్‌ల్లో మెజార్టీ సభ్యులకు టికెట్లు ఇవ్వకూడదని నిర్ణయించినట్టు చెబుతున్నారు. దీంతో టికెట్లు దక్కని కొంతమంది బీజేపీ ఎంపీలు..ఎస్పీ ప్రెసిడెంట్ అఖిలేష్ యాదవ్, బీఎస్పీ చీఫ్ మాయావతితో సంప్రదింపులు జరుపుతున్నట్టు వార్తలొస్తున్నాయి.



మహిళా ఐఏఎస్‌కు నిరసన సెగ

తిరువనంతపురం: శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశంపై వివాదం నడుస్తుండగానే కేరళలో మరో సంప్రదాయానికి వ్యతిరేకంగా మహిళా ఐఏఎస్ ధన్య సనాల్ అగస్త్యర్ కూడంపై ట్రెక్కింగ్ కు బయలుదేరారు. కాణి గిరిజనుల సంప్రదాయం ప్రకారం అగస్త్య ముని విగ్రహం ఉన్న ఈ పర్వతంపైకి మహిళలకు ప్రవేశం నిషిద్ధం. అయితే ఈ అనధికార నిషేధాన్ని తొలగిస్తూ గతేడాది నవంబర్ లో హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో సోమవారం మొదటి బ్యాచ్ లో వంద మంది పర్వతారోహకులతో కలిసి రక్షణ శాఖ అధికార ప్రతినిధిగా పని చేస్తున్న కె.ధన్య సనాల్ ట్రెక్కింగ్ కు బయలుదేరారు. 20 మంది చొప్పున ఐదు టీమ్ లుగా ట్రెక్కింగ్ చేస్తున్నారు. బొనక్కాడ్ దగ్గర ధన్య బయలుదేరే ముందు వందలాది కాణి గిరిజనులు జానపద గేయాలు పాడి, ప్లకార్డులతో నిరసన తెలిపారు. హైకోర్టు ఆదేశాలు ఉన్నందున ఆమెను అడ్డుకునే ప్రయత్నం చేయలేదు.

చైనా ప్రాజెక్టును పక్కనపెట్టిన పాక్!

ఇస్లామాబాద్: చైనా-పాకిస్థాన్ ఎకనమిక్ కారిడార్ (సీపీఈసీ)లో భాగంగా నిర్మించాల్సిన పవర్ ప్లాంట్‌ను పాక్ ప్రభుత్వం పక్కనపెటింది. వచ్చే ఐదేళ్ల అవసరాలకు తగినంత విద్యుత్ ఉత్పత్తి ఇప్పటికే జరుగుతున్నందువల్ల ప్రాజెక్టు అవసరంలేదని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ నేతృత్వంలోని పాకిస్థాన్ ముస్లిం లీగ్ ప్రభుత్వం 1,320 మెగావాట్ల సామర్థ్యం గల బొగ్గు ఆధారిత విద్యుత్ ప్రాజెక్టును నిర్మించాలని గతంలో నిర్ణయించింది. రహీం యార్ ఖాన్ పవర్ ప్రాజెక్ట్ అని పేరు పెట్టింది. ఈ నేపథ్యంలో విద్యుత్ ప్రాజెక్టు అవసరంలేదని చైనాకు ఇమ్రాన్ ఖాన్ ప్రభుత్వం చెప్పినట్లు 'డాన్' పత్రిక వెల్లడించింది. సీపీఈసీ లిస్టు నుంచి ఈ ప్రాజెక్టును తొలగించాలని చైనాను పాక్ అభ్యర్థించినట్లు చెప్పింది. బలూచిస్థాన్‌లోని గ్వాదర్ పోర్టు నుంచి చైనాలోని జింజియాంగ్ ప్రావిన్స్ వరకు సీపీఈసీ నిర్మించాలని చైనా, పాక్ నిర్ణయించిన విషయం తెలిసిందే.



కుంభమేళాలో అగ్నిప్రమాదం

ఫైర్ సిబ్బంది అప్రమత్తతతో తప్పిన నష్టం

ప్రయాగ్‌రాజ్ (ఉత్తరప్రదేశ్):

ప్రయాగ్‌రాజ్ కుంభమేళాలో సోమవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగింది. దిగంబర్ అఖాడా ప్రాంతంలో వంటగ్యాస్ సిలిండర్ పేలడంతో ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బందితో పాటు ఫైర్‌ఫైటర్స్ రంగంలోకి దిగి పది నిమిషాల్లో మంటలను అదుపులోకి తెచ్చారు. ఘటనకు దగ్గర్లో ఎక్కువ సంఖ్యలో టెంట్లు ఉన్నాయి. ఫైర్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడంతో మంటలు వ్యాపించలేదు. రెండు వాహనాలు, కొన్ని వస్తువులు పాక్షికంగా డ్యామేజయ్యాయి. అయితే కుంభమేళా మంగళవారం నుంచి ప్రారంభం కానుంది.

కన్హయ్య కుమార్‌పై 1200 పేజీల చార్జ్‌షీట్

న్యూఢిల్లీ: జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ (జేఎన్‌యూ) మాజీ స్టూడెంట్స్ యూనియన్ నాయకులు కన్హయ్య కుమార్, ఉమర్ ఖలీద్‌తో పాటు మరో ఎనిమిది మందిపై ఢిల్లీ పోలీసులు సోమవారం 1200 పేజీల చార్జ్‌షీట్‌ను దాఖలుచేశారు. జేఎన్‌యూ క్యాంపస్‌లో ఫిబ్రవరి 2016న దేశవ్యతిరేక కార్యక్రమాన్ని నిర్వహించారన్న ఆరోపణలపై వారిపై పోలీసులు దేశద్రోహం కేసు పెట్టారు. చార్జ్‌షీట్ దాఖలైనవారిలో జేఎన్‌యూ స్టూడెంట్స్ ముగ్గురు ఉండగా, మరో ఏడుగురు కాశ్మీర్ స్టూడెంట్స్ ఉన్నట్టు వారు తెలిపారు. పార్లమెంట్‌పై దాడికేసులో ప్రధాన సూత్రధారి అఫ్జల్‌గురును ఉరితీయడాన్ని నిరసిస్తూ కాలేజీ క్యాంపస్‌లో ఒక కార్యక్రమాన్ని నిర్వహించారంటూ వాళ్లపై ఆరోపలున్నాయి. దీనికి సంబంధించిన వాళ్లను అరెస్టు చేశారు. వాళ్ల అరెస్టును నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. అధికార బీజేపీ అండతోనే పోలీసులు పక్షపాతంగా వ్యవహరించారంటూ ప్రతిపక్షాలు ఆరోపించాయి.

మరో 36 మంది నిందితులకు ఈ వ్యవహారంతో ప్రత్యక్ష సంబంధాలు లేవని పోలీసులు చెప్పారు. అయితే విచారణకు వీరంతా రావాల్సి ఉంటుందన్నారు. వీరిల సీపీఐ జాతీయ నాయకుడు డి.రాజా కుమార్తె అప్రాజిత కూడా ఉన్నారు.

చార్జ్‌షీట్ పై కన్హయ్య కుమార్ స్పందిస్తూ.. ఇది ''రాజకీయ ప్రేరిపిత'' ఘటన అని అన్నారు. మూడేళ్ల తర్వాత, అదీ ఎన్నికల ముందు చార్జ్‌షీట్ దాఖలు చేయడమంటే రాజకీయ దురుద్దేశంతో కూడుకున్న చర్యేనని కన్హయ్య ఆరోపించారు.



చార్జ్‌షీట్‌లో పేర్కొన్న నిందితులు: 10 మంది

జేఎన్‌యూ స్టూడెంట్స్: కన్హయ్య కుమార్, సయ్యద్ ఉమర్ ఖలీద్, అనిర్బన్ భట్టాచార్య

కాశ్మీరువాసులు: అఖిబ్ హుస్సేన్; ముజీబ్ హుస్సేన్, మునీబ్ హుస్సేన్, ఉమర్ గుల్, రయీస్ రసూల్, బషారత్ అలి, ఖలీద్ బషీర్ భట్

రెండు కండ్లు సాలలే



గోదాదేవి,రంగనాథుల కల్యాణ దృశ్యం

- వైభవంగా గోదాదేవి రంగనాథ కల్యాణం
- పోటెత్తిన భక్తులు

భద్రాచలం, వెలుగు : శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో సోమవారం భోగి రోజున గోదాదేవి-రంగనాథ స్వామి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. చూడ్డానికి రెండు కండ్లు సరిపోలేదు. ధనుర్మాసంలో తిరుప్పావై ప్రవచనాలతో వ్రతం పూనిన గోదాదేవి ఆ వ్రతం ముగిసిన అనంతరం రంగనాథుడిని పెళ్లాడే వేడుకను వేద పండితులు నిర్వహించారు. ఉదయం గోదావరి నుంచి తీర్థబిందెను తెచ్చిన అర్చకులు గర్భగుడిలో స్వామికి విశేష తిరుమంజనం చేశారు. ముత్యాలు పొదిగిన వస్త్రాలను ధరింపజేసి ముత్తంగి సేవ నిర్వహించారు. ఇదే సమయంలో ఉత్సవమూర్తులను ప్రాకార మండపానికి తీసుకొచ్చి అక్కడ గోదాదేవి-రంగనాథుల కల్యాణ క్రతువును ప్రారంభించారు. అంతకు ముందు ఉదయం గోదాదేవి, రంగనాథులకు తిరువీధి సేవ జరిగింది. భోగి పర్వదినం కావడంతో భక్తులతో ఆలయం పోటెత్తింది. ధనుర్మాసం సందర్భంగా గత నెల 16వ తేదీ నుంచి ఈ నెల 14వ తేదీ వరకు తిరుప్పావై ప్రవచనం చేసిన అభినవ మొల్ల డాక్టర్ చక్రవర్తుల లక్ష్మీనర్సమ్మకు దేవస్థానం ఆలయ మర్యాదలు చేసింది. స్వామి వారి ప్రసాదం, జ్ఞాపికను ఆమెకు అందజేశారు.



నల్లగొండలో జరిగిన గోదా కల్యాణానికి హాజరైన భక్తులు



జోరుగా కోడి పందేలు

లక్షల్లో చేతులు మారుతున్న డబ్బులు ● సరిహద్దు దాటిన పందెం రాయుళ్లు

పల్లెల్లో సంక్రాంతి పండుగ జోరందుకుంది. ఊరు వాడా భోగి మంటలు, గొబ్బెమ్మలతో జనం బిజీగా ఉంటే, పందెం రాయుళ్లు తమ పనుల్లో బిజీగా ఉన్నారు. మామిడి తోటలు, కొబ్బరి తోటల్లో కోడి పందేలను షురూ చేశారు. వేల రూపాయల నుంచి లక్షల రూపాయల వరకు పందేలు కాస్తూ పండుగ జోరు కొనసాగిస్తున్నారు. ఇక చాలా మంది సరిహద్దులు దాటి ఏపీలో కోడి పందేలకు తరలివెళ్లారు.

ఖమ్మం, వెలుగు:

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సంక్రాంతి పండుగను జనం ఘనంగా జరుపుకుంటున్నారు. సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గ సరిహద్దుల్లో కోడి పందేలు జోరందుకున్నాయి. రూ.5 వేల నుంచి లక్ష రూపాయల వరకు కోళ్ల పందేలు జరుగుతున్నాయి. అశ్వారావుపేట నియెజకవర్గంలోని సరిహద్దు గ్రామాలైన వడ్లగూడెం, రామన్నగూడెం, కుడుములపాడు, మేడేపల్లి, అల్లిబెల్లిలో పెద్ద యెత్తున కోడి పందేలు, పేకాట నడుస్తున్నాయి. చంద్రుగొండ, ముల్కలపల్లి, ఇల్లందులోనూ అక్కడక్కడా కోడి పందేలు జరుగుతున్నాయి. చాలా సరిహద్దు గ్రామాల నుంచి పందెం రాయుళ్లు ఏపీ వెళ్లారు. ఆదివారం రాత్రి నుంచే చాలా మంది డబ్బులు చేతుల్లో పట్టుకొని కృష్ణా, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలకు తరలివెళ్లారు. అక్కడ లక్షల నుంచి కోట్ల రూపాయల్లో పందేలు జరుగుతుండడంతో ధైర్యంగా అక్కడికి వెళ్లారు. ఇక్కడ పందేల్లో పాల్గొని పోలీసులతో రిస్క్ ఎదుర్కోవడం కంటే, బహిరంగంగా జరిగే వేడుకల్లో పాల్గొనడం మంచిదనే చాలా మంది అక్కడికి వెళ్లేందుకు ఆసక్తి చూపారు. ఇక రాష్ట్ర పరిధిలో కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవనే పోలీసుల ప్రచారం కూడా కొంత ప్రభావం చూపింది. గతంతో పోలిస్తే మారుమూల ప్రాంతాలు, సరిహద్దులోని కొన్ని తోటలకే ఈసారి కోడి పందేలు పరిమితమయ్యాయి. సత్తుపల్లి అర్బన్ మండలం కిష్టాపురం, పెద్దపాకలగూడెంలో కోడి పందేలను సోమవారం పోలీసులు అడ్డుకొని, నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. కల్లూరు, పెనుబల్లి మండలాల్లో ఆరు చోట్ల కూడా నిర్వాహకులను అరెస్ట్ చేశారు.

వేంసూరు మండలంలో పది చోట్ల కోడి పందేలను పోలీసులు అడ్డుకున్నారు. పది ఎఫ్ఐఆర్ లను నమోదు చేసి, కోడి పందేల్లో పాల్గొన్న 25 మందిని బైండోవర్ చేశారు. 10 బైక్ లను స్వాధీనం చేసుకున్నారు. గంగారం, పాకలగూడెం, గురుబట్లగూడెం, మేడిశెట్టివారిపాలెం, సత్యనారాయణ పురం దగ్గర కల్లూరు ఏసీపీ ఆంజనేయులు తనిఖీలు నిర్వహించారు. నిర్వహకుల నుంచి పుంజులను స్వాధీనం చేసుకొని 8 మందిని అదుపులోకి తీసుకున్నారు.

రిజర్వాయర్లో పడి యువకుడి గల్లంతు

సెల్ఫీ తీసుకుంటుండగా ప్రమాదం

స్టేషన్ఘన్పూర్, వెలుగు: స్నేహితులతో సంతోషంగా గడిపేందుకు రిజర్వాయర్ వద్దకు వెళ్లిన యువకుడు సెల్ఫీ తీసుకుంటుంగా నీటిలో పడి గల్లంతయ్యాడు. ఈ సంఘటన చిల్పూరు మండలంలోని ఫత్తేపూర్ శివారులో మల్లన్నగండి రిజర్వాయర్ వద్ద సోమవారం సాయంత్రం జరిగింది. స్టేషన్ఘన్పూర్ సీఐ రాజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. లింగాల ఘనపురం మండలం నెల్లుట్లకు చెందిన రామకృష్ణ(23) సంక్రాంతి పండుగ సందర్భంగా ఐదుగురు స్నేహితులతో కలిసి మల్లన్నగండి రిజర్వాయర్ను చూసేందుకు వెళ్లారు. రిజర్వాయర్ కట్టపై రామకృష్ణ నిల్చొని తన స్మార్టు ఫోన్తో సెల్ఫీ తీసుకుంటుండగా ప్రమాదవశాత్తు రిజర్వాయర్లోని నీటిలో పడి గల్లంతయ్యాడు. లోతుగా ఉండటంతో స్నేహితులు అతడిని కాపేందుకు ప్రయత్నం చేసినా ఫలితం లభించలేదు. సమాచారమందుకున్న స్టేషన్ఘన్పూర్ సీఐ రాజిరెడ్డి, చిల్పూరు ఎస్సై శ్రీనివాస్ పోలీస్ సిబ్బందితో సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. యువకుడి అచూకీ కోసం ప్రయత్నాలు చేస్తామని సీఐ తెలిపారు.



నిన్న ఇచ్చారు.. నేడు మార్చారు

- గంగాపూర్ క్లస్టర్ పరిధిలో వార్డు సభ్యుల గుర్తులు మార్పు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు

కాగజ్నగర్, వెలుగు: ఎన్నికల అధికారులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం అభ్యర్థులకు తలనొప్పిగా మారింది. జిల్లాలోని చింతల మానేపల్లి మండలం గంగాపూర్ క్లస్టర్ పరిధిలో అభ్యర్థులకు కేటాయించిన గుర్తులను మార్చడం వివాదాస్పదమవుతోంది. గంగాపూర్ క్లస్టర్లో గంగాపూర్, భూరేపల్లి, కోర్సిని పంచాయతీలు ఉన్నాయి. వీటిలో నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఆదివారంతో ముగియగా సాయంత్రం బరిలో నిలిచిన సర్పంచ్, వార్డు సభ్యులకు వారి పేర్ల ఆధారంగా గుర్తులు కేటాయించారు. దీంతో అభ్యర్థులు తమ గుర్తులతో కరపత్రాలను ప్రింటింగ్ చేయించుకొని ప్రచారం ప్రారంభించారు. ఈ సమయంలో సోమవారం సాయంత్రం స్టేజ్ 1 అధికారి గుర్తుల కేటాయింపులో ఇబ్బంది జరిగిందంటూ వాటిని మార్చి నోటీస్ బోర్డులో అంటించే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న బూరేపల్లి గ్రామస్తులు, బరిలో నిలిచిన వార్డు సభ్యులు క్లస్టర్ కేంద్రానికి చేరుకొని అధికారిని నిలదీశారు.

ఆరు వార్డుల గుర్తుల మార్పు

నూతనంగా ఏర్పడ్డ గ్రామంలో 8 వార్డు స్థానాలు ఉండగా మూడో వార్డ్ ఏకగ్రీవమైంది. ఏడు స్థానాలకు 17 మంది అభ్యర్థులు బరిలో ఉండగా ఆదివారం కేటాయించిన గుర్తులో ఏడవ వార్డు మినహా మిగిలిన ఆరు వార్డులకు గుర్తులు మార్చారని అభ్యర్థులు అంటున్నారు. దీని వల్ల తమకు నష్టం జరుగుతుందని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ విషయమై అధికారిని అడిగితే సమాధానం చెప్పకుండానే వెళ్లిపోయాడని ఆరోపిస్తున్నారు. గుర్తుల కేటాయింపు, మార్పులపై కౌటాల ఎంపీడీవో లక్ష్మీనారాయణను వివరణ కోరగా అసలు తనకు ఈ విషయమే తెలియదన్నారు.





జహీరాబాద్లో పాత పంటల జాతర

సంగారెడ్డి, వెలుగు:

చిరుధాన్యాల పాత పంటల జాతర అందరినీ ఆకట్టుకున్నది. సహజ పద్ధతిలో సాగు చేసి ఆహార భద్రతతో పాటు పౌష్టికాహారాన్ని అందించే లక్ష్యంతో సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం అర్జున్నాయక్ తండాలో మహిళలు పాత పంటల జాతర నిర్వహించారు. ఇరవైఏళ్లుగా ఈ కార్యక్రమం జరుగుతోంది. దక్కన్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం నాడు వేడుకలను ప్రారంభించారు. రుచికరమైన, ఆరోగ్యకరమైన ఆహారానికి ఈ మధ్య ఆదరణ పెరుగుతోంది. సొసైటీ ఆధ్వర్యంలో పాత పంటల జాతర 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అర్జున్నాయక్తండాలో నిర్వహించిన వేడుకలకు విదేశీయులతో పాటు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమీషనర్ అకున్ సబర్వాల్ హాజరయ్యారు. వేడుకల్లో గిరిజన మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి నృత్య ప్రదర్శనలు చేశారు. ఎడ్ల బండ్ల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాత పంటలు పండిస్తూ ఆదర్శంగా నిలిచిన మహిళ రైతులను అకున్ సబర్వాల్ సన్మానించారు.



- ఆకట్టుకున్న ఎడ్లబండ్ల ప్రదర్శన
- గిరిజనుల సంప్రదాయ నృత్యాలు
- ఉత్తమ రైతులకు సన్మానం

ఆరోగ్యానికి రక్ష

చిరుధాన్యాలు ఆరోగ్యాన్ని చక్కగా కాపాడతాయని అర్జున్నాయక్ తండాకు చెందిన జీవ వైవిధ్య రైతు చాందిబాయి, విత్తన సంరక్షకురాలు అంజమ్మ అన్నారు. చిరుధాన్యాల ఆహారాన్ని ఆరోగ్యశ్రీలో చేర్చాలని కోరారు. జాతర సందర్భంగా జరిగిన సెమినార్లో వారు మాట్లాడారు. డీడీఎస్ సహకారంతో 20, 30 రకాల పంటలను పండిస్తూ విత్తనాలను, ఎరువులను తామే సమకూర్చుకుంటున్నామన్నారు. సంప్రదాయ పద్ధతులలో శుద్ధి చేసిన విత్తనాలు మూడేండ్లు నిల్వ ఉంటాయన్నారు. ఇక్కడి నేల చిరుధాన్యాలకు అనుకూలంగా ఉంటుందని, ఇక్కడి ప్రజలకు చిరుధాన్యాల సాగుపై శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. సేంద్రియ పద్ధతుల్లో చిరుధాన్యాల సాగుపై పలువురు శాస్త్రవేత్తలు మాట్లాడారు.

రైతులకు అండగా..

డీడీఎస్ ఇక్కడ రైతుల వెనుకబాటుతనాన్ని పోగొట్టేందుకు చేస్తున్న కృషి బాగుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమీషనర్ అకున్ సబర్వాల్ అభినందించారు. పాత పద్ధతుల్లో మంచి సాగు విధానాన్ని రైతులకు నేర్పిస్తుందన్నారు. డీడీఎస్ డైరెక్టర్ సతీష్ మాట్లాడుతూ పాత పంటల జాతర నిజమైన రైతుల పండుగన్నారు. ఈ చిరుధాన్యాల సాగు అంశాన్ని పుస్తకాల్లో పాఠ్యాంశంగా చేర్చడం శుభపరిణామన్నారు. డీడీఎస్ కోడైరెక్టర్ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.



రద్దీ తగ్గింది

సంక్రాంతి సందర్భంగా హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు వెళ్లే వారితో మూడు రోజులుగా రద్దీగా ఉన్న హైదరాబాద్ విజయవాడ రహదారి సోమవారం ఒక్కసారిగా బోసిపోయి కనిపించింది. ఇప్పటికే మెజార్టీ ప్రజలు ఊళ్లకు వెళ్లిపోవడంతో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ వద్ద హైవే ఇలా ఖాళీగా కనిపించింది.

యాదాద్రి, వెలుగు



విద్యుత్ వెలుగుల్లో కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయం

బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

నాగర్కర్నూల్, వెలుగు : తెలంగాణ రెండో యాదగిరి గుట్టగా పేరొందిన నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్లోని సింగోటంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. 19 తేదీ వరకు ఈ ఉత్సవాలు జరుగనున్నాయి. సింగోటంలో స్వయంభూగా వెలిసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామిని భక్తులు తమ ఇంటి ఇలవేల్పుగా కొలుస్తారు. ప్రతి ఏటా పుష్యమాస శుద్ధ నవమి ఉత్తరాయణ పుణ్య మకర సంక్రాంతి నుంచి ఆరు రోజుల పాటు వైభవంగా స్వామి వారి బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయి. స్వామివారి దర్శనానికి తెలంగాణ ప్రాంతం నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు, ఒడిషా, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి భక్తులు తరలి వస్తారు. ఈనెల 15న బ్రహ్మోత్సవాల అంకురార్పణ, రుత్విగరణం, దేవాతాహ్వానంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 16న శ్రీవారి కల్యాణోత్సవం, 17న ప్రభవోత్సవం, 19న తెప్పోత్సవం నిర్వహిస్తారు. శ్రీవారి ఆలయంలో శివాలయం,ఆంజనేయాలయం, వినాయక స్వామి దేవాలయాలు ఉన్నాయి. సాగునీరు, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సింగోటం దేవాలయ ప్రాంగణాన్నీ, శ్రీవారి సముద్రాన్నీ, రత్నగిరి కొండను సుందరంగా తీర్చిదిద్దారు. శ్రీవారి సముద్రాన్ని ట్యాంక్బండ్గా ముస్తాబు చేశారు.

- నేటి నుంచి 'సింగోటం' వేడుకలు
- శనివారంతో ముగింపు



మంగళవారం | హైదరాబాద్
15.01.2019
www.v6velugu.com
ప్రభాత వెలుగు
Follow: v6velugu



నాడు కొండలు, గుట్టలు, పచ్చని చెట్లతో కళకళలాడిన అడవులు.. నేడు అక్రమార్కుల గొడ్డలివేటుకు నేలకొరుగుతున్నయి. గుట్టుచప్పుడు కాకుండా లారీల కొద్దీ కలపను జిల్లా బార్డర్ దాటిస్తున్నరు. జోరుగా సాగుతున్న కలప అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంలో అధికారులు ఫెయిలవుతున్నారనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసకున్నా అడవి దొంగల ఆగడాలకు అంతులేకుండా పోతోంది. దీంతో విలువైన కలప రోజురోజుకూ కనుమరుగవుతోంది.

అడవి ఆగమాగం

జోరుగా కలప అక్రమ రవాణా ■ కొరవడిన అటవీ శాఖ నిఘా

- వాహనాలున్నా.. ఫలితం సున్నా
- 'ఎల్లారెడ్డి' రేంజ్‌లో ఆగని ఆగడాలు

లింగంపేట, వెలుగు: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎల్లారెడ్డి ఫారెస్ట్ డివిజన్‌లో 40 వేల ఎకరాల విస్తీర్ణంలో అడవులు విస్తరించి ఉన్నాయి. ఈ అడవుల్లో ఎంతో విలువైన టేకు, జిట్రేగి, శిరుమాని, మద్ది, ఇప్ప, సెనంగి, తునికి, జీడి తెల్లవిట్ల, మొర్రి, తదితర రకాల చెట్లు విస్తారంగా ఉన్నాయి. లింగంపేట మండలంలోని రాంపల్లి, కొమట్ పల్లి, పోతాయిపల్లి, మెంగారం, శె ట్పల్లి, భవానీపేట, బానాపూర్ , ముంబాజీపేట, కొండాపూర్ , కంచ్ మల్, మోతె, ముస్తాపూర్, గాందారి మండలంలోని చద్మల్, పేట్‌సంగెం, సీతాయిపల్లి, గండివేట్, రాం లక్ష్మణపల్లి, ముదెల్లి, ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్ల, వెంకటాపూర్, అజామాబాద్, అన్నాసాగర్, అడ్విలింగాల, కొక్కొండ, లక్ష్మాపూర్, బొల్లారం ప్రాంతాల్లో అడవులు దట్టంగా ఉన్నాయి. ఎల్లారెడ్డి అటవీ డివిజన్ పరిధిలో నిత్యం ఏదో ఒక చోట అడవుల నరికివేత కొనసాగుతూనే ఉంటుంటోంది. దాంతో రోజురోజుకూ అడవులు అంతరించి పోతున్నాయి.

ఫర్నీచర్ రూపంలో అక్రమ రవాణా

కలప అక్రమ రవాణాకు అలవాటు పడ్డ కొందరు వ్యక్తులు తరలింపులో కొత్తపుంతలు తొక్కుతున్నారు. గతంలో అడవులలో ఏపుగా పెరిగిన టేకు చెట్లను నరికి దుంగలుగా మార్చి వాహనాలలో పట్టణ ప్రాంతాలకు తరలించి కొంతమంది సొమ్ము చేసుకునేవారు. కానీ నేడు అటవీ అధికారులకు చిక్కకుండా ఫర్నీచర్ రూపంలో కలపను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని గాందారి, లింగంపేట, నాగిరెడ్డిపేట మండలాల్లోని పలు గ్రామాల్లో కొందరు వ్యక్తులు ఫర్నీచర్‌ను తయారు చేస్తున్నట్లు సమాచారం. కలప అక్రమ రవాణాకు అలవాటు పడ్డ కొందరువ్యక్తులు టేకు కలపతో సోఫాలు, డైనింగ్ టేబుళ్లు, మంచాలు, తదితర గృహోపయోగ వస్తువులను తయారు చేసి పట్టణ ప్రాంతాలలో విక్రయించి భారీ మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. మార్కెట్లో టేకు కలపకు భారీ డిమాండ్ ఉండడంతో పట్టణ ప్రాంతాలకు చెందిన ఉద్యోగులు, రాజకీయ పార్టీల నేతలు కలప స్మగ్లర్ల నుండి ఫర్నీచర్‌ను కొనుగోలు చేస్తున్నట్లు తెలిసింది.

నిఘా అంతంతే..

అడవుల సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలను వెచ్చిస్తుండగా అడవుల సంరక్షణలో అటవీశాఖ అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలున్నాయి. అడవులు, అటవీ భూముల సంరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నా కొంమంది కింది స్థాయి సిబ్బంది మాత్రం అడవుల సంరక్షణ పట్ల శ్రద్ధ కనబర్చడం లేదు. గ్రామీణ ప్రాంత అడవుల నుండి లక్షల విలువ చేసే టేకు చెట్ల నరికివేతలు యథేచ్ఛగా సాగుతున్నా సంబంధిత అటవీ అధికారులు అరికట్టలేక పోతున్నారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇటీవల గాందారి మండలంలోని నాగ్లూర్ తండాతో పాటు మరికొన్ని తండాలలో అటవీ అధికారులు అక్రమంగా నిల్వ ఉంచిన టేకు దుంగలను స్వాధీనం చేసుకోవడంతో టేకు కలప అక్రమ రవాణా గుట్టు రట్టయ్యింది.

వాహనాలున్నాయి కానీ..

2014లో రాష్ట్ర ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన టీఆర్ఎస్ ప్రభుత్వం అడవుల అభివృద్ధి అత్యంత ప్రాధాన్యతనిచ్చింది. హరితహారం పేరిట రాష్ట్ర వ్యాప్తంగా కోట్లాది మొక్కలను నాటించింది. స్మగ్లర్ల బారి నుండి అడవులను కాపాడడం కోసం ప్రభుత్వం అటవీ శాఖ సిబ్బందికి ద్విచక్ర వాహనాలను సమకూర్చింది. ఉద్యోగం ఉన్న చోటనే నివాసం ఉండాలని ఆదేశాలు జారీ చేసింది. కానీ అటవీ శాఖ సిబ్బంది కొందరు గ్రామాలలో నివాసం ఉండక పట్టణ ప్రాంతాలలో ఉంటున్నట్లు తెలుస్తోంది. దాంతో నిఘా కొరవడి అడవుల నరికివేత దర్జాగా సాగుతుందనే ఆరోపణలున్నాయి. పగటి పూట టేకు చెట్లను నరికి దుంగలుగా మార్చి రాత్రివేళ అడవుల నుంచి గ్రామాలకు తరలిస్తున్నారు. మానవాళి మనుగడకు ఎంతో దోహదం చేసే అడవులను స్మగ్లర్ల బారి నుండి సంరక్షించాల్సినఅవసరం అటవీశాఖ అధికారులపై ఎంతైనా ఉందని, ఇప్పటికైనా కలప అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

నిఘా పెంచుతాం

ఎల్లారెడ్డి అటవీ డివిజన్‌లో చిన్నచిన్న చెట్లను కొందరు నరుకుతున్నారు. అలాంటివి గుర్తించి నిందితులపై కేసులు నమోదు చేస్తున్నం. వాహనాలను కూడా సీజ్ చేస్తున్నం. ఎప్పటికప్పుడు అటవీ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నం. చెట్లను నరికే వారిపై మున్ముందు కఠినంగా వ్యవహరిస్తం. రాత్రి వేళల్లో ప్రత్యేక బృందాలతో పెట్రోలింగ్ నిర్వహించి నిఘా పెంచుతాం. అడవుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి.

- అనురాధ, రేంజ్ అధికారిణి, ఎల్లారెడ్డి

గోదా రంగనాథ కల్యాణం

నల్లగొండ, వెలుగు: గోదా, రంగనాథ స్వామి కల్యాణాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లగొండ పట్టణంలోని రామాలయంలో అర్చకుల వేదమంత్రోచ్ఛరణల మధ్య కల్యాణాన్ని జరిపించారు. అంతకుముందు కలెక్టర్ గౌరవ్ ఉప్పల్, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిలు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వర ఆలయం, తుంగతుర్తి మండల కేంద్రంలోని పట్టాభి రామాలయంలో గోదా దేవి, శ్రీనివాసుల కల్యాణాన్ని నిర్వహించారు. సూర్యాపేటలో ఎమ్మెల్యే జి. జగదీశ్‌రెడ్డి దంపతులు ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. తుంగతుర్తిలోని పట్టాభిరామ ఆలయంలో జరిగిన కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



సూర్యాపేటలో పట్టువస్త్రాలు సమర్పిస్తున్న జగదీశ్‌రెడ్డి దంపతులు



వైభవంగా రథోత్సవం

హుజూర్‌నగర్, వెలుగు: మేళ్లచెర్వు మండల కేంద్రంలో సోమవారం వేంకటేశ్వర స్వామి రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం 311 కలశాలతో కలశ పూజ చేసిన అనంతరం మహిళా వాటిని ఎత్తుకొని గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. సాయంత్రం ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు.



హోరాహోరీగా సాగుతున్న జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలు

ప్రీ క్వార్టర్‌కు తెలంగాణ జట్లు

సిద్దిపేట, వెలుగు: సిద్దిపేట డిగ్రీ కాలేజీ గ్రౌండ్‌లో జరుగుతున్న అండర్ 17 బాలబాలికల జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నయి. మూడోరోజు జరిగిన పోటీలను మున్సిపల్ చైర్మన్ రాజనర్సు ప్రారంభించగా డీఈఓ రమాకాంతరావు, ఓఎస్డీ బాలరాజు మ్యాచ్‌లు చూశారు. బాలుర, బాలికల విభాగాల్లో తెలంగాణ జట్లు ప్రీ క్వార్టర్ ఫైనల్‌కు చేరినయి. బాలుర జట్టులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, జమ్మూకాశ్మీర్, మహారాష్ట్ర, ఢిల్లీ, హర్యానా, పుదుచ్చేరి, గుజరాత్ జట్లు, బాలికల విభాగంలో తెలంగాణ, ఒడిశా, ఉత్తర ప్రదేశ్, చండీగఢ్, ఢిల్లీ, వెస్ట్ బెంగాల్, బీహార్, రాజస్థాన్ జట్లు ప్రీ క్వార్టర్ ఫైనల్‌కు చేరాయి. అంతకు ముందు బాలికల విభాగంలో ఒడిశా జట్టు కేరళపై, తెలంగాణ జట్టు పంజాబ్‌పై, ఉత్తరప్రదేశ్ జట్టు మహారాష్ట్రపై బాలుర విభాగంలో ఒడిశాపై జమ్మూ కాశ్మీర్, మధ్యప్రదేశ్‌పై ఏపీ, తమిళనాడుపై తెలంగాణ జట్లు విజయం సాధించాయి. సోమవారం రాత్రి మైదానంలో బోన్ ఫైర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన ఆటగాళ్లు, కోచ్‌లు, రిఫరీలు, అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ముసలవ్వ సర్పంచ్ అయింది

65 ఏళ్లలో ఏకగ్రీవంగా ఎన్నికైన సాయమ్మ



మహబూబ్‌నగర్, వెలుగు: ఓ 65 ఏండ్ల వృద్ధురాలు గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైంది. మాగనూరు మండలం గురావ్‌లింగపల్లి గ్రామంలోని కుమ్మరి సాయమ్మ 65 ఏళ్లపైనే ఉంటుంది. అయితేనేం గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా గెలిచి పాలమూరు జిల్లాలో అరుదైన రికార్డు సాధించింది. ఇప్పటి వరకు ఈ వయస్సున్న సర్పంచ్‌లు ఎవరూ లేరు. గ్రామస్తుల మద్దత్తుతో సర్పంచ్ స్థానాన్ని ఏకగ్రీవంగా కైవసం చేసుకుంది. బీసీ మహిళకు రిజర్వ్ అయిన ఈ స్థానంలో అందరూ కుమ్మరి సాయమ్మ పేరు ప్రతిపాదించడంతో గ్రామస్తులంతా ఏకతాటిపై నిలబడి ఆమెను సర్పంచ్‌గా గెలిపించుకున్నారు. వార్డు సభ్యులు కూడా ఏకగ్రీవం కావడంతో ఆ గ్రామంలో సంక్రాంతి సంబరాలతో పాటు విజయోత్సవ సంబరాలు కూడా జరుపుకుంటుంది.

ఏకగ్రీవం.. అభినందనీయం

మహిళలకు సర్పంచ్‌పదవి అప్పగించడం వల్ల గ్రామం మరింత అభివృద్ధి చేసుకునే అవకాశాలుంటాయని ఎమ్మెల్యే చిట్టెం రాంమెహన్‌రెడ్డి అన్నా రు. సోమవారం కుమ్మరి సాయమ్మను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులంతా ఒక్కటై ఏకగ్రీవం చేసుకోవడం అభినందనీయమన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాగనూరుకు చెందిన బీజేపీ కార్యకర్తలు టీఆర్ఎస్‌లో చేరారు.

పండుగకు పైసల్లేవ్

ఎయిడెడ్ టీచర్లకు వేతన కష్టాలు ● పలు జిల్లాల్లో మూడు నెలలుగా పెండింగ్

ఊరంతా సంబురాలు చేసుకుంటాంటె తమ పిల్లలు మాత్రం మంది ముఖం చూడాల్సి వస్తున్నదని ఎయిడెడ్ టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నరు. ప్రతినెల సర్కారు ఉద్యోగుల మాదిరిగానే వేతనాలిస్తామని చెప్పిన పెద్దసార్లు మాట మరిచిండ్లు. దాంతో రాష్ట్రంలో ఎయిడెడ్ టీచర్లు, సిబ్బందికి మూడు నెలలుగా జీతాలు రావడం లేదు. సంక్రాంతి పండుగ నాటికైనా శాలరీ వస్తుందని ఆశించిన వారికి నిరాశే ఎదురైంది.

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలో మొత్తం 691 ఎయిడెడ్ పాఠశాలల్లో 1.10లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీటిలో కొన్ని స్కూళ్లు టీచర్లు లేక మూతపడ్డాయి. చాలా మంది రిటైర్డ్ కావడం, కొత్తగా రిక్రూట్‌మెంట్ లేకపోవడంతో ప్రస్తుతం 3 వేల మంది టీచర్లు, 15వందల మంది సిబ్బంది మాత్రమే ఉన్నారు. వీరికి నెల నెల జీతం రాకపోవడంతో ఆందోళనతో చేయగా, అప్పట్లో ప్రభుత్వ పెద్దలు రెగ్యులర్‌గా వేతనాలిస్తామని ప్రకటించారు. బడ్జెట్ తక్కువగా కెటాయించడంతో పలు జిల్లాల్లో అక్టోబర్ నుంచి వేతనాలు నిలిచాయి. రెండు మూడు నెలల వేతనాలు ఒకేసారి (జనవరి ఫస్ట్‌కు) వస్తాయని, పండుగకు చేతినిండా పైసలుంటాయని భావించిన టీచర్లకు నిరాశ మిగిలింది. దీనికితోడు 18 నెలల పీఆర్సీ ఏరియర్స్ కూడా పెండింగ్‌లోనే ఉన్నాయి.

అధికారుల నిర్లక్ష్యంతోనే..

ఎయిడెడ్ స్కూళ్ల టీచర్లు సగం మందికి పైగా హైదరాబాద్ జిల్లాలోనే ఉంటున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో వీరి వేతనాలకు సరిపడ బడ్జెట్‌ను ప్రభుత్వం గతంలోనే విడుదల చేసినట్టు తెలిసింది. అయితే కొంతమంది అధికారుల నిర్లక్ష్యంతో సకాలంలో వేతనాలు అందడం లేదన్న ఆరోపణలున్నాయి. ప్రతినెల 20వ తేదీ లోపు పీఏఓ ఆఫీస్‌లో వేతనాలకు సంబంధించిన ఫైళ్లు సబ్మిట్ చేయాల్సిఉండగా అధికారులు ఆలస్యం చేస్తున్నట్టు తెలుస్తోంది. దాంతో అక్టోబర్ నుంచి జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. నిజామాబాద్, ఆదిలాబాద్‌తో పాటు ఇతర జిల్లాల్లో బడ్జెట్ లేక నవంబర్, డిసెంబర్ జీతాలు అందుకోలేకపోయారు. ఎయిడెడ్ టీచర్ల కుటుంబాల్లో సంక్రాంతి సంబరం లేకుండాపోయింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నెలనెలా వేతనాలు ఇవ్వాలని కోరుతున్నారు.



ఉన్నతాధికారులు చొరవ చూపాలి

ఎయిడెడ్ స్కూళ్లలో మొత్తం 7వేల టీచర్ పోస్టులున్నాయి. ప్రస్తుతం 3 వేల మందే పనిచేస్తున్నారు. అయినా నెలనెలా వేతనాలు ఇస్త లేరు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తే మళ్లీ ఇలా కాకుండా చూస్తామంటున్నారు. తర్వాత పరిస్థితి యధాతథంగా ఉంటోంది. ఇప్పటికైనా ప్రతినెలా వేతనాలిచ్చేలా ఉన్నతాధికారులు చొరవ చూపాలి.

- చావ రవి, యూటీఎఫ్ స్టేట్ సెక్రెటరీ

ఐర్లాండ్ టు ఎడపల్లి

సర్పంచు బరిలోకి దిగిన ఇంజనీర్

నిజామాబాద్, వెలుగు: విదేశాల్లో కొలువు.. లక్షల్లో జీతం.. వదులుకుని తాను పుట్టిన ఊరికి సేవ చేయాలని వచ్చిందో యువతి. తండ్రి రాజకీయ వారసత్వాన్ని అందుకుని ఊరి బాగు కోసం ముందుకొచ్చింది. అందరూ ఆదర్శంగా చెప్పుకునేలా తమ పంచాయతీని తీర్చిదిద్దుతానని విశ్వాసంతో చెప్తోంది. ఆమె నిజామాబాద్ జిల్లా ఎడపల్లికి చెందిన సుష్మితానాయుడు. ఆమె సర్పంచు అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఎడపల్లి మండల కాంగ్రెస్ నాయకుడు శంకర్‌నాయుడు కుమార్తె అయిన ఆమె రిజర్వేషన్ అనుకూలంగా రావడంతో ఎన్నికల బరిలోకి దిగారు. సుష్మిత ఐర్లాండులోనే ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్‌లో 2017 లో ఎంబిఏ పూర్తి చేసారు. అక్కడే హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ అనే సంస్థలో టెక్నికల్ సపోర్ట్ ఇంజనీర్ గా పని చేస్తున్నారు. లక్షల్లో ప్యాకేజీ అందుకుంటున్నారు. ఆమె అక్క కూడా ఐర్లాండ్ లోనే జాబ్ చేస్తోంది.



సుష్మిత తండ్రి శంకర్ నాయుడు కాంగ్రెస్‌లో వివిధ హోదాల్లో పని చేశారు. 1995 లో మొదటిసారి ఎడపల్లి సర్పంచుగా ఎన్నికయ్యారు. 2013లో రెండోసారి గెలచి మొన్నటిదాకా సర్పంచుగా ఉన్నారు. ఎంపీటీసీగా పని చేశారు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీ కేన్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ గా కూడా వ్యవహరించారు. సుష్మిత తల్లి రోజారాణి జుక్కల్‌లో ఆరోగ్యశాఖలో నర్సుగా పని చేస్తున్నారు. తన తల్లి నుంచి సహనాన్ని, తండ్రి నుంచి ప్రజలకు సేవ చేసే లక్షణాన్ని పొందినట్టు సుష్మిత చెప్తున్నారు.

ఆదర్శంగా తీర్చిదిద్దుతా...
సుష్మితా నాయుడు

అందరూ ఆదర్శంగా చెప్పుకునేలా ఎడపల్లిని తీర్చిదిద్దుతా. రిజర్వేషన్ వల్ల నాకు అవకాశం వచ్చింది. తప్పకుండా విజయం సాధిస్తా.. తెలంగాణలో సంక్షేమ పథకాలు కొనసాగుతున్నాయి. అవన్నీ ప్రజలకు అందేలా చూస్తా. చదువుకున్న వారు పాలన చేస్తే గ్రామాలెలా అభివృద్ధి చెందుతాయో నిరూపించేలా పని చేస్తా. ఐర్లాండు బాగా అభివృద్ధి చెందింది. ఆ తరహాలో పనులు చేపడతా.

తండ్రి తొలి సర్పంచ్.. కొడుకు చివరి సర్పంచ్

'పంచాయతీ'లో తండ్రీకొడుకుల అరుదైన రికార్డు

నిజామాబాద్ జిల్లాలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. అరుదైన రికార్డులకు వేదికగా నిలుస్తున్నాయి. భీమ్‌గల్ తాజాగా మున్సిపల్‌గా మారింది. దాంతో ఈ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న సంతోష్‌నగర్ తండా, సుదర్శన్‌నగర్ తండాలు ప్రత్యేక గ్రామపంచాయతీలుగా మారాయి. తాజాగా జరుగుతున్న మొదటి విడత ఎన్నికల్లో కొత్తగా ఏర్పడ్డ సంతోష్‌నగర్ తండాకు పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఇక్కడ సర్పంచ్‌గా ఎంజీ నాయక్ ఎన్నికయ్యారు. సంతోష్‌నగర్ తండాకు తొలి సర్పంచ్‌గా ఎంజీ నాయక్ ఎన్నికై రికార్డు సృష్టించాడు. అయితే ఐదేళ్ల క్రితం భీమ్‌గల్ గ్రామపంచాయతీకి సర్పంచ్‌గా ఎంజీ నాయక్ కొడుకు రవినాయక్ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఇప్పుడు రవినాయక్ తండ్రికి ఎంజీ నాయక్‌కు కూడా సర్పంచ్ పదవి కొత్తగా తండాలు ఏర్పడటంతోనే వచ్చింది. 2014 లో భీమ్‌గల్ గ్రామపంచాయతీ ఎస్టీ జనరల్‌కు కేటాయించారు. సంతోష్‌నగర్ తండాకు చెందిన రవినాయక్ భీమ్‌గల్ సర్పంచ్ పదవికి ఎవరి మద్దతు లేకుండా ఇండిపెండెంట్‌గా పోటీ చేసి మంచి మెజార్టీతో గెలిచాడు. ఏ రాజకీయ పార్టీ ఊహించని రీతిలో గెలిచి భీమ్‌గల్ సర్పంచ్‌గా ఐదేళ్లు పని చేశారు. గ్రామ పంచాయతీ వ్యవస్థ ఏర్పడినప్పటి నుండి భీమ్‌గల్ సర్పంచ్‌గా గాడి వంశానికి చెందినవారే కొనసాగితే, భీమ్‌గల్ చరిత్రలో గాడి వంశేతర సర్పంచ్‌గా రవినాయక్ ఐదేళ్లు పనిచేయడం ఒక రికార్డు. భీమ్‌గల్ గ్రామ పంచాయతీకి చివరి సర్పంచ్‌గా రవినాయక్ చరిత్రలో మరో రికార్డుగా నిల్చింది. కాగా రవి నాయక్ తండ్రి సంతోష్‌నగర్ తండాకు మొదటి సర్పంచ్‌గా రికార్డులో నిలువడం విశేషం.



పాతకక్షలతో చంపుదామనుకున్నరు

ఆశప్ప హత్య కేసులో నిందితుల అరెస్ట్..

మహబూబ్ నగర్, వెలుగు: పాతకక్షలతో ఓ వ్యక్తిపై హత్యాయత్నం చేసిన నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఎస్పీ రెమా రాజేశ్వరి మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 9వ అభంగాపూర్ గ్రామానికి చెందిన జే ఆశప్ప (అశోక్) పై జరిగిన హత్యాయత్నం కేసులో 10 నిందితులను అదుపులోకి తీసుకుని, రిమాండ్ కు తరలించామన్నారు. నారాయణపేట సబ్ డివిజన్ లిమిట్స్ లో మరికల్ వద్ద హత్యాయత్నం జరిగిందని, కొంచెంలో చావు నుంచి ఆశప్ప బయటపడ్డాడన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు విజయ్ తో సహా పది మందిని అదుపులోకి తీసుకుని రిమాండ్ కు తరలించామన్నారు. హత్యాయత్నానికి ఉపయోగించిన వేటకోడవళ్లు ఒక పిస్టల్, బుల్లెట్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ వేంకటేశ్వర్లు, నారాయణపేట డీఎస్పీ శ్రీధర్, మరికల్ ఇన్‌స్పెక్టర్ ఇఫ్తేకార్ అహ్మద్ తదితరులు ఉన్నారు.



హత్యాయత్నం కేసులో నిందితుల వివరాలు మీడియాకు తెలియజేస్తున్న మహబూబ్‌నగర్ ఎస్పీ రెమా రాజేశ్వరి

బీఎస్పీ–ఎస్పీ కలిస్తే తప్పేంది?

ఎన్నికల్లో గెలవడానికి ఎన్ని వ్యూహాలైనా పన్నొచ్చనే, ఎవరు ఎవరితోనైనా కూటమి కట్టవచ్చనే ఒక సాధారణ రాజకీయ ఆమోదం చాలా కాలంగా అమల్లో ఉన్నది. ఆ మాటకొస్తే కశ్మీర్‌లో ముస్లిం పార్టీ అయిన పీడీపీతో బీజేపీ పొత్తు పెట్టుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. బీజేపీ తనకు తప్ప మిగతా అన్ని పార్టీలకీ నైతిక సూత్రాలను అంటగడుతుంది మరి! తాను ఎన్నికల్లో విజయం సాధించడానికి ప్రత్యర్థుల మీద నిరాధారమైన ఆరోపణలు చేయడం, రాజకీయ ప్రత్యర్థులపై సీబీఐ లాంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలను ప్రయోగించడంలో బీజేపీ నైతికత ఎంత? అలాంటి పార్టీ ఇప్పుడు బీఎస్పీ–ఎస్పీ పొత్తు గురించి ఇంతలా ఆందోళన చెందడానికి కారణాలేంటి?



బీజేపీకి ఎందుకింత భయం?

బీజేపీ ఎందుకింతలా భయపడుతోందో అర్థంకావాలంటే ఒకసారి 2014 నాటి లెక్కల్ని పరిశీలించాలి. గత సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో బీఎస్పీకి 19.62 శాతం, ఎస్పీకి 22.18, ఆర్ఎల్‌డీకి 0.83 శాతం ఓట్లు దక్కాయి. ఈ మూడింటినీ కలిపితే మొత్తం 43 శాతం ఓట్లు వచ్చాయన్నమాట. అదే యూపీలోని మొత్తం 80 సీట్లలో 71 స్థానాలను గెలుచుకున్న బీజేపీకి దక్కినవి 42.3 శాతం ఓట్లు మాత్రమే. ఆ ఎన్నికల్లో బీఎస్పీకి ఒక్క సీటు కూడా రాలేదు. ఎస్పీకి 5 సీట్లు దక్కాయి. 40కిపైగా స్థానాలతో బీఎస్పీ రెండో స్థానంలో నిలబడగలిగింది. ఆ సీట్లన్నీ కేవలం రెండు నుంచి నాలుగు వేల ఓట్ల తేడాతో పోగొట్టుకున్నవే. బీఎస్పీ, ఎస్పీ విడివిడిగా పోటీ చేయడం వల్ల మాత్రమే బీజేపీ మెజారిటీ సీట్లు గెలుచుకోగలిగింది. 2009లో ఆ పార్టీకి పది స్థానాలు మాత్రమే ఉండేవి. గుజరాత్ ధనవంతుల సహకారంతో మోడీని అభివృద్ధికి ఐకాన్‌గా, దేశరక్షకుడిగా చిత్రీకరిస్తూ చేసిన ప్రచారం ఓటర్లను ప్రభావితం చేసింది నిజమే అయినా, యూపీలో మాత్రం ఆయన గెలుపుకు బీఎస్పీ-ఎస్పీ ఓట్ల చీలికే కారణం. ఉత్తరప్రదేశ్‌లో ఎవరు ఎక్కువ సీట్లు గెలిస్తే వాళ్లే ప్రధాని కావడం ఖాయం. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఆ రాష్ట్రంలో యాభై సీట్లు వస్తే తప్ప మోడీ ప్రధాని కాలేడు. ఈ మలి దశ కూటమి వల్ల బీజేపీకి అన్ని సీట్లు రావటం కష్టం. అంతేకాదు, 'మరోసారి మోడీనే ప్రధాని' అనే నినాదం కూడా బలహీనపడిపోతుంది. అందుకే బీజేపీ శిబిరంలో కలకలం రేగింది.



తమ రాజకీయ జీవితంలో ఎలాంటి నైతిక ప్రమాణాలనూ పాటించని ఎంతో మంది మాయవతి-అఖిలేశ్ యాదవ్‌ల ఎన్నికల పొత్తు గురించి నైతిక కోణంలో విమర్శలు చేస్తున్నారు. ఇక్కడే మనం ఫిలాసఫర్ జాన్ స్టువార్ట్ మిల్ మాటల్ని గుర్తుచేసుకోవాలి. 'మంచీ చెడులను వేరు చేసే ప్రమాణాల విషయంలో, అంతిమంగా ఒక నిర్ణయానికి రాగలగడంలో ఇప్పటిదాకా మనం చూపిన ప్రగతి చాలా తక్కువ. ఫిలాసఫీ ప్రారంభం నుంచే 'పరమహితం' అనేది ప్రధాన పాత్ర పోషిస్తూ వచ్చింది. ఆ ఆలోచన ఎందరినో ఆకట్టుకొని, వాళ్లంతా వివిధ తెగలుగా, పీఠాలుగా విడిపోవడానికి కారణమైంది. తర్వాతిక్రమంలో వాళ్లు ఒకరిపై ఒకరు ఎడతెగని పోరాటం చేస్తూ వచ్చారు. రెండు వేల ఏళ్ల తర్వాత కూడా అదే చర్చ నడుస్తోంది. బహుజన హితానికి, జనామోదం పొందిన నైతికతకి మధ్య వాదులాట ఇప్పటికీ కొనసాగుతోంది. ఈ విషయంలో ఎవరూ నిశ్చితాభిప్రాయానికి రాలేకపోయారు' అన్నది స్టువార్ట్ మాట.

ఇలా నైతిక ప్రవర్తన గురించి రాజకీయ నాయకులు మాట్లాడటం అవకాశవాదమని జాన్‌స్టువార్ట్ మిల్ అభిప్రాయం. ఈ వ్యాఖ్య మన ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోడీకి కూడా వర్తిస్తుంది. కానీ ఆయనే బీఎస్పీ-ఎస్పీ పొత్తును అవకాశవాదమని తిట్టిపోస్తున్నారు. ఈ పొత్తుకు ఎలాంటి రాజకీయ పవిత్రత లేదని మోడీ, అమిత్‌షా ఇద్దరూ వాదిస్తున్నారు. అంతేకాదు ఒక వర్గం మీడియా కూడా ఈ పొత్తును అపవిత్ర కలయికగా చిత్రించడానికి ప్రయత్నిస్తోంది.

మాయావతిని ప్రధాని అభ్యర్థిగా అఖిలేశ్ యాదవ్ అంగీకరించాడు. దేశంలోని ఇతర పార్టీలు కూడా మాయావతిని అంగీకరిస్తే మోదీ తిరిగి అధికారంలోకి రావడం అసాధ్యం. కాంగ్రెస్ పార్టీ.. రాహుల్ గాంధీని ప్రధాని అభ్యర్థిగా ప్రకటించి ముందుకు వెళ్లాలనే ఉత్సాహం చూపట్లేదు. కాంగ్రెస్ కేంద్రంగా కలిసొచ్చే పార్టీలను కలుపుకొని కూటమిని ఏర్పాటు చేయాలని రాహుల్ చేసే ప్రయత్నాలు సఫలమయ్యేలా లేవు. ఇవి కాంగ్రెస్‌కు నష్టం చేసి తీరతాయి. అటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో బీజేపీ ఇంకా బలంగానే ఉంది. తెలంగాణ తప్ప మొన్నటి ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఫలితాల్లోనూ ఆ విషయం క్లియర్‌గా కనిపించింది. ఆయా రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు పెద్ద సంఖ్యలో సీట్లు వస్తాయని చెప్పలేం. మోడీ పట్ల వ్యతిరేకతను కాంగ్రెస్ తనకు అనుకూలంగా మార్చుకోవడంలో విఫలమైంది. రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లలో తొలుత మద్దతు ఇస్తానన్న బీఎస్పీపై కాంగ్రెస్ నేతలు నోరుపారేసుకున్నారు. రాహుల్ నెమ్మదిగా పుంజుకుంటున్నప్పటికీ మోడీకి ప్రత్యామ్నాయం అనేంత స్థాయికి ఇంకా చేరుకోలేదు. దీన్ని బట్టి అర్థమయ్యేదేమంటే మోడీని ఎదుర్కొనే శక్తి ప్రస్తుతానికి కాంగ్రెస్‌కు లేదు. మాయవతి, అఖిలేశ్ ఇద్దరు మాత్రమే మోడీని నిలువరించి, ఓడించగలరు. అందుకే ఆ ఇద్దరి ఐక్యతను చూసి మోడీ బెంబేలెత్తిపోతున్నాడు. సర్వజనహితం కోరి మాయావతి తీసుకున్న పొత్తు నిర్ణయంపై దేశంలోని బహుజనుల నుంచి సానుకూల స్పందన వ్యక్తమవుతోంది.



– డా. జిలుకర శ్రీనివాస్

ఏమన్నారంటే



చార్జిషీట్ సంతోషం

దేశద్రోహం నెపంతో మాపై కేసులు పెట్టి మూడేళ్లు గడిచాయి. ఎన్నికలు వస్తున్నాయి కాబట్టి చార్జిషీట్ వేశారు. ఇప్పటికైనా ఆ పని చేసిందుకు సంతోషం.


–కన్హయ్య కుమార్, విద్యార్థి నాయకుడు.



స్పీల్‌బర్గ్‌తో సినిమా చేస్తానేమో!

క్రికెట్‌తోపాటు సినిమాలన్నా నాకు ప్రాణం. స్పీల్‌బర్గ్ డైరెక్షన్‌లో నటించాలని ఉంది. చెప్పలేం. జీవితంలో ఏదైనా జరగొచ్చు.

– శ్రీశాంత్, మాజీ క్రికెటర్.



రాజు జెంటిల్మెన్

డైరెక్టర్ రాజ్‌కుమార్ హిరానీ చాలా డీసెంట్ పర్సర్. అలాంటి వ్యక్తిపై లైంగిక వేధింపుల ఆరోపణలు రావడంతో బాధపడ్డాను.


– దియా మిర్జా, నటి.



మోడీతో పోటీకి ఆ ఇద్దరూ చాలు

వచ్చే ఎన్నికల్లో మోడీని గద్దెదింపడానికి మాయావతి, అఖిలేశ్ యాదవ్ చాలు. బీజేపీని ఓడించాలన్న శ్రద్ధ కాంగ్రెస్‌కు లేదు.

- తేజస్వీ యాదవ్, ఆర్జేడీ నేత.




ఆయనకు కన్నుగీటలేను!

రణ్‌వీర్ సింగ్ నా ఫేవరెట్ యాక్టర్. నేను కన్నుగీటిన స్టైల్ బాగుందని చెప్పాడు. ఆల్రెడీ పెళ్లైంది కాబట్టి ఆయనకు కన్నుగీటే చాన్స్ మిస్ అయ్యా.

– ప్రియా ప్రకాశ్ వారియర్, నటి.





బాలీవుడ్ సిన్మాలకు లోకల్ దెబ్బ




లోకల్ సినిమా విస్తరిస్తోంది. యూనివర్సల్ కన్సెప్ట్‌తో తెరకెక్కిన ప్రాంతీయ సినిమాలు బాలీవుడ్ బాక్సాఫీస్‌ను షేక్ చేస్తున్నాయి. రోబో, బాహుబలి సిరీస్, 2.0, కేజీఎఫ్.. లాంటి దక్షిణాది సినిమాలు కలెక్షన్ల పరంగా ఒరిజినల్ హిందీ మార్కెట్‌ను దెబ్బకొట్టాయి. ఈ రెండేళ్ల కాలంలో వంద కోట్లకు పైగా వసూళ్లు రాబట్టిన హిందీ చిత్రాలను వేళ్ల మీదే లెక్కించొచ్చు. బాలీవుడ్‌లో గ్రాండ్ సినిమాలుగా చెప్పుకునేవాటిని సైతం సౌత్ సినిమాలతో పోల్చుకుంటున్నారు హిందీ ప్రేక్షకులు. ఈ మార్పు లోకల్ సినిమా నిర్మాతల్లో జోష్ నింపింది. భారీ బడ్జెట్‌సినిమాలు తీసేందుకు వాళ్లను పురికొల్పింది.


గతంలో అడపాదడపా నార్త్‌లో సౌత్ సినిమాలు హిట్టైనా, ఇప్పటి మార్కెట్‌కు అనుగుణంగా భాషా పరమైన సరిహద్దులను పూర్తిగా చెరిగిపోవడం రజనీకాంత్-శంకర్ కాంబోలో వచ్చిన 'ఎంథిరన్' సినిమాతో మొదలైందని చెప్పొచ్చు. అయితే కలెక్షన్ల పరంగా బాలీవుడ్ మార్కెట్‌లో 'రోబో' బేర్‌మంది. రాజమౌళి 'బాహుబలి' రాకతో పరిస్థితి ఇంకా మారిపోయింది. బాహుబలి ది బిగినింగ్ సినిమా హిందీ రైట్స్ రూ. 7.5 కోట్లకు అమ్ముడుపోతే.. ఏకంగా రూ. 60 కోట్లకు పైగా వసూలు చేసింది. బాహుబలి ది కంక్లూజన్ రూ.500 కోట్లకుపైగా (నెట్) కలెక్షన్స్ కొల్లగొట్టిన ఏకైక చిత్రంగా బాలీవుడ్ చరిత్రపుటలకెక్కింది. మంచి సినిమాలు తీస్తే బాలీవుడ్ మార్కెట్‌నూ గ్రాబ్ చేయొచ్చన్న ఆలోచన లోకల్ సినిమా రూపకర్తల్లో జోష్ నింపింది. ఒకప్పుడు కన్నడసినిమా(శాండల్‌వుడ్)ఇండస్ట్రీలో బడా హీరో సినిమా బడ్జెట్ ఇరవై కోట్లు దాటేదికాదు. అలాంటిది 'కేజీఎఫ్ చాప్టర్-1' సినిమాని ఏకంగా 80 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి తీశారు. యూనిక్ కంటెంట్‌తో తెరకెక్కిన 'కేజీఎఫ్' హిందీ వెర్షన్.. షారూఖ్ ఖాన్ 'జీరో'తో పోటీ పడి వసూళ్లు కొల్లగొట్టడం విశ్లేషకులను సైతం ఆశ్చర్య పరిచింది. హిందీలోకి డబ్ అయిన సౌత్ సినిమాల్లో వసూళ్ల పరంగా బాహుబలి-1, బాహుబలి-2, 2.0, తర్వాత నాలుగో స్థానంలో కేజీఎఫ్ నిలిచింది.

టీవీ, యూట్యూబ్‌లోనూ సౌత్ సెన్సేషనే!

థియేట్రికల్ రిలీజ్ ఉన్నా లేకున్నా.. బుల్లితెరపై డబ్బింగ్ సినిమాల హవా నడుస్తోంది. టాప్ హిందీ ఛానెళ్లన్నీ తెలుగు, తమిళ్ సినిమాల డబ్బింగ్ రైట్స్‌ను మంచి రేటు ఇచ్చి తీసుకుంటున్నాయి. ఇంకొన్ని సినిమాలు యూట్యూబ్‌లో ఇరగాడేస్తున్నాయి. మన సౌత్ స్టార్లు కొందరికి నార్త్ ఇండియన్లు 'యూట్యూబ్ స్టార్'గా పేర్లు కూడా పెట్టేశారు. విచిత్రమేంటంటే, ఇక్కడ ఫట్ అయిన సినిమాల్లో కొన్నింటిని హిందీ ప్రేక్షకులు టీవీ, యూట్యూబ్‌లో ఎగబడి చూసేస్తున్నారు.








భారీ బడ్జెట్‌ల జోరు

బాలీవుడ్ మార్కెట్ ఇచ్చిన ధైర్యంతోనే మిగతా భాషల్లో నిర్మాతలు భారీ బడ్జెట్‌తో సినిమాలు నిర్మించేందుకు ముందుకొస్తున్నారు. యూనివర్సల్ కంటెంట్ సినిమాలను 'ఇండియన్ సినిమా' అంటూ ముందు నుంచే ప్రచారం చేసుకుంటున్నారు. ప్రమోషన్ సమయం నుంచే ఇతర భాషల్లోనూ హైప్ పెంచేసుకుంటున్నారు. సాధారణంగా భోజ్‌పురిలో ఐదారు కోట్ల బడ్జెట్‌కు మించి సినిమాలు తెరకెక్కవు. అలాంటిది 90 కోట్లతో 'వీర్ యోధ మహాబలి' సినిమాను తెరకెక్కిస్తున్నాడు దినేశ్ లాల్ యాదవ్ అనే హీరో. అల్లు అర్జున్ 'రేసుగుర్రం'లో మద్దాలి శివారెడ్డి పాత్రలో నటించిన భోజ్‌పురి నటుడు రవికిషన్ ప్రస్తుతం 'జీ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ'తో కలిసి వరుసగా 7 సినిమాలు చేయబోతున్నాడు. ఈ డీల్ విలువ 200 కోట్లు పైనే. బాలీవుడ్ మార్కెట్‌పై ఉన్న నమ్మకంతోనే మలయాళంలోనూ వంద కోట్లకు పైగా బడ్జెట్‌తో ఐదు సినిమాలు తయారవుతున్నాయి. మరాఠీ, బెంగాలీ, అస్సామీ, ధోలీవుడ్(గుజరాత్), పాలీవుడ్(పంజాబ్) భాషల్లోనూ.. ఆయా సినిమాల మార్కెట్ స్థాయికి మించి బడ్జెట్‌తో సినిమాలు ఇప్పుడు తెరకెక్కుతున్నాయి.

ఆకలి చావులను ఆపని పథకాలు



దేశంలో పేదల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నాయి. కానీ, అవి అర్హులైన అందరికీ చేరట్లేదు. జార్ఖండ్‌లో 2017 సెప్టెంబర్ నుంచి ఇప్పటివరకు కనీసం 18 మంది ఆకలితో చనిపోయారు. స్వతంత్ర దర్యాప్తుల నివేదికలు, మీడియా రిపోర్టులను బట్టి వీళ్లంతా తినటానికి తిండిలేక ప్రాణాలు కోల్పోయినట్లు తేలింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం దీన్ని ఒప్పుకోవట్లేదు. ఆకలి చావులు తమ దృష్టికి రాలేదంటూ తప్పించుకుంటున్నాయి.

జార్ఖండ్‌లో ఆకలి చావులపై మీడియా వార్తలు ప్రభుత్వ విచారణలో రుజువు కాలేదన్న కేంద్రం ఆ దర్యాప్తుల వివరాలను వెల్లడించలేదు. ఆ రాష్ట్రంలో పేదలు తినటానికి తిండిలేక చనిపోతున్న విషయం తమ దృష్టికి రాలేదని కేంద్ర ఆహార, పౌర సరఫరాల సహాయ మంత్రి సీఆర్ చౌదరి పార్లమెంట్ సాక్షిగా చెబుతుంటే ఆ శాఖ మంత్రి రాంవిలాస్ పాశ్వానేమో ఈ మేరకు మరిన్ని వివరాలు పంపాలని 2018 డిసెంబర్ 25న అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖలు రాశారు.

దీనికితోడు, ఆకలి చావులపై ఇంగ్లిష్ పేపర్‌లో వచ్చిన వార్తలను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ పరిగణనలోకి తీసుకుంది. వాటి గురించి వాకబు చేయాలని జార్ఖండ్ గ్రామీణాభివృద్ధి విభాగాన్ని ఆదేశించింది. దీనికి స్పందించిన రాష్ట్ర రూరల్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ఒక్కో మృతికి కారణాలను వివరిస్తూ 2018 డిసెంబర్ 26న తొమ్మిది పేజీల నివేదికను పంపింది. ఆ మరణాలకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం(ఎంఎన్ఆర్ఈజీఏ)తో సంబంధం లేదని స్పష్టం చేసింది.

ఈ రిపోర్ట్‌పై జార్ఖండ్‌లోని ఆహార భద్రత హక్కు కార్యకర్తలు మండిపడ్డారు. పేదలు ఎందుకు చనిపోయారో విచారణ జరిపి తెలుసుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమీ పట్టనట్లు చేతులు దులిపేసుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఆహార భద్రత కల్పించటంలో విఫలమవటంపై విమర్శలు వస్తాయన్న భయంతోనే నిజాల జోలికి వెళ్లట్లేదని అభిప్రాయపడ్డారు.

పట్టెడన్నం పెట్టండి చాలు

ఆకలి చావులను సర్కారు సీరియస్‌గా తీసుకోవాలి. సంక్షేమ పథకాల అమలు తీరును పట్టించుకోవాలి. ఈ ఘటనలు మళ్లీ జరక్కుండా ఉండాలంటే పేదలకు పోషకాహారం అందించటానికి, ఉపాధి కల్పించటానికి ప్రాధాన్యమివ్వాలి. ప్రజా పంపిణీ వ్యవస్థపై ఎప్పటికప్పుడు రివ్యూ చేయాలి. ప్రతి నెలా రేషన్‌లో వంట నూనెలు, పప్పులు అందించాలి. అప్పుడే పేదలకు పట్టెడన్నం దొరుకుతుంది.

నాలుగేళ్లలో 60 మందికిపైనే..

ఆకలి చావులకు ప్రతిసారీ తమనే తప్పు పట్టకూడదని, ఒక్కోసారి రాష్ట్రాల వైఫల్యాలూ ఉంటాయని ఒప్పేసుకున్న కేంద్ర ప్రభుత్వం గత నాలుగేళ్లలో 60 మందికిపైనే ఆకలితో చనిపోయినట్లు వచ్చిన రిపోర్టులను ఉద్దేశపూర్వకంగానే బుట్టదాఖలు చేస్తోంది. ఇందులో కనీసం 30 మంది రేషన్, పెన్షన్ వంటి పథకాల సామాజిక ప్రయోజనాలు అందక తుది శ్వాస విడిచారు. అప్పుడప్పుడూ ఆధార్ కార్డ్ సంబంధ సమస్యలూ వాళ్లను వెంటాడాయి. జనం ఈవిధంగా సామాజిక, ఆర్థిక హక్కులు దక్కక ప్రాణాలు కోల్పోతుంటే బాధ్యులపై చర్యలు తీసుకోకుండా ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయి.

ఊపిరిపోయాక ఊడిపడ్డారు

లతేహర్ జిల్లా మహుయాదనర్ బ్లాక్‌లోని భగియా బిర్‌జైన్ అనే వృద్ధురాలు మూడు రోజులు మెతుకు ముట్టలేదు. ఇంట్లో నాలుగు వేళ్లు నోట్లోకి వెళ్లే పరిస్థితి లేదు. ఆమెకు రేషన్ కార్డు రాలేదు. ఆధార్ కార్డూ అందలేదు. పింఛన్‌కి పేరు రాయించినా రావట్లేదు. దీంతో భగియాకి బువ్వ కరువైంది. ఆమెది బిరిజియా అనే గిరిజన తెగ. వాళ్లను 'అంతరించిపోయే దశలో ఉన్న గిరిజన తెగ'(పర్టిక్యులర్లీ ఉల్నరబుల్ ట్రైబల్ గ్రూప్: పీవీటీజీ)గా గుర్తించారు. దేశంలో తక్కువ అభివృద్ధి చెందిన మొత్తం 75 ట్రైబల్ గ్రూపులను పీవీటీజీ కిందికి తెచ్చారు. పీవీటీజీని గతంలో ప్రిమిటివ్ ట్రైబల్ గ్రూప్ (ఆదిమ గిరిజన సమూహం) అనేవారు. గిరిజనుల జీవన స్థితిగతులను మెరుగుపరచటానికి కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ వర్గీకరణ చేసింది. పీవీటీజీలకు 'అంత్యోదయ అన్న యోజన'లో నెలకు 35 కేజీల బియ్యం ఫ్రీగా ఇస్తారు. ఈ స్కీంలో తనను చేర్చాలని భగియా కోరినా ఆఫీసర్లు వినలేదు. రేషన్ కార్డుకి అప్లై చేసిన ప్రతిసారీ ఏదో ఒక వంక పెట్టేవారు. ప్రధాని మోడీని కలవాలంటూ ఎగతాళి చేశారు. పెన్షన్ కోసమూ ఇలాగే తిరిగి అలిసిపోయింది. మార్కెట్ నుంచి ఆహార ధాన్యాలను తెచ్చుకోవటం భగియాకి కష్టంతో కూడిన పని. ఆరేళ్ల క్రితం కాలు విరిగినప్పటి నుంచీ ఆమె ఇంటికి, మంచానికే పరిమితమైంది. భర్త చనిపోవటంతో మనవడితో అద్దె ఇంట్లో ఉంటోంది. భగియా ఫ్యామిలీకి ఒక్క ప్రభుత్వ పథకమూ అందలేదు. ఇంటి స్థలం లేకపోవటంతో 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన'లో ఇల్లు కట్టించుకోలేకపోయింది. ఆమె కుటుంబంలో ఎవరికీ ఉపాధి హామీ కార్డుల్లేవు. అసలు ఆ గ్రామంలో అలాంటి ప్రాజెక్టులేవీ అమలు కావట్లేదు. రాష్ట్రంలో కొత్తగా 'ఖద్యాన్ కోష్' అనే పథకం వచ్చింది. అందులో నిరుపేదలకు ఆహారం అందించటానికి ప్రతి ఊరుకీ రూ.10 వేలు కేటాయించారు. ఈ స్కీమూ భగియా కడుపు నింపలేకపోయింది.

భగియా మృతి గురించి తెలిసి ఆఫీసర్లు ఆమె గ్రామానికి వచ్చారు. అంత్యక్రియలకు రూ.2 వేలు, 50 కిలోల బియ్యం ఇస్తామన్నారు. అవి వచ్చేదాక డెడ్‌బాడీని ఇంట్లోనే ఉంచాల్సిన పరిస్థితి. ఆకలితో చనిపోయినవారికి పోస్ట్‌మార్టం తప్పనిసరి. కానీ, భగియా శవ పరీక్షకి అధికారులు ఒప్పుకోలేదు. తద్వారా ఆమె ఆకలి చావు వెలుగులోకి రాకుండా అడ్డుకున్నారు. ఆ తర్వాత ఆ పల్లె వైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఈ నేపథ్యంలో తమకు కనీసం రేషన్ కార్డులైనా ఇవ్వాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

టాకీస్

ప్రభాత వెలుగు | 09

మంగళవారం | హైదరాబాద్

15.01.2019

www.v6velugu.com

Follow: v6velugu



సంక్రాంతి... అనుబంధాల పండుగ. ఎక్కడెక్కడో ఉన్న వారందరినీ ఈ పండుగ ఒక్క చోటికి చేరుస్తుంది. పిండివంటలు... భోగిమంటలు... ఆటలు.. పాటలు... మధ్యలో ఓ మంచి సినిమా. అందుకే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్లు సంక్రాంతికి రిలీజవుతుంటాయి. అందరూ కలిసి సరదాగా చూస్తారని. చెప్పాలంటే పండుగతో సంబంధం లేకుండా కూడా టాలీవుడ్లో కుటుంబ కథా చిత్రాలు వస్తూ ఉంటాయి. ఎందుకంటే తెలుగువారు అనుబంధాలకు విలువిస్తారు. వాటికి విలువిచ్చి తీసే సినిమాకి పట్టం కడతారు. అలా చాలాసార్లు జరిగింది.

ఫ్యామిలీ స్క్రిప్ట్.. ఎప్పుడూ హిట్





ఒకప్పుడు సినిమా కథలన్నీ కుటుంబాల చుట్టూనే తిరిగేవి. ప్రేమ, ఊరి గొడవలు, సామాజిక సమస్యలు... సబ్జెక్ట్ ఏదైనా కానివ్వండి. వాటి చుట్టూ కుటుంబ నేపథ్యం బలంగా కనిపించేది. కానీ కాలం మారింది. సినిమా తీరూ మారింది. లవ్ స్టోరీ, ఫ్యాక్షన్, హారర్, థ్రిల్లర్ అంటూ తెలుగు సినిమా జానర్లు జానర్లుగా విడిపోయింది. వాటితో పాటు ఫ్యామిలీ సినిమా కూడా ఒక జానర్‌గా మిగిలిపోయింది. అలా అని అవి పూర్తిగా మాయమైపోలేదు. అప్పుడప్పుడూ వచ్చి పలకరిస్తుంటాయి. వాటిని చూసినప్పుడల్లా ప్రేక్షకుల మనసులు పులకరిస్తుంటాయి. బాక్సాఫీసులు కూడా నిండుగా కళకళలాడుతుంటాయి.

ఒక కుటుంబం... బోలెడంతమంది సభ్యులు... గలగలా మాట్లాడుతుంటారు. కిలకిలా నవ్వుతుంటారు. ఒక్క ఫ్రేమ్‌లో పదీ ఇరవై మంది కనిపిస్తారు. ఇంతమంది ఉన్నారేంటి అని కంగారుపడిపోయారు ప్రేక్షకులు. కానీ వారి మధ్య అనుబంధాలు, ఆప్యాయతలు ఆకట్టుకున్నాయి. వారి మధ్యలో హీరో హీరోయిన్ల ప్రేమకథ చూసి ముచ్చటపడ్డారు. ఇన్నాళ్లకు మళ్లీ మంచి ఫ్యామిలీ మూవీ వచ్చిందంటూ మురిసిపోయారు. 'నిన్నే పెళ్లాడతా' సినిమాని ఆల్‌టైమ్ సూపర్బ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా నిలబెట్టారు. నిజానికి కుటుంబ కథా చిత్రాలు ప్రాధాన్యత కోల్పోయాక వాటికి మళ్లీ డిమాండ్ తీసుకొచ్చిందీ సినిమా. పైగా ఎప్పుడూ ఏ సినిమాలోనూ లేనంతమంది నటీనటులు ఒక్క ఫ్రేమ్‌లో కనిపించేసరికి కొత్తదనం ఫీలయ్యారంతా. ఆ తర్వాత అలాంటి సినిమాలు అడపా దడపా రావడం మొదలయ్యింది.

స్నేహం, అనుబంధం, కుటుంబం తన ప్రేమకంటే ముఖ్యమని నిరూపించి 'నువ్వు నాకు నచ్చావ్' అని అందరితో అనిపించుకున్నాడు వెంకటేష్. 'సంక్రాంతి'లో కూడా బాధ్యత గల కొడుకుగా మెప్పించాడు. 'కలిసుందాం రా' అంటూ విడిపోయిన కుటుంబాలను ఒక్కటి చేశాడు. మహేశ్ బాబుతో కలిసి సీతమ్మ వాకిట్లో ఆప్యాయతల సిరిమల్లె చెట్టును మొలిపించాడు. ఇలాంటి చిత్రాలు ఎక్కువగా చేయడం వల్లే వెంకటేష్‌ను అందరూ ఫ్యామిలీ హీరో అంటుంటారు. చివరికి ఈ యేడు సంక్రాంతికి కూడా 'ఎఫ్2' అనే ఫ్యామిలీ డ్రామాతో వచ్చాడు.

ప్రేయసి కోరిక మేరకు ఒకమ్మాయికి బాయ్‌ఫ్రెండుగా నటించడానికి వెళ్లి, ఆ కుటుంబంలోని వారందనికీ రిలేషన్స్ ఎలా ఉండాలో నేర్పించి, ఆ ఇంటిని 'బృందావనం' చేశాడు ఎన్టీయార్. అతడు 'నాన్నకు ప్రేమతో' ఇచ్చిన కానుక కూడా అందరికీ నచ్చేసింది. కోట్ల ఆస్తిని వదిలేసి అత్తారింటికి దారి వెతుక్కున్నాడు పవర్ స్టార్. మొదట తనకు తానే ముఖ్యమనుకున్నా, అందరితో ఉంటేనే ఆనందమని తెలుసుకుని 'మిస్టర్ పర్‌ఫెక్ట్' అయ్యాడు ప్రభాస్. ప్రేమించిన అమ్మాయి ఎంత ముఖ్యమైనా, ఆమె ప్రేమించేవాళ్లకి కూడా గౌరవం ఇవ్వాలని చెప్పాడు 'నువ్వొస్తానంటే నేనొద్దంటానా'లో సిద్ధార్థ. కూతురి మీద 'ఆకాశమంత' ప్రేమను చూపించాడు ప్రకాశ్‌రాజ్. కుటుంబం కోసం ప్రేమనే త్యాగం చేశాడు 'శతమానంభవతి'లో శర్వానంద్. మరదలి మీద ఇష్టం కుటుంబ గౌరవం కంటే ముఖ్యం కాదనుకున్నాడు 'అ ఆ'లో నితిన్. తనమీద ప్రేమ వున్నా తండ్రిని వదిలి రాలేక తల్లడిల్లుతున్న ప్రేయసి కోసం అమెరికానే వదిలొచ్చేశాడు 'ఫిదా'లో వరుణ్ తేజ్. తండ్రి మీద ఉన్న ప్రేమతో పగోడి కత్తికి ఎదురెళ్లాడు సత్యమూర్తి గారి సన్. రిలేషన్స్‌ని పాడు చేస్తోన్న ఇగో గోడల్ని పగులగొట్టాడు 'శైలజారెడ్డి అల్లుడు'.


ఒకటా రెండా.. ఎన్ని సినిమాలని! అనుబంధాల విలువను ఎంత గొప్పగా చెప్పాయని! మనసుల్ని కదిలించే ఆప్యాయతలు, కంటతడి పెట్టించే త్యాగాలు, ఆలోచింపజేసే వాస్తవాలు.. వెరసి ప్రేక్షకుల మనసుల్లో ముద్ర పడిపోయాయి. బాక్సాఫీసు రికార్డుల్ని ఖాతాలో వేసుకున్నాయి. ప్రతి సినిమా విజయం సాధించాలనే తెరకెక్కుతుంది. కానీ ఇలాంటి కొన్ని సినిమాల్లో మాత్రమే మంచి అంతర్లీనంగా ఉంటుంది. వినోద ప్రధాన చిత్రం థియేటర్లో ఉన్నంతసేపూ నవ్విస్తుందేమో. **మంచి కుటుంబకథా చిత్రం జీవితాంతం మన పెదవులపై నవ్వుని నిలబెడుతుంది. ఎందుకంటే అది అనుబంధాలంటే ఏంటో చెబుతుంది. వాటిని ఎలా కాపాడుకోవాలో నేర్పుతుంది. వాటిని నిలబెట్టుకోవడంలో మనల్ని నిష్ణాతుల్ని చేస్తుంది. అందుకే మనకి కుటుంబ కథా చిత్రాలు పండక్కే కాదు... తరచుగా రావాలి. అప్పుడు సంవత్సరమంతా సంక్రాంతే.**







ఫ్యామిలీ ఎంటర్‌టైనర్స్‌ను జనాలు తిప్పికొట్టిన సందర్భాలూ ఉన్నాయి. అనుబంధాలు ముఖ్యమే అయినా, వాటిని చూపించే ఉద్దేశంతోనే సినిమా తీసినా, ఓ పద్ధతిగా అందంగా చూపించకపోతే ప్రేక్షకులు చూడరని చాలా చిత్రాలు ప్రూవ్ చేశాయి. చాలా మంచి సబ్జెక్ట్‌తో తీశారు 'మనమంతా' మూవీని. కానీ నేరేషన్ అంత ఆసక్తికరంగా లేకపోవడంతో మంచి చిత్రంగా నిలిచిపోయింది తప్ప కమర్షియల్ హిట్ కాలేకపోయింది. భారీ కాస్టింగ్‌తో వచ్చిన 'బ్రహ్మోత్సవం' భారీ డిజాస్టర్ అనిపించుకుంది. గోవిందుడు అందరివాడని చెప్పడానికి ట్రై చేసినా ఓన్ చేసుకోలేకపోయారు జనం. 'శ్రీనివాస కళ్యాణం' కన్నులకు ఇంపుగా అనిపించలేదెవ్వరికీ. ఆవేశంగా ఉండే సింహా, ప్రేమించిన అమ్మాయి కోసం కూల్‌గా మారిపోయి అనుబంధాలే ముఖ్యమని చెప్పినా 'జై సింహా' అని జేజేలు కొట్టలేదెవ్వరూ. 'చినబాబు'గా కార్తి కూడా అలాగే ఫెయిలయ్యాడు. అంతెందుకు... తనను ప్రేమగా పెంచిన కుటుంబం కోసం జీవితాన్నే ఇచ్చేసిన వినయ విధేయ రాముడి త్యాగం కూడా బెడిసికొట్టింది. వీటన్నిటిని బట్టి తెలిసేదొకటే. మంచి విషయం చెప్పాలి. కానీ ఆకట్టుకునేలా చెప్పాలి.



అందరూ తీస్తున్నారు

కుటుంబ కథా చిత్రాలకు ఇతర భాషల వారూ పెద్ద పీట వేస్తారు. అనుకోకుండా వచ్చిన విపత్తు నుంచి తన కుటుంబాన్ని కాపాడుకోడానికి ఓ తండ్రి పడే తపనే 'దృశ్యం' సినిమా. ఈ మలయాళ చిత్రాన్ని అన్ని ప్రముఖ భాషల్లోనూ రీమేక్ చేశారు. కూతురి ప్రేమ కోసం ఆడదానిగా మారిన 'భామనే సత్యభామనే', మతి సరిగ్గా లేకపోయినా మనసంతా బిడ్డను నింపుకున్న 'నాన్న' వంటి చిత్రాలు చూశాం. నాటి హమ్ ఆప్‌కే హై కౌన్, కభీ ఖుషీ కభీ ఘమ్ నుంచి నేటి బదాయీహో వరకూ బాలీవుడ్‌లోనూ చాలా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్లు వచ్చాయి. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి భాషలోనూ ఇలాంటి చిత్రాలు బోలెడున్నాయి. కుటుంబ వ్యవస్థ ఉన్నంత కాలం ఇలాంటి చిత్రాలు మరిన్ని వస్తూనే ఉంటాయి.

మల్టీస్టారర్ హారర్

హారర్ సినిమాని 'అరుంధతి'తో మరో స్థాయికి తీసుకెళ్లింది అనుష్క. ఆ తర్వాత మంగళ, భాగమతి చిత్రాలతో కూడా కాస్త భయపెట్టింది. ఇప్పుడు మరోసారి భయపెడతానని చెబుతోంది. అయితే ఈసారి ఆమెకి హారర్ చిత్రాలకు ఫేమస్ అయిన అంజలి కూడా తోడవుతోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, కోన ఫిలిం కార్పొరేషన్ సంయుక్తంగా ఒక హారర్ థ్రిల్లర్ తీయడానికి రెడీ అవుతున్నారు, ఇంకా పేరు పెట్టని ఈ సినిమాకి హేమంత్ మధుకర్ దర్శకుడు. వివిధ భాషలలో తెరకెక్కనున్న ఈ సినిమాకి ఒక ప్రత్యేకత ఉంది. తెలుగు, తమిళంతో పాటు హాలీవుడ్ నటీనటులు, సాంకేతిక నిపుణులు కూడా ఈ చిత్రానికి పని చేయనున్నారు. అంజలి, అనుష్కలతో పాటు 'అర్జున్‌రెడ్డి' ఫేమ్ శాలీనీ పాండే కూడా నటిస్తోంది. మాధవన్ హీరో. అవసరాల శ్రీనివాస్, సుబ్బరాజు ఇతర ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. మార్చి నెలలో అమెరికాలో షూటింగ్ ప్రారంభమవుతుంది. కోన వెంకట్, గోపి సుందర్, షనీల్ డియో, గోపీ మోహన్, నీరజ్ కోన ముఖ్య సాంకేతిక నిపుణులు. ఇతర తారాగణం, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.



ఏబీసీడీ... రెడీ

అల్లు శిరీష్ హీరోగా సంజీవ్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ఏబీసీడీ'. బిగ్ బెన్ సినిమాస్ యశ్ రంగినేనితో కలిసి మధుర ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లో మధుర శ్రీధర్ నిర్మిస్తున్నారు. డి.సురేష్ బాబు సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రిలీజ్ చేయనున్నారు. నాగబాబు శిరీష్‌కి తండ్రి పాత్ర పోషించిన ఈ చిత్రంలో రుక్సార్ థిల్లాన్ హీరోయిన్. తెలుగు ప్రేక్షకులంతా హ్యాపీగా ఎంజాయ్ చేసే కథ అని నిర్మాతలు చెబుతున్నారు. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. మార్చి 1న విడుదల.



అక్షరయాత్ర

సినిమా హాల్ ఎంటర్ టైన్మెంట్ బ్యానర్‌పై, నందితాశ్వేత ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'అక్షర'. సోమవారం భోగి పండుగ సందర్భంగా ఈ మూవీ మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు బి. చిన్నికృష్ణ మాట్లాడుతూ... ''విద్య సమాజాన్ని మార్చే బలమైన ఆయుధం. కానీ నేటి విద్యావ్యవస్థ వ్యాపారంలా మారిపోయింది. అలాంటి వ్యవస్థపై అక్షర చేసే పోరాటం ఎంతో వినూత్నంగా ఉంటుంది. నందితాశ్వేత అక్షర పాత్రకు ప్రాణం పోస్తోంది. వేసవిలో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు. ఎడ్యుకేషన్ వ్యవస్థలోని లోపాలను బోల్డ్‌గా తెరమీదకు తీసుకు రాబోతున్నాం అన్నారు నిర్మాత అహితేజ. మరో నిర్మాత సురేష్ వర్మ మాట్లాడుతూ... "ప్రేక్షకుల ఆలోచనలలో మార్పు తెచ్చే విధంగా అక్షర రూపుదిద్దుకుంటోంది. విద్యకి వ్యాపారం పర్యాయ పదమయ్యిందనే ఆలోచనలను మార్చేందుకు అక్షర చేసే ప్రయత్నం ఆకట్టుకుంటుంది" అన్నారు.





ఏప్రిల్ 5న మజిలి

పెళ్లి తర్వాత నాగచైతన్య, సమంత కలిసి నటిస్తున్న తొలి చిత్రం 'మజిలి'. శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్నాడు. న్యూ ఇయర్ సందర్భంగా విడుదలైన ఈ మూవీ ఫస్ట్ లుక్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. ఇప్పుడు రెండో లుక్‌ని సంక్రాంతి సందర్భంగా విడుదల చేశారు. ఇందులో చైతూతో పాటు సెకెండ్ హీరోయిన్‌గా చేసిన దివ్యాంశ కౌశిక్ ఉంది. చేతిలో క్రికెట్ బ్యాట్ పట్టుకుని స్టైలిష్‌గా ఉన్నాడు చైతూ. 'దేర్ ఈజ్ లవ్.. దేర్ ఈజ్ పెయిన్' అనే ట్యాగ్ లైన్‌తో వస్తున్న ఈ రొమాంటిక్ ఎంటర్ టైనర్ షూటింగ్ ఎనభై శాతం పూర్తయిపోయింది. ఏప్రిల్ 5న రిలీజ్ చేయనున్నట్టు చిత్రబృందం ప్రకటించింది.



నెక్ గుడ్ల ధరలు (100కు)	ఫామ్‌గేట్	రిటెయిల్
హైదరాబాద్	రూ.433	రూ.4.95
వరంగల్	రూ.435	రూ.4.95

మార్కెట్

సెన్సెక్స్ ↓156 35,853.50

నిఫ్టీ ↓57 10,737.60

ఫ్లిప్‌కార్ట్, అమెజాన్‌లపై పోరాటం

ట్రిబ్యునల్‌కు వెళ్లనున్న చిన్న ఆన్‌లైన్ కంపెనీలు

ఇండియా ఆన్‌లైన్ బిజినెస్‌లో యుద్ధాలు తీవ్రమవుతున్నాయి. దేశంలోని అతిపెద్ద ఈ కామర్స్ దిగ్గజాలైన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లు కస్టమర్లను ఆకట్టుకునేందుకు ఇస్తున్న డిస్కౌంట్లు, క్యాష్ బ్యాక్ ఆఫర్లతో చిన్న ఆన్‌లైన్ కంపెనీలు, ఆఫ్‌లైన్ రిటెయిలర్ల నుంచి ఇంటి చుట్టు పక్కలుండే దుకాణాల దాకా అందరూ ఇబ్బందులెదుర్కొంటున్నారు. దీనిపై కాంపిటీషన్ కమిషన్‌కు ఫిర్యాదు ఇచ్చినా, లాభం లేకపోవడంతో ఇప్పుడు ఆ తీర్పుపై ఎన్‌సీఎల్‌టీకి వెళ్లి న్యాయపోరాటం చేయాలని చిన్న ఈ కామర్స్ వెండార్స్ నిర్ణయించుకున్నారు. దిగ్గజాల ధాటికి విలవిలలాడుతున్న చిన్న ఈ కామర్స్ వెండర్స్ అసోసియేషన్‌గా ఏర్పడి గతంలో కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై సుదీర్ఘ విచారణ చేసిన కాంపిటీషన్ కమిషన్ గత నవంబర్‌లో దిగ్గజాలకు అనుకూలంగానే తీర్పు చెప్పింది. దీంతో ఎన్‌సీఎల్‌టీలో కేసు దాఖలు చేయనున్నారు.

వెలుగు, బిజినెస్ డెస్క్:

ఓయోపై, ఫుడ్ అగ్రిగేటర్లపై హోటళ్లు, రెస్టారెంట్ యూనియన్లు యుద్ధం ప్రకటించిన సంగతి తెలిసిందే. రోజురోజుకు వీరి వివాదం ముదురుతూనే ఉంది. ఈ నేపథ్యంలోనే ఈకామర్స్ దిగ్గజాలు ఫ్లిప్‌కార్ట్, అమెజాన్‌లపై కూడా అమ్మకందారులు తిరగబడ్డారు. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లు వారి ప్లాట్‌ఫామ్‌లపై ఉన్న అమ్మకందారులందరినీ ఒకే విధంగా చూడటం లేదని ఆరోపిస్తున్నారు. ఈ రెండు ప్లాట్‌ఫామ్‌లపైనే లక్షల మందికి పైగా అమ్మకందారులున్నారు. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లకు వ్యతిరేకంగా చిన్న చిన్న ఆన్‌లైన్ సెల్లర్స్ కూడా రంగంలోకి దిగారు. కొంతమంది అమ్మకందారులకు మాత్రమే దిగ్గజాలు అనుకూలంగా ఉంటున్నాయని, ఆధిపత్య స్థానాన్ని అవి దుర్వినియోగం చేస్తున్నాయని ఆల్ ఇండియా ఆన్‌లైన్ వెండార్స్ అసోసియేషన్(ఏఐఓవీఏ) ఆరోపిస్తోంది. ఇదే విషయంపై సీసీఐ వద్ద ఫిర్యాదు కూడా దాఖలు చేసింది. ఈ ఫిర్యాదును సీసీఐ గతేడాది నవంబర్‌లో కొట్టిపారేయడంతో పాటు ఫ్లిప్‌కార్ట్, అమెజాన్‌లకు అనుకూలంగా తీర్పిచ్చింది. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్‌లు మర్చెంట్లు, బ్రాండ్లను ఎంపిక చేసే విషయంలో రెగ్యులేషన్స్‌ను బ్రేక్ చేయడం లేదని తెలిపింది. దీంతో సీసీఐ తీర్పును వ్యతిరేకిస్తూ... ఏఐఓవీఏ ప్రస్తుతం నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌ను ఆశ్రయించబోతుంది. ఏఐఓవీఏలో 3500కి పైగా ఆన్‌లైన్ సెల్లర్స్ ఉన్నారు.

క్లౌడ్‌టెయిల్, అప్పారియో కంపెనీలలో అమెజాన్‌కు భారీ వాటాలున్నాయి. ఈ రెండు సంస్థలను అమెజానే కంట్రోల్ చేస్తూ ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు. అమెజాన్ విక్రయిస్తున్న ఉత్పత్తుల్లో ఈ రెండు సంస్థలవే టాప్ ప్లేస్‌లో ఉంటున్నాయి. అంతేకాక ఈ రెండు సంస్థల నుంచి విక్రయించే ప్రతి ఆర్డర్‌పై కేవలం 1 శాతం కమిషన్ మాత్రమే అమెజాన్ ఛార్జ్ చేస్తోంది. మిగతా అమ్మకపుదారుల ఆర్డర్లపై మాత్రం 5 శాతం నుంచి 25 శాతం కమిషన్, అదనంగా షిప్పింగ్ ఫీజులు, ఫిక్స్‌డ్ క్లోజింగ్ ఫీజులను విధిస్తోంది. అమెజాన్ మాదిరి ఫ్లిప్‌కార్ట్ కూడా రిటెయిల్‌నెట్, ఓమ్నిటెక్ అనే రెండు సంస్థలకే అనుకూలంగా వ్యవహరిస్తోంది. మిగతా అమ్మకందారులను ఫ్లిప్‌కార్ట్, అమెజాన్‌లు లెక్కచేయకుండా వారి నుంచి కమిషన్ల మీద కమిషన్లు, ఛార్జీల మీద ఛార్జీలను బాదుతున్నాయి.



- దిగ్గజాల పక్షపాత ధోరణిపై విమర్శలు
- కమీషన్లు, చార్జీలు పేర్లతో బాదేస్తున్న దిగ్గజాలు

సెల్లర్స్‌కు ప్రతికూలంగా ఈజీ రిటర్న్స్ పాలసీ...

అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లు తమ పోర్టల్స్‌పై అమలు చేస్తోన్న ఈజీ రిటర్న్స్ పాలసీ కూడా అమ్మకం దారులకు ప్రతికూలంగా ఉంటోంది. ప్యాకేజీని పట్టించుకోకుండా ..ఆ ప్రొడక్ట్ ఎలా ఉన్నా అంటే ఆ ప్రొడక్ట్‌ను వాడినా.. డ్యామేజ్ అయినా.. చెత్త కండీషన్‌లో ఉన్న అమ్మకం దారు వెనక్కి తీసుకోవాల్సిందే. అన్ని పరిస్థితుల్లో కూడా ఇదే వర్తిస్తోంది. మొత్తం భారాన్ని లేదా నష్టాన్ని కూడా అమ్మకం దారే భరించాలి. చాలా తక్కువ మొత్తాన్నే అంటే కొనుగోలు ధరలో 50 శాతం కంటే తక్కువ మొత్తాన్నే ఈ పోర్టల్స్ అమ్మకందారునికి ఇస్తాయి.

ఈకామర్స్ సంస్థలు మెజార్టీ వాటాలున్న కంపెనీల ప్రొడక్టులను విక్రయించకూడదని ఆదేశిస్తూ.. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఈకామర్స్ నిబంధనలను తీసుకొచ్చింది. ఈ నిబంధనలు ఫిబ్రవరి 1 నుంచి అమలులోకి రానున్నాయి. ఐతే, ప్రభుత్వం సరైన రీతిలో సంప్రదింపులు జరిపిన తర్వాతే ఈ నిబంధనలను కఠినతరం చేయాలని ఫ్లిప్ కార్ట్ అనుబంధ సంస్థ వాల్ మార్ట్, అమెజాన్‌లు అంటున్నాయి. అంతేకాక ఈకామర్స్ నిబంధనల అమలు తుది గడువును మరికొంత పొడిగించాలని కోరుతున్నాయి. తుది గడువు పొడిగిస్తే... ఇప్పటికే తమ వద్దనున్న పెద్ద మొత్తంలో ఇన్వెంటరీని లిక్విడేట్ చేసుకోవాలని చూస్తున్నాయి. మరోవైపు ఈ పాలసీ అమలు కాదని కూడా పోర్టల్స్ చాలా నమ్మకంగా ఉన్నాయి. ఈ కొత్త ఈకామర్స్ పాలసీతో లక్షల మంది వర్తకులు సంతోషంగా ఉన్నారని, ప్రభుత్వం సరియైన నిర్ణయం తీసుకుందని కొందరు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ నిబంధనలతో ఈకామర్స్ సంస్థల డిస్కౌంట్లకు, ఆధిపత్య ధోరణికి కాస్త చెక్ పడనుంది. కానీ కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంపై అమెరికన్ పారిశ్రామిక వర్గాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. ఈ కఠిన నిబంధనలతో దీర్ఘకాలికంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపే అవకాశం ఉందని ఆ వర్గాలు వెల్లడించాయి. ఫిబ్రవరి 2019 నుంచి కొత్త నిబంధనలు అమలులోకి వస్తాయా లేక ఈ లోపు ప్రభుత్వం మరేదైనా ప్రకటన చేయబోతుందా అనేది తెలియాల్సి ఉంది.

అమెజాన్.ఇన్



స్థాపన: 2013

నడిపించేది: అమిత్ అగర్వాల్

1. 17 కోట్లు సగటున రోజుకు ఎన్ని ప్రొడక్ట్‌లు అందుబాటు
2. ఎన్ని ప్రొడక్ట్‌లు రోజూ కొత్తగా యాడ్ అవుతున్నాయి: రెండు లక్షలు
3. థర్డ్ పార్టీ సెల్లర్స్: 3.4 లక్షలు
4. ప్రొడక్ట్ కేటగిరీలు: 100
5. టాప్ సెల్లింగ్ ప్రొడక్ట్స్: మొబైల్ ఫోన్స్ | కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ | ఫ్యాషన్ | లార్జ్ అప్లియెన్సస్

ఫ్లిప్‌కార్ట్.కామ్



స్థాపన: అక్టోబర్ 2007 (2018 మే నెలలో వాల్‌మార్ట్ కొనుగోలు)

నడిపించేది: కల్యాణ్ కృష్ణమూర్తి

1. 8 కోట్లు సగటున రోజుకు ఎన్ని ప్రొడక్ట్‌లు అందుబాటు
2. ఎన్ని ప్రొడక్ట్‌లు రోజూ కొత్తగా యాడ్ అవుతున్నాయి: లక్షన్నరకు పైగా
3. థర్డ్ పార్టీ సెల్లర్స్: లక్ష మంది
4. ప్రొడక్ట్ కేటగిరీలు: 80కి పైగా
5. ఉద్యోగులు... 26వేల మంది (పర్మినెంట్, పార్ట్‌టైమ్)
6. టాప్ సెల్లింగ్ ప్రొడక్ట్స్: మొబైల్ ఫోన్స్ | ఫుట్‌వేర్ | అప్పేరల్ | టీవీలు | ఏసీలు | ల్యాప్‌టాప్‌లు | ఇతర ఎలక్ట్రానిక్స్

తక్కువ ధరలతో మోసం...

తక్కువ ధరకే ప్రొడక్ట్‌ను విక్రయిస్తూ... ప్రత్యక్షంగా తయారీదారులతో డీల్ చేసే అమ్మకందారులను కూడా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లు మోసం చేస్తున్నాయన్నది చిన్న ఆన్‌లైన్ కంపెనీల ఆరోపణ. తక్కువ ధరలతో రిటెయిల్ మార్కెట్లకు గండికొడుతున్నారని, మినిమమ్ ఆపరేటింగ్ ప్రైస్ (ఎంఓపీ)ను బ్రేక్ చేస్తూ.. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లు మార్కెట్ డైనమిక్స్‌లో ఒడిదుడుకులు సృష్టిస్తున్నాయని చెప్తున్నారు. ఈ పోర్టల్స్ అమలు చేసే డీల్స్‌పై బ్రాండ్స్ కూడా సంతృప్తిగా లేవు. ఈ డీల్స్‌తో జనరల్ ట్రేడింగ్ తీవ్ర ప్రభావితమవుతోందని ఆరోపిస్తున్నాయి. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వల్లనే ఇప్పటి వరకు చాలా వరకు చిన్న షాపులు-వ్యాపారాలు మూతపడ్డాయని అసోసియేషన్ విమర్శిస్తోంది. ప్రస్తుతం ఈ పోర్టల్స్‌లో విక్రయిస్తున్న అమ్మకందారులు నష్టాలను భరిస్తున్నారని, వారి స్టాక్‌ను 3 నుంచి 6 నెలల్లో లిక్విడేట్ చేసుకోవాల్సిన పరిస్థితి కల్పిస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. గత్యంతరం లేకపోవడంతో దిగ్గజాల మీద న్యాయపోరాటంకు దిగుతున్నామని అంటున్నారు.



సెన్సెక్స్ 150 పాయింట్లు డౌన్

ముంబై: ఐఐపీ డేటా, ఆసియా మార్కెట్లు నిరాశపర్చడంతో దేశీయ మార్కెట్ల సూచీలు సోమవారం నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు కూడా అమ్మకాలకు దిగడంతో సెన్సెక్స్ 156 పాయింట్లు నష్టపోయి 35,853.50 వద్ద ముగిసింది. నిఫ్టీ 57.35 పాయింట్లు దిగజారి 10,737.60 పాయింట్ల వద్ద ముగిసింది. ఎల్ అండ్ టీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, పవర్‌గ్రిడ్, ఎన్టీపీసీ, టీసీఎస్, ఐసీఐసీఐ బ్యాంక్, ఆక్సిస్ బ్యాంక్, హీరో మోటోకార్ప్, ఎయిర్‌టెల్, ఎస్‌బీఐ షేర్లు నష్టపోయాయి. యెస్ బ్యాంక్ షేర్ మాత్రం 6.22 శాతం పెరిగింది. కొత్త సీఈఓగా రజత్ మోంగా బాధ్యతలు చేపడతారనే వార్తలు రావడమే ఇందుకు కారణం. ఇన్ఫోసిస్, సన్‌ఫార్మా, బజాజ్ ఫైనాన్స్, మారుతి, టాటా మోటార్స్ కూడా లాభపడ్డాయి. అమెరికాలో షట్‌డౌన్, బ్రెగ్జిట్ ప్రభావం కూడా మార్కెట్లను దెబ్బతీసిందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ ఆఫ్ ది రీసెర్చ్ వినోద్ నాయర్ అన్నారు. ఆయిల్ ధరలు, రూపాయి బలహీనపడుతుండటం, ద్రవ్యలోటు దేశీయ ఇన్వెస్టర్లను భయపెడుతున్నాయని అన్నారు.



మళ్లీ పెరిగిన పెట్రో ధరలు

న్యూఢిల్లీ: లీటరు పెట్రోల్ ధర 38 పైసలు, లీటరు డీజిల్ ధరను 49 పైసల చొప్పున పెంచినట్టు ఆయిల్ కంపెనీలు సోమవారం ప్రకటించాయి. దీంతో ఢిల్లీలో లీటరు పెట్రోల్ ధర రూ.70.13 లకు, డీజిల్ ధర రూ.64.18కి చేరింది. ముంబైలో పెట్రోల్ ధర రూ.75.77 కాగా, డీజిల్ ధర రూ.67.18 ఉంది. చెన్నైలో పెట్రోల్ ధర రూ.72.80లకు, డీజిల్ ధర రూ.67.79లకు, హైదరాబాద్‌లో లీటరు పెట్రోల్ ధర రూ.74.70లకు, డీజిల్ ధర రూ.69.77లకు చేరింది. ఆయిల్ కంపెనీలు ధరలను పెంచడం ఈ నెలలో ఇది ఐదోసారి. గత ఆదివారం పెట్రోల్‌పై 59పైసలు, డీజిల్‌పై 49పైసలు పెరిగింది. ఈ నెల ఏడో తేదీన కూడా పెట్రోల్ 21 పైసలు, డీజిల్ ఎనిమిది పైసలు పెరిగింది. 8,9 తేదీల్లో సైతం ధరలను పెంచారు. గత ఏడాది అక్టోబరు నుంచి ఈ నెల ఏడో తేదీ వరకు పెట్రోల్ ధర రూ.14.54, డీజిల్ ధర రూ.13.53 ధర తగ్గింది.

రాష్ట్రంలో 129 మెగావాట్ల సోలార్ ప్లాంట్లు పెడుతున్న సింగరేణి

భెల్‌కు రూ.565 కోట్ల ఆర్డరు

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలో 129 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ పవర్ ప్లాంట్లు నెలకొల్పడానికి రూ. 565 కోట్ల విలువైన ఆర్డరును బీహెచ్ఈఎల్ పొందింది. సోలార్ ప్లాంట్స్ రంగంలో బీహెచ్ఈఎల్‌కు ఇప్పటిదాకా ఇదే పెద్ద ఆర్డరు. రామగుండం వద్ద 50 మెగావాట్లు, ఇల్లందు వద్ద 39 మెగావాట్లు, మణుగూరు వద్ద 30 మెగావాట్లు, పగిడిపల్లి వద్ద 10 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ ఫోటోవోల్టాయిక్ (ఎస్‌పీవీ) పవర్ ప్లాంట్స్‌ను ఏర్పాటు చేయడానికి ఈ ఆర్డరును సింగరేణి కాలరీస్ లిమిటెడ్ ఇచ్చింది. ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) ప్రాతిపదికన సింగరేణి కాలరీస్ ఈ ఆర్డరును బీహెచ్ఈఎల్‌కు జారీ చేసింది. తాజా ఆర్డరుతో సోలార్ పవర్ ప్లాంట్ల విభాగపు మొత్తం ఆర్డర్లు 710 మెగావాట్లకు చేరినట్లు బీహెచ్ఈఎల్ వెల్లడించింది. సోలార్ ఫోటోవోల్టాయిక్ రంగంలో బీహెచ్ఈఎల్‌కు ముప్పై ఏళ్లకు పైగా అనుభవం ఉంది. ఎస్‌పీవీ ఉత్పత్తుల కోసం ప్రత్యేక ఆర్ అండ్ డీ సెంటర్‌ను కూడా బీహెచ్ఈఎల్ ఏర్పాటు చేసింది. సోలార్ సెల్స్, పీవీ మాడ్యూల్స్, పవర్ కండిషనింగ్ యూనిట్లు, సిస్టమ్స్ వంటి ప్రధాన విభాగాలలో బీహెచ్ఈఎల్‌కు నైపుణ్యం ఉంది. కేంద్రం మేకిన్ ఇండియాకు మద్దతుగా రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పత్తులు, సేవల రంగంలో చొరవ ప్రదర్శిస్తున్నట్లు బీహెచ్ఈఎల్ తెలిపింది. బెంగళూరులోని ఎలక్ట్రానిక్ సిస్టమ్స్ డివిజన్‌లో స్పేస్ గ్రేడ్ సోలార్ ప్యానెల్స్ అసెంబ్లింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. ఈపీసీ ప్రాతిపదికన అండమాన్ సహా, వివిధ ప్రాంతాలలో ఎస్‌పీవీ పవర్ ప్లాంట్స్‌ను నెలకొల్పుతున్న అనుభవం తమ సొంతమని బీహెచ్ఈఎల్ తెలిపింది.



ధరలు తగ్గాయి

న్యూఢిల్లీ: టోకు ధరల ద్రవ్యోల్బణం గత నెలలో ఎనిమిది నెలల కనిష్టానికి చేరి 3.80 % నమోదయింది. చమురు ధరలు, కొన్ని ఆహార పదార్థాల ధరలు తగ్గడమే ఇందుకు కారణం. ద్రవ్యోల్బణం ఆధారిత టోకుధరల ద్రవ్యోల్బణ సూచీ (డబ్లూపీఐ) నవంబరులో 4.64%గా నమోదయింది. 2017లో ఇది 3.58% నమోదయింది. ఆహార ధరల ప్రతి ద్రవ్యోల్బణం (డిఫ్లేషన్) డిసెంబరు 0.07%, నవంబరు 3.31%గా తేలింది. కూరగాయల ద్రవ్యోల్బణం నవంబరులో 26.98% నమోదు కాగా, డిసెంబరులో 17.55 శాతానికి తగ్గింది. ఇంధనం, విద్యుత్ ధరల ద్రవ్యోల్బణం 16.28 శాతం నుంచి 8.38 శాతానికి పడిపోయింది. పెట్రోల్, డీజిల్ ద్రవ్యోల్బణం వరుసగా 1.57 శాతం, 8.61 శాతంగా నమోదయింది.

ఓలా వాటా కొన్న సచిన్ బన్సల్

షేర్ల విలువ రూ.148 కోట్లు



బెంగళూరు: మనదేశంలో అతిపెద్ద క్యాబ్ సర్వీసుల సంస్థ ఓలా (ఏఎన్ఐ టెక్నాలజీస్)లో ఫ్లిప్‌కార్ట్ సహ వ్యవస్థాపకుడు సచిన్ బన్సల్ రూ.148 కోట్ల విలువైన వాటా కొన్నారు. ఫ్లిప్‌కార్ట్‌లో ఈయన తన వాటా వాల్‌మార్ట్‌కు బిలియన్ డాలర్లకు అమ్ముకొని ఆ కంపెనీ నుంచి బయటికి వచ్చారు. తదనంతరం బన్సల్ ఒక కంపెనీలో వాటాదారుడిగా మారడం ఇదే తొలిసారి. ఓలా ఆయనకు రూ. 21,250 చొప్పున 70,588 సిరీస్ జె షేర్లను కేటాయించింది. బన్సల్ ఓలాలో తదనంతరం కూడా రూ.700 కోట్ల విలువైన షేర్లను కొనే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఓలాలో ప్రస్తుత ఇన్వెస్టర్ స్టెడ్‌వ్యూ క్యాపిటల్ ఇటీవల రూ.523 కోట్ల విలువైన షేర్లు కొంది. దీంతో కంపెనీ వాల్యుయేషన్ రూ.40,327 కోట్లకు చేరింది. 2017లో టెన్సెంట్ టెక్నాలజీ రూ.28,300 కోట్లు మదుపు చేసింది. తాము కూడా రూ.ఏడు వేల కోట్ల విలువైన షేర్ల కొనుగోలుకు చర్చలు జరుపుతున్నామని మరో వాటాదారు సాఫ్ట్‌బ్యాంక్ ప్రకటించింది. అయితే సాఫ్ట్‌బ్యాంక్ వాటా పెరగకుండా నిరోధించడానికి కొత్త పెట్టుబడిదారుల నుంచి డబ్బు తీసుకోవాలని ఓలా వ్యవస్థాపకుడు భవీశ్ అగర్వాల్ భావిస్తున్నారు. ఈ నిధులతో ఇండియాతోపాటు విదేశాల్లో ఓలాను విస్తరించాలని కోరుకుంటున్నారు.

'గెలాక్సీ ఎం' సిరీస్ స్మార్ట్‌ఫోన్లు

న్యూఢిల్లీ: ఇండియాలో ఒకప్పుడు స్మార్ట్‌ఫోన్ల రారాజుగా ఉన్న శాంసంగ్, ఇప్పుడు మళ్లీ ఆ స్థానం కోసమే చూస్తోంది. ప్రత్యర్థి షియోమిని ఎలాగైనా బీట్ చేయాలని చూస్తోంది. ఈ నేపథ్యంలో కొరియాకు చెందిన ఈ దిగ్గజం 'గెలాక్సీ ఎం' సిరీస్ స్మార్ట్‌ఫోన్లను ఇండియాలో ప్రవేశపెట్టబోతోంది. షియోమిని వెనక్కి నెట్టడమే కాకుండా.. తీవ్ర పోటీకర మార్కెట్‌లో రెండంకెల వృద్ధిని నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ స్మార్ట్‌ఫోన్ల రేంజ్ రూ.20వేల వరకు ఉంటుంది. కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే ఈ స్మార్ట్‌ఫోన్లను విక్రయిస్తుంది. తొలుత శాంసంగ్ వెబ్‌సైట్, అమెజాన్‌లో అందుబాటులోకి వచ్చిన తర్వాత, మిగతా ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌లోకి వీటిని విస్తరించనుంది. 'కొత్త గెలాక్సీ ఎం సిరీస్ స్మార్ట్‌ఫోన్లను లాంచ్ చేస్తున్న తొలి దేశం ఇండియా. ఈ నెలాఖరున శాంసంగ్ ఇండియా వీటిని విడుదల చేయనుంది. ఈ కొత్త రేంజ్ స్మార్ట్‌ఫోన్ల లక్షల మందికి స్ఫూర్తి దాయకంగా నిలువనున్నాయి. ఇండియాలోనే వీటిని డిజైన్ చేశాం' అని శాంసంగ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ అసిమ్ వార్సి చెప్పారు. ఈ కొత్త రేంజ్ స్మార్ట్‌ఫోన్లు 2019లో తమకు రెండింతల వృద్ధిని నమోదు చేసేందుకు దోహదం చేయనున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇండియన్ మార్కెట్‌లో తాము కేవలం డివైజ్‌లను లాంచ్‌చేసేందుకే కాకుండా.. ఫ్యాక్టరీ విస్తరణకు కూడా పెట్టుబడులు పెడుతున్నట్టు చెప్పారు. ఇండియన్ కస్టమర్లకు అవసరమైన వాటిపైనే తాము ఎక్కువగా ఫోకస్ చేయనున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈకామర్స్ కంపెనీల నిబంధనలను కఠినతరం చేసిన నేపథ్యంలో, చట్టాలకు అనుగుణంగానే తాము నడుచుకుంటామని వార్సి చెప్పారు. ఐడీసీ, కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ రిపోర్టుల ప్రకారం, శాంసంగ్‌ను షియోమిని బీట్ చేసింది. ఆన్‌లైన్ స్మార్ట్‌ఫోన్ సేల్స్‌లో షియోమి ఆధిపత్య స్థానంలో ఉంది. గత కొన్ని నెలలుగా ఆఫ్‌లైన్‌పై కూడా షియోమి దృష్టిపెట్టింది. అయితే శాంసంగ్ ఆఫ్‌లైన్ ఛానల్‌పై ఫోకస్‌ను కొనసాగిస్తుందని వార్సి చెప్పారు. కొత్త ఎం సిరీస్ మూడు డివైజ్‌లతో మార్కెట్‌లోకి రానుంది. ఈ డివైజ్‌లకు 5000 ఎంఏహెచ్ బ్యాటరీ, ఫాస్ట్ ఛార్జింగ్ ఫీచర్ ఉండనుంది. ఈ మూడు ఫోన్లలో ఒకటి మూడు కెమెరాలతో రూపొందింది.



- ఇండియాలో లాంచ్ చేస్తున్న శాంసంగ్
- షియోమిని బీట్ చేసేందుకు కొత్త ప్లాన్
- రెండంకెల వృద్ధే టార్గెట్

కార్లు కొనలే, బైకులు పర్వాలే

డిసెంబర్‌లో ఇది మార్కెట్ పరిస్థితి

న్యూఢిల్లీ: దేశీయంగా ప్యాసింజర్ వాహన అమ్మకాలు కాస్త తగ్గాయి. గత ఏడాది డిసెంబరులో 2,39,723 యూనిట్లు అమ్ముడుపోగా, ఈ ఏడాది డిసెంబరులో 2,38,692 యూనిట్లు అమ్ముడయ్యాయి. 2017లో ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు 32,30,614 యూనిట్లుగా నమోదవగా, ఈ ఏడాది 5.08 శాతం పెరిగి 33,94,756 యూనిట్లకు పెరిగాయి. దేశవ్యాప్తంగా కార్ల అమ్మకాలు 2017లో 1,58,338 యూనిట్లు నమోదు కాగా ఈ ఏడాది సెంబరు 2.01 శాతం పెరిగి 1,55,159 యూనిట్లకు చేరాయని సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ (సియామ్) పేర్కొంది. మోటారు సైకిళ్ల అమ్మకాలు గత ఏడాది (7,88,334)తో పోలిస్తే స్వల్పంగా పెరిగి 7,93,061 యూనిట్లుగా నమోదయ్యాయి. టూవీలర్ల అమ్మకాలు 2.23 శాతం పెరగడంతో 12,87,766 యూనిట్ల నుంచి 12,59,026 యూనిట్లకు చేరాయి. వాణిజ్య వాహనాల అమ్మకాలు 7.8 శాతం పెరిగి 75,984యూనిట్లకు ఎగిశాయి. అన్ని విభాగాల వాహనాలు గత డిసెంబర్‌తో పోలిస్తే ఈ డిసెంబర్‌లో 2.97 శాతం పెరిగి 16,17,356 యూనిట్ల నుంచి 16,66,878 యూనిట్లకు చేరాయి.



వేగన్ ఆర్ కొనుగోలుకు బుకింగ్స్ ఓపెన్

త్వరలో రాబోతున్న వేగన్ ఆర్ కొత్త వెర్షన్ కొనుగోలు కోసం బుకింగ్స్‌ను ఆహ్వానిస్తున్నట్టు మారుతీ సుజుకీ ఇండియా ప్రకటించింది. దేశవ్యాప్తంగా ఉన్న డీలర్లకు రూ.11 వేలు చెల్లించి మూడో జనరేషన్ వేగన్ ఆర్‌ను బుక్ చేసుకోవచ్చు. కంపెనీ వెబ్‌సైట్ ద్వారా కూడా బుక్ చేసుకోవచ్చు. కొత్త వేగన్ ఆర్‌ను ఈ నెల 23న మార్కెట్లోకి విడుదల చేస్తారు. ఇది 1.2 లీటర్, 1 లీటర్ పెట్రోల్ ఇంజన్ వెర్షన్లలో లభిస్తుంది. ఆటోమేటిక్ గేర్ షిఫ్ట్ వేరియంట్‌ను కూడా విడుదల చేస్తారు. దీనిని సుజుకీ ఐదో హార్టెక్ట్ టెక్నాలజీతో తయారు చేయడం వల్ల కారు మరింత పటిష్టంగా, మన్నికగా, సురక్షితంగా ఉంటుందని కంపెనీ తెలిపింది. ఇందులో డ్రైవర్ ఎయిర్‌బ్యాగ్, యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్, ఎలక్ట్రానిక్ బ్రేక్‌ఫోర్స్ డిస్ట్రిబ్యూషన్, స్పీడ్ అలర్ట్ సిస్టమ్ వంటి సదుపాయాలు ఉంటాయి.

'మలేసియా'లో మెరుస్తారా..?

ఫేవరెట్లుగా శ్రీకాంత్, సైనా ○ నేటి నుంచి మలేసియా మాస్టర్స్



కౌలాలంపూర్: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్‌లో బెంగళూరును విజేతగా నిలిపిన స్టార్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ మలేసియా ఓపెన్ టైటిల్‌పై కన్నేశాడు. ఈ టోర్నీలో గెలిచి సీజన్‌ను ఘనంగా మొదలుపెట్టాలని భావిస్తున్నాడు. మంగళవారం మొదలయ్యే ఈ టోర్నీలో శ్రీకాంత్, సైనా నెహ్వాల్ ఫేవరెట్లుగా బరిలోకి దిగుతున్నారు. గతేడాది కొద్దికాలంపాటు నం.1 ర్యాంకును అందుకుని ప్రస్తుతం ఎనిమిదో ర్యాంకుకు పడిపోయిన శ్రీకాంత్.. పునర్వైభవం కోసం తహతహలాడుతున్నాడు. కామన్వెల్త్ గేమ్స్‌లో రజతం మినహా 2018లో ఒక్క టైటిల్ కూడా నెగ్గలేకపోయిన శ్రీకాంత్.. ఈ టోర్నీని కైవసం చేసుకుని శుభారంభం చేయాలని పట్టుదలగా ఉన్నాడు. మంగళవారం క్వాలిఫయింగ్ పోటీలు జరుగుతుండగా, తర్వాతి రోజు నుంచి మెయిన్‌డ్రా పోటీలు జరుగుతాయి. తొలిరౌండ్‌లో అంగుస్ (హాంకాంగ్)తో శ్రీకాంత్ తలపడనున్నాడు. గతేడాది కామన్వెల్త్‌గేమ్స్‌లో చాంపియన్‌గా నిలవడంతోపాటు ఆసియాగేమ్స్, ఆసియా చాంపియన్‌షిప్‌లలో కాంస్య పతకాలతో సత్తాచాటిన సైనా నెహ్వాల్ బుధవారం జరిగే తొలి రౌండ్‌లో డెంగ్ జాయ్ షువాన్ (హాంకాంగ్)తో పోటీపడనుంది. మరో తెలుగు షట్లర్ సాయిప్రణీత్ ఈ టోర్నీ నుంచి తప్పుకోగా.. పారుపల్లి కశ్యప్, అజయ్ జయరామ్, శుభాంకర్ డే క్వాలిఫయింగ్ పోటీలలో బరిలో నిలిచారు. మహిళల సింగిల్స్‌లో యువ షట్లర్లు వైష్ణవి రెడ్డి, రీతుపర్ణ దాస్ అర్హత పోటీల్లో అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

శ్రీకాంత్‌తో లీ నింగ్ 35 కోట్ల డీల్

ఇండియా ఏస్ షట్లర్ శ్రీకాంత్‌తో చైనీస్ స్పోర్ట్స్ బ్రాండ్ లీ నింగ్ భారీ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. నాలుగేళ్ల కాలానికి బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండేందుకు ఏకంగా 35 కోట్లు ముట్టజెప్పింది. గత ఆసియా క్రీడల్లో ఇండియా టీమ్‌కు అధికారిక స్పాన్సర్‌గా ఉన్న లీ నింగ్.. 2020 ఒలింపిక్స్ వరకు టీమ్ ఇండియా అప్పరెల్ పార్ట్‌నర్‌గా వ్యవహరిస్తుంది.

ఆఖర్లో ఆదమరిచి...

- నాకౌట్ అవకాశాలు కోల్పోయిన ఇండియా
- చివరి లీగ్‌లో 0–1తో బహ్రెయిన్ చేతిలో ఓటమి
- ఆసియా కప్ ఫుట్‌బాల్

అబుదాబి: ఐదు దశాబ్దాల సుదీర్ఘ విరామం అనంతరం ఇండియా ఫుట్‌బాల్ జట్టు ఆసియాకప్ నాకౌట్‌కు చేరే అద్భుత అవకాశాన్ని చేజేతులా చెడగొట్టుకుంది. 90 నిమిషాల పాటు ప్రత్యర్థిని నిలువరించిన ఛెత్రి సేన ఇంజ్యూరీ టైమ్‌లో అనవసర తప్పిదానికి పాల్పడి ప్రత్యర్థికి గోల్ సమర్పించుకుంది. దీంతో ఉత్కంఠ భరితంగా సాగిన చివరి లీగ్ మ్యాచ్‌లో ఇండియా 0-1తో బహ్రెయిన్ చేతిలో ఓడింది. ఆ జట్టు తరఫున జమాల్ రషీద్ (91వ నిమిషంలో) నమోదు చేశాడు. ఈ మ్యాచ్‌ను కనీసం 'డ్రా' చేసుకున్నా నాకౌట్ అవకాశాలు ఉండేవి కానీ... చివరి క్షణాల్లో పట్టు సడలించే అలవాటును మరోసారి కొనసాగించిన టీమిండియా అందుకు తగిన మూల్యం చెల్లించుకుంది. 'ఫిఫా' ర్యాంకింగ్స్‌లో మనకంటే చాలా వెనుక ఉన్న బహ్రెయిన్ జట్టు ఈ మ్యాచ్‌లో తమ ఆటతీరుతో కట్టిపడేసింది. పదే పదే దాడులు చేస్తూ ఇండియా డిఫెన్స్‌కు కఠిన పరీక్ష పెట్టింది. అయితే ప్రత్యర్థి షాట్లను సమర్థంగా అడ్డుకున్నా... దాడులు చేయడంలో మన వాళ్లు వెనుకబడ్డారు. ఈ మ్యాచ్‌లో ఇండియా ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌పై 3 షాట్లు ఆడగా... బహ్రెయిన్ ఏకంగా 22 షాట్లు కొట్టింది. దీన్ని బట్టే ఆ జట్టు ఎంత దూకుడుగా ఆడిందో తెలుస్తోంది. దీంతో టీమిండియా ఆటగాళ్లకు ప్రత్యర్థి దాడులను కాచుకోవడంతోనే సరిపోయింది. ఒక దశలో భారత ఆటగాళ్లు 10 నిమిషాల పాటు కనీసం ప్రత్యర్థి నుంచి బంతిని అందుకోలేకపోయారంటే వారి ఆధిపత్యం ఎలా కొనసాగిందో అర్థం చేసుకోవచ్చు. చక్కటి డ్రిబ్లింగ్ నైపుణ్యంతో బంతిని తప్పిస్తూనే అలుపెరుగకుండా ప్రయత్నించిన బహ్రెయిన్ ఆటగాళ్లు చివరకు ఫలితం సాధించారు. ఈ ఓటమితో గ్రూప్ 'ఎ'లో రెండు మ్యాచ్‌ల్లో ఓడిన టీమిండియా చివరి స్థానంలో నిలిచి టోర్నీ నుంచి నిష్క్రమించింది. జట్టు ఓటమి పాలైనా గోల్ కీపర్ గురుప్రీత్ సింగ్ సంధు ఆకట్టుకున్నాడు. అతను చక్కటి నైపుణ్యంతో ప్రత్యర్థి గోల్స్‌ను అడ్డుకునే యత్నం చేశాడు.





గాయత్రి

రుత్విక్‌కు కాంస్యం

ఏపీ లిఫ్టర్ విష్ణు వర్దన్‌కు స్వర్ణం

పుణె: ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో తెలంగాణ సిమ్మర్ రుత్విక్ శ్రీ సత్తి కాంస్య పతకంతో మెరిశాడు. సోమవారం జరిగిన అండర్-17 బాలుర 50 మీటర్ల ఫ్రీ స్టయిల్ విభాగంలో రుత్విక్ 25.30 సెకండ్ల టైమింగ్‌తో మూడో స్థానంలో నిలిచాడు. ఇక, ఆంధ్రప్రదేశ్ వెయిట్ లిఫ్టర్ బండారి విష్ణువర్దన్ అండర్-17 జూనియర్ పురుషుల 102 కేజీల విభాగంలో 279 కిలోల బరువు ఎత్తి అగ్రస్థానంతో గోల్డ్ మెడల్ గెలిచాడు. అండర్-17 యూత్ మహిళల 81 కేజీల విభాగంలో రెడ్డి గాయత్రి మొత్తం 109 కిలోల బరువెత్తి రజతం సాధించింది. అలాగే, అండర్-17 జూనియర్ బాలుర 10 పది మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో ముకేశ్ (ఏపీ) కాంస్యం గెలిచాడు.

పాండ్యా, లోకేశ్ బేషరతు క్షమాపణ

ఎస్‌జీఎమ్ నిర్వహించాలని రాష్ట్ర సంఘాల డిమాండ్

న్యూఢిల్లీ: టీమిండియా నుంచి సస్పెండ్ అయిన క్రికెటర్లు హార్దిక్ పాండ్యా, లోకేశ్ రాహుల్ టీవీ షోలో మహిళల పట్ల చేసిన వ్యాఖ్యలపై బేషరతు క్షమాపణ కోరారు. అయినా వారి వివాదం ఇప్పట్లో ముగిసేలా కనిపించడం లేదు. బోర్డు తాజాగా జారీ చేసిన షోకాజ్ నోటీసులు అందుకున్న పాండ్యా, రాహుల్ బేషరతుగా క్షమాపణ చెబుతున్నట్టు సోమవారం ప్రకటించారు. ఈ వివాదంలో క్రికెటర్ల ప్రవర్తనను సరిచేయాలి గానీ.. వారి కెరీర్‌ను బీసీసీఐ అంతం చేయకూడదని సీవోఏ చీఫ్ వినోద్ రాయ్ సూచించారు. కానీ, దీనిపై విచారణకు అంబుడ్స్‌మన్‌ను నియమించేందుకు ప్రత్యేక సర్వసభ్య సమావేశం (ఎస్‌జీఎమ్) నిర్వహించాలని బీసీసీఐ పది అనుబంధ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో బోర్డు తాత్కాలిక అధ్యక్షుడు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.



దక్షిణాఫ్రికా క్లీన్‌స్వీప్

మూడో టెస్టులోనూ పాక్‌చిత్తు

జోహన్నెస్‌బర్గ్: పాకిస్తాన్‌తో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌ను 3-0తో దక్షిణాఫ్రికా క్లీన్‌స్వీప్ చేసింది. మూడో టెస్ట్‌లో పాక్ 107 రన్స్ తేడాతో ఓడిపోయింది 381 పరుగుల టార్గెట్‌తో నాలుగో రోజైన సోమవారం 152/3తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పాక్.. 273 పరుగులకు ఆలౌటైంది. అసద్ షఫీఖ్ (65), షాదాబ్ ఖాన్ (47 నాటౌట్) పోరాడినా మిగతా బ్యాట్స్‌మెన్ విఫలమయ్యారు. ఒలివర్, రబాడలకు మూడేసి వికెట్లు దక్కాయి. స్టెయిన్ రెండు వికెట్లతో రాణించాడు. డికాక్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, ఒలివర్‌కు మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డు దక్కింది.

ముర్రే కథ ముగిసె!

తొలి రౌండ్‌లోనే ఓడిన ఆండీ | కన్నీళ్లతో నిష్క్రమించిన బ్రిటన్ స్టార్ | ఫెడరర్, నడాల్, కెర్బర్, వోజ్నియాకి బోణీ | ప్రజ్నేష్ నిష్క్రమణ.. ఆస్ట్రేలియన్ ఓపెన్



మెల్‌బోర్న్: టెన్నిస్ సామ్రాజ్యంలో.. గ్రాండ్‌స్లామ్ మహా సంగ్రామాల్లో 'బిగ్ ఫోర్' ఎరాలో ఒక లెజెండ్ కెరీర్‌కు దాదాపు ఎండింగ్ కార్డ్ పడినట్టే. మిగతా ముగ్గురితో పోల్చితే మేజర్ టైటిళ్ల వేటలో వెనుకబడ్డా.. ఎన్నో ఏళ్లుగా గొప్పగా పోరాడుతున్న బ్రిటన్ టెన్నిస్ లెజెండ్ ఆండీ ముర్రే ఆస్ట్రేలియన్ ఓపెన్ కథ ముగిసింది. గాయాలతో బాధపడుతున్న ముర్రే మెగా టోర్నీ మొదటి రౌండ్‌లోనే ఓడిపోయాడు. సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ నెగ్గి కెరీర్‌కు వీడ్కోలు పలకాలని భావించిన అతడికి నిరాశే ఎదురైంది. ఇదే తనకు చివరి ఆస్ట్రేలియన్ ఓపెన్ అని టోర్నీ ప్రారంభానికి ముందు చెప్పిన బ్రిటన్ గ్రేట్ సోమవారం జరిగిన తొలి రౌండ్‌లో విజయం కోసం కడదాకా శ్రమించాడు. కానీ, ఆఖర్లో అద్భుతంగా ఆడిన 22వ సీడ్ బాటిస్టా అగట్ (స్పెయిన్) 6-4, 6-4, 6-7, 6-7, 6-2తో 230వ ర్యాంకర్ ఆండీపై ఉత్కంఠ విజయం సాధించాడు. తన కోసం పెద్ద సంఖ్యలో వచ్చిన అభిమానులకు చెమర్చిన కళ్లతో అభిమానులకు అభివాదం చేసిన ఆండీ.. తన కెరీర్‌పై ఈ వారంలో నిర్ణయం తీసుకుంటానని ప్రకటించాడు. ముర్రే నిష్క్రమణతో మెగా టోర్నీ సంచలనంతో ఆరంభమైనా.. డిఫెండింగ్ చాంప్ రోజర్ ఫెడరర్, స్పెయిన్ వీరుడు రఫెల్ నడాల్.. కెవిన్ అండర్సన్, మారిన్ సిలిచ్ తొలి రౌండ్‌ను అలవోకగా దాటేశారు. మహిళల మొదటి రౌండ్‌లో రెండో సీడ్ ఏంజెలిక్ కెర్బర్, మూడో సీడ్ కరోలినా వొజ్నియాకి, పెట్రా క్విటోవా, రష్యా స్టార్ మరియా షరపోవా కూడా సునాయస విజయాలతో బోణీ కొట్టారు. తొలిసారి మెగా టోర్నీకి అర్హత సాధించిన ఇండియా ప్లేయర్ ప్రజ్నేష్ గుణేశ్వరన్ మొదటి రౌండ్‌లోనే ఓడి నిరాశ పరిచాడు.

రాడ్ లేవర్ ఎరీనాలో జరిగిన మ్యాచ్‌లో స్విస్ లెజెండ్ రోజర్ ఫెడరర్ 6-3, 6-4, 6-4తో వరుస సెట్లలో డెనిస్ ఇస్టోమిన్ (ఉజ్బెకిస్తాన్)ను చిత్తుగా ఓడించాడు. రెండో సీడ్ రఫెల్ నడాల్ 6-4, 6-3, 7-5తో జేమ్స్ డక్‌వర్త్ (ఆస్ట్రేలియా)ను చిత్తు చేశాడు. ఇతర మ్యాచ్‌ల్లో ఐదో సీడ్ కెవిన్ అండర్సన్ (సౌతాఫ్రికా) 6-3, 5-7, 6-2, 6-1తో అడ్రియన్ మనారినో (ఫ్రాన్)పై, ఆరో సీడ్ మారిన్ సిలిచ్ (క్రొయేషియా) 6-2, 6-4, 7-3 తో బెర్నార్డ్ టొమిక్ (ఆస్ట్రేలియా)పై నెగ్గారు. పదో సీడ్ కరెన్ కచనోవ్ (రష్యా), గైల్ మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్) కూడా బోణీ కొట్టారు. కానీ, తొమ్మిదో సీడ్ జాన్ ఇస్నర్ (అమెరికా) 6-7, 6-7, 7-6, 6-7తో సహచర ప్లేయర్ ఒపెల్కా చేతిలో పోరాడి ఓడిపోయాడు. బ్రిటన్ యంగ్ సెన్సేషన్, 13వ సీడ్ కైల్ ఎడ్మండ్ 3-6, 0-6, 5-7తో థామస్ బెర్డిచ్ (చెక్ రిపబ్లిక్) చేతిలో కంగుతిన్నాడు. ఇండియా నుంచి సింగిల్స్‌లో అర్హత సాధించిన ఏకైక ప్లేయర్ ప్రజ్నేష్ గుణేశ్వరన్ 6-7 (7/9), 3-6, 3-6తో ఫ్రాన్సెస్ టియాఫో (అమెరికా) చేతిలో పోరాడి ఓడిపోయాడు.





255 నిమిషాలు పోరాడి..

చాలా కాలంగా తుంటి గాయంతో బాధపడుతున్న ఆండీ ముర్రే మెల్‌బోర్న్‌లో బోణీ కొట్టేందుకు తీవ్రంగా ప్రయత్నించాడు. ఆసీస్ ఓపెన్‌లో నాలుగు సార్లు రన్నరప్‌గా నిలిచిన బ్రిటన్ స్టార్.. ఈ సారి తొలి రౌండ్‌లోనే ఓటమిని తప్పించుకునేందుకు నొప్పిని సైతం దిగమింగి గొప్పగా పోరాడాడు. ఏకంగా నాలుగు గంటల 9 నిమిషాల పాటు సాగిన ఈ మారథాన్ పోరులో తొలి రెండు సెట్లు కోల్పోయిన ముర్రే అసాధారణ రీతిలో పుంజుకున్నాడు. మూడో సెట్‌ను టై బ్రేక్‌లో గెలుచుకొని మ్యాచ్‌లో నిలిచాడు. నాలుగో సెట్‌ను కూడా టై బ్రేక్‌లో నెగ్గినప్పటికీ.. అప్పటికే పూర్తిగా అలసిపోయిన బ్రిటన్ స్టార్ ఐదో సెట్‌లో చేతులెత్తేశాడు. ముర్రే 19 ఏస్‌లతో విజృంభించినప్పటికీ ఐదు బ్రేక్ పాయింట్లలో ఒక దాన్నే గెలిచాడు. రెండు డబుల్ ఫాల్ట్స్, 51 అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకున్నాడు. ఏడు ఏస్‌లే కొట్టిన 23 ర్యాంకర్ అగట్ పది బ్రేక్ పాయింట్లులో ఐదింటిని సద్వినియోగం చేసుకున్నాడు. సర్వీస్‌లు.. రిటర్న్స్‌లో మెరుగ్గా ఆడడంతో పాటు పెద్దగా తప్పిదాలు చేయకుండా ఆండీపై పైచేయి సాధించాడు.

స్టార్ల జోరు..

మహిళల సింగిల్స్‌లో స్టార్ ప్లేయర్లు అదరగొట్టారు. డిఫెండింగ్ చాంపియన్ కరోలిన్ వోజ్నియాకి (డెన్మార్క్) టైటిల్ వేటను షురూ చేసింది. మొదటి రౌండ్‌లో మూడో సీడ్ వోజ్నియాకి 6-3, 6-4తో అలిసన్ వాన్ (బెల్జియం)ను ఓడించింది. రెండో సీడ్ ఏంజెలిక్ కెర్బర్ (జర్మనీ) 6-2, 6-2తో పోలొనా హెర్కాగ్ (స్లొవేనియా)ను చిత్తు చేయగా.. ఎనిమిదో సీడ్ పెట్రా క్విటోవా (చెక్ రిపబ్లిక్) 6-3, 6-2తో రిబరికోవా (స్లొవేకియా)పై నెగ్గింది. అమెరికా యంగ్‌స్టర్, ఐదో సీడ్ స్లోన్ స్టీఫెన్స్ 6-4, 6-2తో సహచర ప్లేయర్ టౌన్సెండ్‌ను ఓడించింది. అంచనాలు లేకుండా బరిలోకి దిగిన 30వ సీడ్, రష్యా స్టార్ మరియా షరపోవా 6-0, 6-0తో హరీట్ డార్ట్ (బ్రిటన్)పై ఒక్క గేమ్ కూడా కోల్పోకుండా విజయం సాధించడం విశేషం. తొమ్మిదో సీడ్ కికి బర్టెన్స్ (నెథర్లాండ్స్), 19వ సీడ్ కరోలిన్ గార్సియా (ఫ్రాన్స్) కూడా తొలి రౌండ్‌ను దాటగా.. 22వ సీడ్ జెలెనా ఒస్తాపెంకో (లాత్వియా), 14వ సీడ్ జులియా జార్జెస్ (జర్మనీ) ఇంటిదారి పట్టారు. కాగా, 2015 సెమీఫైనలిస్ట్ ఎకతరీనా మకరోవా (రష్యా)ను 6-0, 4-6, 7-6 (9/6)తో ఓడించిన కటీ బౌల్టర్ (బ్రిటన్) ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో కొత్తగా ప్రవేశ పెట్టిన సూపర్ టై బ్రేక్‌లో గెలిచిన ప్లేయర్‌గా నిలిచింది.

సమర్పిస్తారా సమం చేస్తారా!

సిరీస్ ఆరంభానికి ముందు ఎటుచూసినా... టీమిండియా బ్యాటింగ్ లైనప్‌ను ఆసీస్ కుర్ర బౌలర్లు అడ్డుకోగలరా అనే చర్చే. ఒక్క మ్యాచ్ ముగిసిందో లేదో సీన్ రివర్సైంది. విజృంభిస్తారనుకున్న బ్యాట్స్‌మెన్ పూర్తిస్థాయిలో సత్తా చాటకపోవడంతో ఫేవరెట్‌గా బరిలో దిగిన కోహ్లీసేన ప్రస్తుతం సిరీస్ కోల్పోయే ప్రమాదంలో పడింది. స్టార్క్, కమిన్స్, హేజిల్‌వుడ్ వంటి బౌలర్లు లేకున్నా మా బెంచ్ బలంగానే ఉందంటూ కొత్త కుర్రాళ్లు రిచర్డ్‌సన్, బెరెన్‌డార్ఫ్ రుజువు చేసుకున్నారు. అండర్‌డాగ్స్‌గా ఉన్న ఆసీస్‌ను ఆధిక్యంలో నిలిపారు.



- కోహ్లీసేనకు పరీక్ష
- ఆశల పల్లకిలో ఆసీస్
- నేడు రెండో వన్డే
- ఉదయం 8.50 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

అడిలైడ్: పొట్టి ఫార్మాట్‌లో సిరీస్ పంచుకొని సరిపెట్టుకొని... టెస్టుల్లో చారిత్రాత్మక సిరీస్ విజయంతో ఊపు మీదున్న టీమిండియా ప్రపంచకప్ నామ సంవత్సరాన్ని విజయంతో ప్రారంభించాలనుకుంటే తొలి వన్డేలో షాక్ తగిలింది. మూడు వన్డేల సిరీస్‌లో 0-1తో వెనుకబడిన కోహ్లీసేన అడిలైడ్ వేదికగా మంగళవారం జరగనున్న కీలక పోరుకు రెడీ అయింది. గత మూడేళ్లుగా టాపార్డర్‌లో టన్నుల కొద్ది పరుగులు చేసిన రోహిత్ శర్మ, శిఖర్ ధవన్, విరాట్ కోహ్లీల్లో ఇద్దరు విఫలం కావడంతో ఫలితం ఇండియాకు ప్రతికూలంగా వచ్చింది. సిడ్నీ మ్యాచ్ తప్పిదాలను సరిదిద్దుకొని బ్యాటింగ్‌లో సత్తా చాటితే భారత్‌కు తిరుగుండదు. 'హిట్ మ్యాన్' భారీ సెంచరీతో మంచి టచ్‌లో ఉన్నాడు. చాన్నాళ్ల తర్వాత వెటరన్ మహేంద్ర సింగ్ ధోనీ ఓ మంచి ఇన్నింగ్స్ ఆడినా... బంతులు ఎక్కువ వృథా చేయడం చివర్లో ప్రభావం చూపింది. మరోవైపు 2017 జనవరి తరువాత ఆడిన 18 మ్యాచ్‌ల్లో కేవలం రెండింట్లోనే గెలిచిన ఆసీస్... తొలి వన్డే విజయం ఇచ్చిన ఆత్మవిశ్వాసంతో ఇక్కడే సిరీస్ దక్కించుకోవాలనే పట్టుదలతో ఉంది.

కార్తీక్ స్థానంలో జాదవ్!...

తొలి వన్డేలో పేసర్ ఖలీల్ భారీగా పరుగులివ్వడంతో పాటు, ఆల్‌రౌండర్ లోటు స్పష్టమవడంతో మిడిలార్డర్‌లో కార్తీక్ స్థానంలో జాదవ్‌ను ఆడించాలని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. ఆరోస్థానంలో భారీ షాట్లు కొట్టడంతో పాటు తన వైవిధ్య లైనప్‌తో 10 ఓవర్లు బౌలింగ్ చేయగల జాదవ్ జట్టులో చేరితే అదనపు బలం చేకూరనుంది. సిడ్నీలో ఆడిన తొలి బంతికే వికెట్ల ముందు దొరికిపోయిన ధవన్, క్లియర్ ఔట్‌కు రివ్యూ వృథా చేసిన రాయుడు తమ తప్పులు సరిదిద్దుకోవాల్సి ఉంది. ఇక ఎప్పుడో కానీ విఫలం కాని పరుగుల యంత్రం విరాట్ కోహ్లీ తన బ్యాటింగ్ పదును చూపితే ప్రత్యర్థికి తిప్పలు తప్పకపోవచ్చు. మిడిలార్డర్‌లో ధోనీ రాణించినా బంతులు ఎక్కువ తీసుకోవడంతో అతనిపై విమర్శలు వస్తున్నాయి. నాలుగో ఓవర్‌లోనే క్రీజులోకి వచ్చిన ధోనీ సంయమనం చూపకపోయి ఉంటే జట్టు చాలా ముందే కుప్పకూలేదన్న రోహిత్ మాటలను బట్టి చూస్తే అదేమంత పెద్ద ఇబ్బందిగా తోచడం లేదు. ధోనీ నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేస్తే బాగుంటుందనే రోహిత్ అభిప్రాయాన్ని మేనేజ్‌మెంట్ పరిగణలోకి తీసుకుంటుందేమో చూడాలి. బౌలర్లు ఫర్వాలేదనిపించడంతో మార్పులు ఉండకపోవచ్చు.

జోరుమీదున్న ఆసీస్...

సిడ్నీ వన్డే విజయం ఇచ్చిన ఊపులో ఉన్న కంగారూలు ఈ మ్యాచ్‌లోను నెగ్గాలని పట్టుదలగా ఉంది. మిడిలార్డర్ చక్కగా రాణించడంతో మంచి స్కోరు చేసిన ఆసీస్ ఈ మ్యాచ్‌లోనూ అదే జట్టుతో బరిలో దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత మ్యాచ్‌లో బరిలో దిగని మిచెల్ మార్ష్ సెలక్షన్‌కు అందుబాటులోకి రావడంతో అతన్ని ఎవరి స్థానంలో తీసుకుంటారో చూడాలి. సిడ్నీలో అదరగొట్టిన కొత్త పేసర్లు రిచర్డ్‌సన్, బెరెన్‌డార్ఫ్ అదే జోరు కనబర్చాలని టీమ్ ఆశిస్తోంది. 6 వికెట్లు పడగొట్టి టీమిండియా నడ్డి విరిచిన ఈ కుర్ర ద్వయం మరోసారి చెలరేగితే కోహ్లీ సేనకు ఇబ్బందులే. కెప్టెన్ ఫించ్ కూడా భారీ ఇన్నింగ్స్ ఆడితే ఆసీస్‌కు తిరుగుండదు. ఏడో నెంబర్‌లో మ్యాక్స్‌వెల్‌లాంటి హిట్టర్ ఉన్నాడంటే ఆసీస్ లైనప్ ఎంత బలంగా ఉందో అర్థమవుతోంది.

'బుమ్రా గైర్హాజరీలో యార్కర్లపై దృష్టిపెట్టా. కొత్త బంతిని స్వింగ్ చేస్తూ వికెట్లు పడగొట్టొచ్చు. పాత బంతితో అది సాధ్యం కాదు. అందుకే స్లో డెలివరీలు, యార్కర్లు ప్రాక్టీస్ చేస్తున్నా. అడిలైడ్‌లో బౌండరీ చిన్నగా కనిపిస్తోంది. భారీ స్కోర్లకు అవకాశం ఉండొచ్చు. రివర్స్ స్వింగ్ గురించి ఇప్పుడే చెప్పలేం. ఓవరాల్‌గా బ్యాటింగ్ వికెట్‌లా కనిపిస్తోంది'

- భువనేశ్వర్ కుమార్




యాపిల్ సగమైంది

- ఇండియాలో 50 శాతానికి పడిపోయిన అమ్మకాలు
- వన్‌ప్లస్ గట్టి పోటీ.. ఇప్పటికే 37 శాతం మార్కెట్

ఇండియాలో మార్కెట్ పెంచుకుందామనుకున్న యాపిల్ ప్రయత్నాలపై వన్‌ప్లస్ నీళ్లు చల్లింది. అమెరికా కంపెనీ ఫోన్ల అమ్మకాలపై చైనా కంపెనీ భారీగా దెబ్బకొట్టింది. వన్‌ప్లస్ ప్రభావం ఎంతలా ఉందంటే గతేడాది ఐఫోన్ అమ్మకాలు 50 శాతం పడిపోయాయి. 2017లో 32 లక్షల ఫోన్లు అమ్మిన కంపెనీ 2018లో కేవలం 17 లక్షలే విక్రయించింది. ఇండియాలో స్మార్ట్‌ఫోన్ల విభాగంలో వన్‌ప్లస్ ఇప్పటికే 37 శాతానికి పైగా ఆక్రమించేసింది. హాంకాంగ్‌కు చెందిన కౌంటర్‌పార్ట్ తన సర్వేలో ఈ వివరాలు వెల్లడించింది. కొత్తకొత్త స్మార్ట్‌ఫోన్ల నుంచి తీవ్రమైన పోటీ ఉండటం, ఈమధ్య విడుదలైన ఐఫోన్ ఎక్స్‌ఎస్ మాక్స్, ఐఫోన్ ఎక్స్‌ఆర్ ధరలు ఆకాశాన్ని తాకుతుండటంతో ఐఫోన్లపై జనాలు ఆసక్తి చూపించడం లేదని చెప్పింది. ఆఫర్ ఇచ్చిన తర్వాత కూడా ఫోన్ ధర రూ.70 వేలకు పైన ఉంటే ఎవరు కొంటారని కొందరు ప్రశ్నిస్తున్నారని చెప్పింది. ప్రస్తుతం యాపిల్ ఫోన్ల ధర రూ.28,310 నుంచి మొదలవగా వన్‌ప్లస్ ఫోన్లు రూ.11 వేల నుంచే ఉన్నాయి. 2018లో భారీ నష్టాలు రావడంతో 2019లోనైనా వాటిని తగ్గించుకోవాలని యాపిల్ ప్రయత్నాలు మొదలెట్టింది. ఫోన్ ధర తగ్గించడానికి ఇండియా లాంటి దేశాల్లో, అక్కడే ఐఫోన్లు తయారు చేసి, అమ్మాలని భావిస్తోంది.

త్వరలో వన్‌ప్లస్ 7

ఈమధ్యే వన్‌ప్లస్ 6టీని మార్కెట్లోకి విడుదల చేసింది. త్వరలోనే వనప్లస్ 7ను పరిచయం చేయాలనుకుంటోంది. ఈ ఏడాది మేలో ఫోన్‌ను విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. స్నాప్‌డ్రాగన్ 855 ఎస్‌వోసీ ప్రాసెసర్‌లో వస్తున్న వన్‌ప్లస్ 7కు సంబంధించి ఓ ఫొటో ఇప్పటికే బయటకు లీకైంది. ఫోన్‌కు ప్రత్యేకంగా ప్రొటెక్టివ్ కవర్ ఉంటుందని తెలిసింది. ఇక మరో 5జీ ఫోన్‌నూ మేలోనే రిలీజ్ చేస్తామని కంపెనీ సీఈవో ఈమధ్య వెల్లడించారు. వన్‌ప్లస్ 7కు, దీనికి పోలిక ఉండదని.. వన్‌ప్లస్ 6టీ కన్నా ధర ఎక్కువే ఉంటుందని చెప్పారు.



క్రేజీ హీరోయిన్‌ను బీట్ చేసిన గుడ్డు

ప్రముఖ హాలీవుడ్ నటిని కోడిగుడ్డు బీట్ చేసింది. కొంచెం ఆశ్చర్యంగా అనిపించినా ఇది నిజం. కైలీ జెన్నర్ పేరిట ఉన్న ప్రపంచ రికార్డును గుడ్డు చెరిపేసింది. సోషల్‌మీడియాలో ఎక్కువ ఫాలోవర్లు ఉన్న సెలబ్రిటీలలో కైలీ ఒకరు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెకు 12.3 కోట్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. గతేడాది ఫిబ్రవరిలో కైలీ తన కుమార్తె, తన బొటన వేలిని పట్టుకున్నట్లుగా ఉన్న ఓ ఫొటోను ఇన్‌స్టాలో షేర్ చేసుకున్నారు. దీనికి నెటిజన్లు ఫిదా అయిపోయారు. దాదాపు 1.8 కోట్ల మంది లైక్ చేసేశారు. దీంతో ఇన్‌స్టాలో అత్యధిక లైక్స్ పొందిన ఫొటోగా అది రికార్డు సృష్టించింది. మరి కోడిగుడ్డు, కైలీ జెన్నర్‌ను ఎలా బీట్ చేసిందంటారా? 'ఎగ్ గ్యాంగ్' అనే ఖాతా నుంచి ముదురు గోధుమ రంగులోని కోడిగుడ్డు ఫొటో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ అయింది. దాని రంగు ముగ్ధులైన నెటిజన్లు లైక్స్ వేసుకోవడం, షేర్ చేయడం మొదలెట్టారు. అలా కోడిగుడ్డు కంప్యూటర్లలో, మొబైళ్లలో తిరుగుతూ జెన్నర్ రికార్డును తుడిచిపెట్టేసింది. దాదాపు 1.82 కోట్ల మంది కోడిగుడ్డును లైక్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న జెన్నర్‌కు అసూయ కలిగినట్లుంది, గోధుమ రంగులో ఉన్న కోడిగుడ్డును నేలపై పడేస్తున్నట్లు ఓ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె పోస్టు చేసింది.



టైగర్ టాయిలెట్‌కి సై

నీళ్లతో పని లేదు, దుర్వాసన రాదు

ఆ పురుగులకు వెన్నుపూస లేకపోవచ్చు, కానీ అవి ఇండియాలోని 4 వేల టాయిలెట్స్ డ్రైనేజీ భారాన్ని మోస్తున్నాయి! చూడటానికి మామూలు టాయిలెట్‌లానే కనిపించే 'టైగర్ టాయిలెట్స్'లో నీళ్ల అవసరం ఉండదు. దుర్వాసన రాదు. ఈ కారణమే ఇళ్లు, స్కూళ్ల బయట టైగర్ టాయిలెట్లు కట్టుకునేలా చేస్తోంది. 2015లో తొలిసారిగా ఇండియాలో టైగర్ టాయిలెట్‌ను కట్టారు. దీని ప్రత్యేకత తెలుసుకున్న వాళ్లందరూ కట్టుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికి దేశవ్యాప్తంగా నాలుగు వేలకు పైగా టైగర్ టాయిలెట్స్ ఉన్నాయి.

టాయిలెట్‌లో పురుగులు!

టైగర్ టాయిలెట్‌ను ఇతర టాయిలెట్ల కంటే ప్రత్యేకంగా నిలబెట్టిందేంటో తెలుసా? టైగర్ పురుగులు. ఇవి ఆవు, గుర్రం పేడలో ఎక్కువగా కనిపిస్తాయి. దాన్ని విచ్ఛిన్నం చేసి బతుకుతాయి. సంతానోత్పత్తి చేస్తాయి. టాయిలెట్‌ను కట్టేటప్పుడు లోపల కొన్ని టైగర్ పురుగుల్ని వేస్తారు. టాయిలెట్ వాడకం మొదలైన తర్వాత అవి మలంపై ఆధారపడి బతకడం మొదలుపెడతాయి. ఇలా ఎప్పటికప్పుడు టాయిలెట్‌ను క్లీన్ చేసేస్తుంటాయి. దీనికి వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌తో కూడా పని లేదు. దోమలు, ఇతర జీవులు ఈ టాయిలెట్‌లో బతకలేవు. వీటికి టైగర్ టాయిలెట్ అనే పేరు పురుగుల వల్లే వచ్చింది. ఒక్కో టాయిలెట్‌కు 25 వేల దాకా ఖర్చవుతుంది.

టాయిలెట్స్ వెనుక బిల్ గేట్స్ ఫౌండేషన్

ఇండియాలో టైగర్ టాయిలెట్స్ వెనుక బిల్ అండ్ మిలిండా గేట్స్ ఫౌండేషన్ కృషి, పట్టుదల ఉన్నాయి. టైగర్ టాయిలెట్స్ టెక్నాలజీని డెవలప్ చేసేందుకు లండన్‌లోని హైజీన్ అండ్ ట్రాపికల్ మెడిసిన్ స్కూల్‌కు ఫౌండేషన్ 34 కోట్ల రూపాయలు అందించింది. అంతా సిద్ధమయ్యాక, ఇండియా, మయన్మార్, ఉగాండాల్లో దీన్ని టెస్ట్ చేసేందుకు 12 లక్షల రూపాయలు ఇచ్చింది. ప్రపంచవ్యాప్తంగా టైగర్ టాయిలెట్స్ టెక్నాలజీని విస్తరించేందుకు ఫౌండేషన్ తరఫున మరో 141 కోట్ల రూపాయలు ఖర్చు చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని బిల్ గేట్స్ ఇటీవల ప్రకటించారు.

పురుగులు ఏం చేస్తాయి?

టైగర్ పురుగులకు వేస్ట్‌ను తినడమంటే మహా ఇష్టం. ఇదే వాటిని కంపోస్టింగ్‌కు చిరునామాగా మార్చింది. టైగర్ పురుగులు టాయిలెట్ల నుంచి బయటకు వెళ్లవు. సాధారణ నేలలో అవి ఉండలేవు. వాటికి ఎప్పుడూ మలం కావాలి. అందుకే అది దొరికే చోటును వదలడానికి ఇష్టపడవు. ఒకసారి టాయిలెట్‌ను వాడిన తర్వాత చిన్న బకెట్ నీళ్లు అవసరం అవుతాయి. ఆటోమేటిక్ ఫ్లషింగ్ సిస్టంను టైగర్ టాయిలెట్స్‌కు అమర్చలేం. కిందికి వెళ్లిన మలాన్ని పురుగులు విచ్ఛిన్నం చేసి, 99 శాతం బ్యాక్టీరియాను చంపేస్తాయి. కేవలం 15 శాతం కంపోస్ట్ మెటీరియల్‌ను మాత్రమే మిగులుస్తాయి. మిగతాది నీళ్లు, కార్బన్ డయాక్సైడ్‌గా మారిపోతుంది. అంటే మన సెప్టిక్ ట్యాంక్ కంటే బాగా పని చేస్తుందన్నమాట. కంపోస్ట్ మెటీరియల్‌లో నైట్రోజన్, పాస్ఫరస్, కార్బన్, పొటాషియం పదార్థాలు ఎక్కువ మొత్తంలో ఉంటాయి. పంటలకు ఎరువుగా పనికొస్తాయి. పురుగులు మలాన్ని విచ్ఛిన్నం చేయడం వల్ల వచ్చే భిన్నమైన వాసనకు దోమలు, ఇతర జీవులు టాయిలెట్లో ఉండలేవు.

ఐదేళ్లుగా నో కంప్లయింట్స్

ఐదేళ్ల క్రితం ప్రారంభించిన టైగర్ టాయిలెట్స్‌పై నేటి వరకూ ఒక్క కంప్లయింట్ కూడా రాలేదు. విపరీతంగా సంతానోత్పత్తి చేస్తున్న టైగర్ పురుగులు, మలాన్ని ఎప్పటికప్పుడు క్లీన్ చేసేస్తున్నాయి. ఎనిమిది నుంచి 10 ఏళ్ల తర్వాత టాయిలెట్‌కు మెయింటెనెన్స్ అవసరం అవుతుందని టైగర్ టాయిలెట్స్ కంపెనీ పేర్కొంది. పురుగుల బిన్‌ను బయటకు తీసి నిండిన వేస్ట్‌ను తొలగించుకుంటే చాలంది. మళ్లీ బిన్‌ను లోపల పెడితే పదేళ్ల వరకూ పని చేస్తుందని వివరించింది.

ప్రజలకు ఈ టాయిలెట్ల అవసరం ఉందా?

టైగర్ టాయిలెట్స్ ప్రాణాంతక జబ్బుల నుంచి మనుషుల్ని కాపాడతాయి. ఏటా ప్రపంచవ్యాప్తంగా 5.25 లక్షల మంది ఐదేళ్లలోపు పిల్లలు నీళ్ల విరేచనాల కారణంగా చనిపోతున్నారు. అపరిశుభ్రమైన టాయిలెట్ల వల్లే ఎక్కువ మంది జబ్బు బారిన పడుతున్నారని డబ్ల్యూహెచ్‌వో తేల్చింది. స్వచ్ఛ భారత్ ద్వారా దేశంలో కట్టిన టాయిలెట్లను ఉత్తరభారతదేశంలోని గ్రామీణ ప్రజలు వాడటం లేదని 2018లో సర్కారు చేసిన ఓ సర్వేలో వెల్లడైంది.





మాగ్నెట్ థెరపీతో మంచిగైతదా?

- సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని, ఖర్చు తక్కువంటూ పబ్లిసిటీ
- చికిత్సతో ఉపయోగం ఉండదన్న కొన్ని పరిశోధనలు

ప్రాచీన ప్రకృతి వైద్య విధానాలకు ప్రచారం కల్పిస్తూ వస్తున్న కేంద్రం.. నవంబర్ 18న నేచురోపతి డే సందర్భంగా మాగ్నెట్ థెరపీ ప్రచారం ప్రారంభించింది. నేచురోపతిలో మాగ్నెట్ థెరపీ ఓ భాగమని, శరీరానికి అయస్కాంతాలు ధరించడం వల్ల వివిధ రోగాలు నయం చేయొచ్చని ట్విట్టర్‌లో ఆయుష్ శాఖ పోస్టు చేసింది. దాని వల్ల సైడ్ ఎఫెక్ట్స్ ఏమీ ఉండవని, ట్రీట్‌మెంట్‌కు అయ్యే ఖర్చు తక్కువేనంది. మాగ్నెట్ థెరపీ అంటే అయస్కాంతాలతో చికిత్స చేయడం. ఇందులో భాగంగా అయస్కాంతాలను శరీరంపై పెట్టి లేదా ఆభరణాల్లా వేసి ట్రీట్‌మెంట్ చేస్తారు. డాక్టర్లు చెప్పేవరకూ అవి అలానే ఒంటిపై ఉంచుకోవాలి. మన శరీరంలోని కణాలు ఎలక్ట్రోమాగ్నెటిక్ స్పందనలు విడుదల చేస్తాయని, జబ్బులొచ్చినపుడు, దెబ్బలు తాకినపుడు ఈ స్పందనలకు అంతరాయం కలుగుతుందని మాగ్నెట్ థెరపీ డాక్టర్లు చెబుతారు. మైగ్రెయిన్, ఆర్థరైటిస్, ఒత్తిడి సంబంధిత జబ్బులను ఈ చికిత్సతో తగ్గించవచ్చంటారు. కానీ కొందరు పరిశోధకులు మాత్రం మాగ్నెట్ చికిత్స వల్ల ఉపయోగం లేదని, దాని ప్రభావం ఉత్తుత్తిదేనని తేల్చి చెబుతున్నారు.

రక్త ప్రసరణ వేగం పెంచుతుందా?

ఎర్ర రక్తకణాల్లోని హిమోగ్లోబిన్‌లో ఇనుము ఉంటుంది. శరీర భాగాలకు ఆక్సిజన్‌ను ఇదే మోసుకెళ్తుంది. ఆక్సిజన్ లేని ఎర్రరక్త కణాలు గుండె నుంచి ఊపిరితిత్తులకు వెళ్లి అక్కడ ఆక్సిజన్ తీసుకుంటాయి. అయస్కాంతానికి ఇనుమును ఆకర్షించే గుణం ఉంది. కాబట్టి ఎర్రరక్త కణాల్లోని ఇనుమునూ అయస్కాంతం ఆకర్షించాలి. అయితే రక్తంలోని ఇనుముకు ఫెర్రో మాగ్నెటిక్ గుణం లేదని 1936లో నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ వెల్లడించింది. అంటే అయస్కాంతం ఆ ఇనుమును ఎక్కువగా ఆకర్షించదన్నమాట. అంతేగాకుండా ఆక్సిజన్ ఉన్న రక్తం, ప్లాస్మా డయామాగ్నెటిక్ గుణం కలిగి ఉంటుందని, పైగా అయస్కాంతాన్ని వికర్షిస్తుందని చెప్పింది. ఆక్సిజన్ లేని రక్తం మాత్రం కాస్త పారా మాగ్నెటిక్ గుణం కలిగి ఉంటుందని, కాబట్టి అయస్కాంతం కాస్త లాగగలదని వెల్లడించింది. కానీ రక్తం ప్రవహించే స్పీడుకు అయస్కాంతం గుణం ఏమాత్రం పని చేయదదంది. ఆరోగ్యవంతులైన కొందరికి ఒక చేతిలో అయస్కాంతం పట్టుకొని రక్తపోటును పరిశీలిస్తే మామూలు చేయిలో రక్తపోటుకు, అయస్కాంతమున్న చేతిలో రక్త ప్రవాహానికి తేడా కనిపించలేదని సైంటిస్టులు చెప్పారు.

శరీరంలోకి కూడా చొచ్చుకుపోలేవు

మాగ్నెటిక్ రెసొనెన్స్ ఇమేజింగ్ (ఎంఆర్ఐ) పరికరాలు రక్తం ఆక్సిజన్‌ను కోల్పోవడం, గ్రహించడంపై ఆధారపడి పని చేస్తాయి. రక్తంలో ఆక్సిజన్ పరిమాణం ఆధారంగా మెదడు, వెన్నెముక లాంటి శరీర భాగాల నిర్మాణాలను ఎంఆర్ఐ చూపిస్తుంది. ఎంఆర్ఐ మెషీన్లు ఉత్పత్తి చేసే అయస్కాంత క్షేత్రం ప్రభావం చాలా ఎక్కువగా ఉన్నా వాటి ప్రభావం శరీరంపై ఉండదు. శరీరానికి బిగించే కొన్ని లోహ పరికరాలతోనే ఆ మెషీన్లు పని చేస్తాయి. అలాగే మెదడులోని నాడీ కణాల చికిత్సకు వాడే ట్రాన్స్ క్రానియల్ మాగ్నెటిక్ స్టిములేషన్ (టీఎంఎస్) పద్ధతిలోనూ రెండు అయస్కాంత కాయిల్స్ వాడుతారు. వీటి వల్ల కూడా శరీరంపై అయస్కాంతం ప్రభావం ఉండదని తేలింది. శక్తిమంతమైన అయస్కాంతాల ప్రభావమే శరీరంపై ఉండనపుడు మాగ్నెట్ చికిత్సకు వాడే తక్కువ శక్తి గల శాశ్వత అయస్కాంతాల ప్రభావం ఏ మేరకు ఉంటుంది. కనీసం శరీరంలోకి కూడా చొచ్చుకుపోలేవు.

మాగ్నెట్ థెరపీతో నొప్పి తగ్గించొచ్చా?

మాగ్నెట్ థెరపీతో 45 నిమిషాల్లో నొప్పి తగ్గించొచ్చట. 4 వారాలు అయస్కాంతం ధరిస్తే పెల్విక్ పెయిన్ తగ్గుతుందని పరిశోధకులు వెల్లడించారు. చాలా మంది దీన్ని కొట్టి పారేశారు. చికిత్సపై పేషెంట్లకు ఉన్న నమ్మకం వల్లే నొప్పి తగ్గిందన్నారు. అయస్కాంతాల వల్ల నొప్పి తగ్గదని చెప్పారు.

చికిత్సపై భిన్న వాదనలు

అసలు మాగ్నెట్ థెరపీ పని చేస్తుందో లేదో తెలుసుకోడానికి కొందరు పరిశోధకులు రీసెర్చ్ చేశారు. 2007లో పిట్లర్, అతని సహచరులు చేసిన పరిశోధనలో డయాబెటిక్ పెరిఫెరల్ న్యూరోపతి, వెన్ను, కాళ్ల నొప్పిని ఈ చికిత్స తగ్గించలేదని తేలింది. ముసలితనం వల్ల వచ్చే కీళ్ల నొప్పుల విషయంలోనూ ఫలితం కనబడలేదు. 2007లోనే మరో పరిశోధకుడు సెపెడా, తన సహచరులు ఈ చికిత్సపై పరిశోధన చేశారు. వివిధ రకాల నొప్పులతో బాధపడుతున్నవాళ్లలో కొందరికి సాధారణ, మరికొందరికి డమ్మీ అయస్కాంతాలిచ్చారు. అందరి విషయంలో ఒకే ఫలితం వచ్చింది. దీన్నిబట్టి చికిత్స తీసుకుంటున్నామన్న రోగులు భావన వల్లే నొప్పి తగ్గిందని వారు చెప్పారు.




టెలికాం నెట్‌వర్క్‌ను కుప్పకూల్చాడు

హ్యాకర్ దెబ్బకు విలవిల్లాడిన లైబీరియా

ఓ ప్రత్యర్థి టెలికాం కంపెనీ చేసిన పని లైబీరియా దేశ టెలీ నెట్‌వర్క్‌ను కుప్పకూల్చింది. 'లోన్‌స్టార్' లైబీరియాలో అతి పెద్ద టెలికాం నెట్‌వర్క్. దానిపై ప్రత్యర్థి సెల్‌కామ్ కంపెనీ ప్రొఫెషనల్ హ్యాకర్ డానియల్ కయేతో దాడి చేయించింది. ఇందుకు అతడికి ఆరు లక్షల డాలర్లు ఇచ్చింది. డానియల్ 2015లో లోన్‌స్టార్ సర్వర్లను హ్యాక్ చేశాడు. చేశాడు. ఆ దెబ్బకు లోన్‌స్టార్ నెట్‌వర్క్ కుప్పకూలింది. 2017లో జర్మనీకి చెందిన ఓ నెట్‌వర్క్‌నూ డానియెల్‌పై దాడులు జరిపాడు. అతన్ని జర్మనీ అరెస్టు చేసింది. పోయిన శుక్రవారం అతను తన నేరాలను అంగీకరించాడు.

జ్యూస్ తాగాడు.. గుడ్డు తిన్నాడు

రాహుల్ బీఫ్ తినడం, రూ. 1.35 లక్షల భోజనం ఉత్త ప్రచారమే



కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ రాహుల్‌గాంధీ దుబాయ్‌లో బీఫ్ తిన్నాడని, అది కూడా ఓ ఫైవ్‌స్టార్ హోటల్లో రూ.1.35 లక్షల విలువైన మీల్స్ తిన్నాడని సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ అవుతున్నాయి. బ్రాహ్మణుడైన రాహుల్ బీఫ్ తినడమేమిటంటూ కొందరు నెటిజన్లు మండిపడిపోతున్నారు. ఇదేంటని బూమ్ లైవ్ సంస్థ ఆరా తీస్తే వాస్తవాలేంటో బయటపడ్డాయి. గత శుక్ర, శనివారాల్లో రాహుల్‌గాంధీ దుబాయ్‌లో పర్యటించారు. అక్కడ కొందరు బిజినెస్‌మన్లతో భేటీ అయ్యారు. ఈ సమయంలో ఓ చోట బ్రేక్‌ఫాస్ట్ చేశారు. ఆ ఫొటోలు, కామెంట్లు పోస్టు చేస్తూ కొందరు మొదలుపెట్టిన ప్రచారం వైరల్‌గా మారింది.

ఒకరిని మించి ఒకరు..

రిషి బగ్రీ అనే ఓ నెటిజన్ ఆ బ్రేక్‌ఫాస్ట్ ఫొటోను పెడుతూ.. 'రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ నేతలు దుబాయ్‌లోని హిల్టన్ బాంకెట్ హాల్‌లో ఒక్కొక్కరికి రూ.1.35 లక్షలు చార్జి చేసే బ్రేక్‌ఫాస్ట్ చేస్తూ.. పేదరికం గురించి చర్చించారు' అంటూ ట్వీట్ చేశాడు. దీన్ని కొందరు ప్రముఖులు రీట్వీట్ చేయడంతో వైరల్‌గా మారింది. ఇదే సమయంలో కొందరు ఆ ఫొటోల్లో కనిపిస్తున్న మాంసం ముక్కలను మార్క్ చేస్తూ.. 'బ్రాహ్మణుడైన రాహుల్‌గాంధీ దుబాయ్‌లో బీఫ్ తిన్నాడు చూడండి' అంటూ ప్రచారం మొదలుపెట్టారు. ఇవి మరింత వైరల్ అయ్యాయి. రాహుల్ గాంధీతో భేటీ అయినవారితో, కాంగ్రెస్ నేతలతో మాట్లాడి.. అదో ఫేక్ న్యూస్ అని బూమ్‌లైవ్ తేల్చింది.

మరి ఆ మాంసం ఏంటి?

బ్రేక్‌ఫాస్ట్ ఫొటోలో కనిపించినది టర్కీ కోడి మాంసమని తెలిసింది. అది కూడా రాహుల్‌కు ఎదురుగా కూర్చున్న వ్యక్తి తింటున్నారు. రాహుల్ కేవలం ఆరెంజ్ జ్యూస్ తాగారని, ఎగ్‌ఫ్రై తిన్నారని వెల్లడైంది. సన్నీ వార్కీ అనే బిజినెస్‌మన్ ఆ విందు ఇచ్చారు. దుబాయ్ కరెన్సీ పేరు 'దిర్హాం'. మొదట వైరల్ అయిన పోస్టులో పేర్కొన్న పౌండ్స్ బ్రిటన్ కరెన్సీ. దుబాయ్‌లో బ్రిటన్ కరెన్సీ ఏంటనే డౌట్లూ ఎవరికి రాలేదు.



ఆమెకు మగ గొంతు వినపడదు

ఒరేయ్.. ఒరేయ్ గుడిసె కాలిపోతోంది రా! హా.. వినపడలా. ఇంత పెద్దగా పిలిచినా వినబడట్లేదా? పలుకురా, కనీసం తిరిగైనా చూడ్రా బాబు! ఓరినాయెనో వీడికి బ్రహ్మ చెవుడు అనుకుంటా అనే డైలాగ్స్ చాలానే విన్నాం. పెద్ద పెద్ద శబ్దాలు వినపడని వాళ్లను చూశాం. కానీ కేవలం ఆడవాళ్ల గొంతు మాత్రమే వినబడే వాళ్లను ఎప్పుడైనా చూశారా? బాయ్‌ఫ్రెండ్‌తో హ్యాపీగా లైఫ్‌ను లీడ్ చేస్తున్న ఓ మహిళకు ఈ వింత సమస్య వచ్చిపడింది. చైనాకు చెందిన చెన్ నిద్ర లేవగానే బాయ్‌ఫ్రెండ్‌తో మాట్లాడటం మొదలుపెట్టింది. తను ఎంత మాట్లాడుతున్న అతను సమాధానం చెప్పడం లేదు (అతని మాటలు ఆమెకు వినిపించడం లేదు). ఏంటి మాట్లాడవు అని గట్టిగా నిలదీయబోయింది. అతని వైపు చూసింది. పెదవులు కదులుతున్నాయి. ఏదో చెప్తున్నాడు. కానీ తనకే వినిపించడం లేదని అర్థమైంది. వెంటనే ఇంటి పక్కన స్నేహితురాలిని పిలిచింది. ఆమె మాట్లాడిన మాటలు వినబడ్డాయి. కొంచెం ఊపిరిపీల్చుకుని, ఆస్పత్రికి పరుగెత్తింది. అన్ని చెకప్‌లు చేసిన డాక్టర్లు ఆమెకు అతి అరుదైన రివర్స్ స్లోప్ హియరింగ్ లాస్ (ఆర్ఎస్‌హెచ్ఎల్) జబ్బు వచ్చినట్లు తేల్చారు. ఈ జబ్బు సోకిన వారికి మగాళ్ల గొంతు వినిపించదు. మగాళ్లు మాట్లాడినప్పుడు అతి తక్కువ ఫ్రీక్వెన్సీ కలిగిన తరంగాలు వెలువడతాయి. రివర్స్ స్లోప్ హియరింగ్ లాస్ వల్ల తక్కువ ఫ్రీక్వెన్సీని జబ్బు సోకిన వ్యక్తి గుర్తించలేరు. ఆడాళ్లు మాట్లాడితే పెద్ద ఫ్రీక్వెన్సీ తరంగాలు వస్తాయి. అందుకే చెన్‌కు పక్కింటి మహిళ గొంతు వినిపించింది. అమెరికా, కెనడాల్లో ఈ జబ్బుతో బాధపడుతున్న వారి సంఖ్య మూడు వేలకుపైగా ఉంటుంది. చెవుడు ఉన్న ప్రతి 12 వేల మందిలో ఒకరు ఆర్ఎస్‌హెచ్ఎల్‌తో బాధపడుతున్నారు. ఆసియా ఖండంలో ఆర్ఎస్‌హెచ్ఎల్ జబ్బు కేసు నమోదు కావడం ఇదే తొలిసారి.

Printed and Published by Ankam Ravi on behalf of VIL MEDIA Pvt. Ltd., and Printed at Venkateshwara Publishers, Survey No. 8/A2, Raikunta Village, Pedda Golconda, Shamshabad Mandal, Ranga Reddy District - 500008. and Published from VIL MEDIA Pvt. Ltd., Plot No. 13/A/B/C, Road No. 12, MLA's Extension Colony, Banjara Hills, Hyderabad-500034, Telangana. Editor: Ankam Ravi, Phone: 040-23606681, RNI: TELTEL/2015/64779.